

61



తరిబీతునుపొందిన బాలభటోపాధ్యాయులు, పసిభటులు - వారి శిక్షకులు.

[క్రిందినుండి రెండవ వరుసయందు మధ్యను, ఈ శిక్షాస్థానమునకు కావలసిన సౌకర్యముల నన్నిటిని జేసిన శ్రీ బండి వేంకటకృష్ణయ్యగారు ఆసీనులై యున్నారు.]



నల్లూరుపాలెం శిక్షాస్థానమునందు బాలభట విద్యా ప్రదర్శనము.

RSVM01A114

పరబ్రహ్మాత్మికాందేవీం ♦ భుక్తిముక్తిఫలప్రదాం
ప్రణమ్యస్తౌమితామేవ ♦ జ్ఞానశక్తిం సరస్వతీం.

నాల్గవ సంపుటము.

# గ్రంథాలయ సర్వస్వము.

మొదటి భాగము.

## తత్త్వము

పల్లవి॥

వెఱ్ఱులైతిరిగాదు జనులార । నిజ మింత దెలియక । వెఱ్ఱులైతిరిగాదరు జనులార॥

చరణములు॥

మట్టిలోపల అయిదుచొప్పున । తొట్టిలిరువదియైదు గలవు
సట్టుసట్టున తిరుగుపక్షి । తుట్టుమని పోతేనుమిథ్యా ॥ వె ॥

2 ఏడుకొండలు చుట్టియుండలి । పాడుచున్నది సోహవాదము
తోడునీడ లేదువినియెడు । ఓడులేదూనేడుతేపు ॥ వె ॥

3 పంచభక్ష్యము లారగించే । పంచకోశము లేవగించి
పంచముద్రల త్రుళ్లడంచి । సంచరించు ప్రపంచమాయను ॥ వె ॥

4 సుందరంబగు సరసులోపల । మందిరంబొక టున్నదదుగో
చందనాగరు చర్చసేయుచు । కుందరదన బిలుచుచున్నది ॥ వె ॥

5 ఒక్కచూపులో గాంచితేను । ఒక్కమాటలో తెలిసితేను
ఒక్కజ్యోతిని నిలిచితేను । నిక్కముగ తమ తెలియగలరు ॥ వె ॥

6 చంద్రుఁడెవరు? చుక్కలెవరు? । ఇంద్రుఁడెవరు? యీశుఁడెవరు?
ఇంద్రియంబులు కట్టిచూచితే । ఇన్నితానై యుండలేద ॥ వె ॥

7 బంతిచెట్టు పచ్చనైన । బంతిపువ్వు యెఱ్ఱగాను
అంతెచూడు నరుఁడుగూడ । వింతగాహరి యగుసునిక్కము ॥ వె ॥

8 నీటిచుక్క ముత్యమైతె । తేటియెంగిలి తేనె అయితే
నూటితప్పని గురునిమంత్రము । కోటిసూర్యుల కాంతిగాద ॥ వె ॥

9 బురదలోపల పద్మమైతే । ఉఱుములోపల మెఱుపు మెఱసితే
తరువులోపల యగ్నియుండే । నరునిలో దేవుండుగలఁడు॥ వ॥
10 ఆకసంబున నల్లమబ్బు । తోకచుక్కను తెల్లకాంతి
వేరుజామున ఎఱ్ఱనీడ । మీరు సంసారంబులంతే॥ వ॥
11 ఒకటిలో నొకసంఖ్యయున్నది । ఒకటిలేనిచో సంఖ్యలేదు
ఒకటి బుట్టినచోటు మనకు । ఊహకూడ చొరకయున్నది॥ వ॥
12 ఆదియందున నీవెగలవు । నాదియందున నీవెగలవు
వేదభావము తెలిసితే నీ । ఖేదబ్రహ్మముతాను గాద॥ వ॥
13 దీనిభావము వలయునంటే । పూని ఉంరాలీపకవివలె
జ్ఞాని; శ్రీయాజ్ఞైలలీగురు । సామి బోధనుగాంచవలయును॥ వ॥

---

# దేశ స్వభావమునకును చరిత్రకును గల పరస్పరసంబంధము.

1 భరతఖండమనియు, ఇండియాయనియు, ప్రఖ్యాతిఁగాంచిన మనదేశపు చరిత్ర మిక్కిలి ప్రాచీనమై, అనేక అద్భుతాంశములతోఁ గూడియున్నది. వీటితత్త్వము తెలిసికొనుటకుఁ బూర్వము దేశముయొక్క స్వభావలక్షణము లేవియో నిర్ణయించు టావశ్యకము. ఏలన, దేశచరిత్రలోని ప్రధానధర్మము లనేకములు దేశముయొక్క నైసర్గిక స్వరూపముల ననుసరించి యుండును.

మనదేశమునకు, ఉత్తరమున హిమాలయమును దూర్పున గొంతవఱకు హిమాలయశాఖలును మిగిలిన భాగమున బంగాళాఖాతమును, దక్షిణమున హిందూమహాసముద్రమును, పశ్చిమమున అరేబియాసముద్రము కీర్తారు సులైమాన్ సఫేదుకో పర్వతములును, యెల్లలుగనున్నవి. ప్రభుత్వ సౌకర్యముకొఱకిప్పటి కాలమున బర్మా, బెలూచిస్థాన రాష్ట్రములఁగూడ యిండియాలోఁ జేర్చియున్నారుగాని వీటికిని మనదేశమునకును స్వాభావిక సంబంధమెట్టిదియు లేదు.

2 మనచరిత్రలోనికొన్ని ప్రధానవిశేషములకు మనదేశము పూర్వార్ధగోళముయొక్క నట్టనడుమ నుండుట ముఖ్యకారణమని చెప్పవచ్చును. మనకును తూర్పుభాగమందలి బర్మా, సైయాం, కంబోడియా, మలే, జావా, సుమాత్రా మొదలగు ప్రదేశములకును, పశ్చిమభాగమందలి పర్షియా, అరేబియా, తూర్పు ఆఫ్రికాలోని దేశములకును; యీనిమిత్తమున చారిత్రక విషయములందు సులభపరస్పర సంబంధము సమకూడెను. మనపూర్వులీదేశము లన్నిఁటితో వ్యాపారముఁజేసి వీటిలోఁ గొన్నిటియందు వర్తకస్థానములనే గాక స్థిరనివాసములఁ (Colonies) గూడ నేర్పఱచుకొని నగరము లనేకములఁగట్టి గొప్ప స్వతంత్ర రాజ్యముల స్థాపించి, మన గ్రంథములను శాస్త్రములను చిత్రకళలను మతమును వాటియందు వ్యాపింపఁజేసిరి. ఇన్ని దేశములకు సమీపమునఁ గాక, యెక్కడనో నొకమూల మనదేశముండిన యెడల, వీటియన్నిఁటితో నీలాటిసంపర్కము సంపాదించుట దుస్సాధ్యముగనుండియుండును. ఇదిగాక పూర్వకాలమున ప్రాక్పశ్చిమ ఖండముల మధ్యన జరుగుచుండిన వ్యాపారమున కంతయు మనదేశము రాజబాటయై ప్రసిద్ధిఁగాంచిన యనేక రేవుపట్టణములు గలదై తులలేని యైశ్వర్యము ననుభవించినందుకు గూడ నిదియే హేతువు. ఇందుచేతనే సమీపమందుండిన అన్యదేశీయు లనేకులు మనదేశమునకు వచ్చి మనల సులభముగ జయించుటయు మనదేశములోఁ బుట్టి పెరిగిన బౌద్ధాది మతము లితరదేశముల సులభప్రచారము సంపాదించుటయు, సంభవించెను. ఈ కాలమందు సహితము ఆస్ట్రేలియా, ఏషియా, ఆఫ్రికాలలోని యాంగ్లేయసామ్రాజ్య రాష్ట్రముల మధ్య మనదేశముండుటచేతనే దానిని శత్రువులనుండి రక్షించుటయందు మన ప్రభుత్వమువార పరిమిత శ్రద్ధనువహించవలసి యున్నారు.

3 హిమాలయపర్వతము మన దేశమును యిరుగు పొరుగు దేశములనుండి సంపూర్ణముగ వేరుపఱచుచున్నది. ఇది ప్రపంచములోని పర్వతములన్నిటిలో నెత్తైనదై, 1500 మైళ్ళపొడుగును, 150 మొదలు 250 మైళ్ళ వెడల్పును గలిగి ఉత్తరదేశవాసుల యుపద్రవమునుండి మనల రక్షించుటకు దైవముచే నిర్మితమైన ప్రాకారమో యనునట్లున్నది. దీనియందు గిల్గిట్టు కావల పామీరు ప్రదేశసమీపమునను, కాశ్మీరదేశపు పొలిమేరయందును సట్లిజునది జన్మస్థాన మందుండియు, సిక్కింరాష్ట్ర మార్గమునను) కొన్ని కనుమలున్నవి. ఇవియన్నియు, మిక్కిలి యిరుకుగను అపాయకరముగను యుండుటచే వీటిద్వారా యెవరో కొందఱు యాత్రికులు, వర్తకులు మాత్రము ప్రయాణముచేయుటకు సౌకర్యము లున్నవి. గాని, యాయుధసహితులగు విశేష సంఖ్యగల సైనికులు వచ్చుట మసాధ్యము. అన్యదేశీయు లనేకులు మనదేశముపై దాడివచ్చి మనల జయించిరిగాని, వీరెవరును హిమాలయ కనుమల నుపయోగించినవారుకారు. చీనాదేశీయులగు శాకులు, యూచీలు (తుషారులు) మున్నగు వారుమనదేశమును ప్రవేశించుటకు బూర్వము, వాయవ్యభాగమున ప్రయాణముచేసి, ప్రథమమున కాబూలు ప్రాంతమునుచేరి, యచటనుండి మనదేశమునకు వచ్చిరి గాని, సూటిగ హిమాలయ మార్గముల దాటి రాజాలరైరి. యంత్రనిర్మాణజ్ఞాన మభివృద్ధిగాంచిన నీకాల మందుగూడ నిట్టికార్యముజేయగలవారెవరును లేరు. మనరక్షణార్థమైయింతటిమహోపకారము గావించి, మన సంపదలకు మూలాధారములైన సింధు, యమునా, గంగా, బ్రహ్మపుత్రాది నదులకు జన్మస్థానమగుటచేతనే మన వారిప్పటి వఱకును హిమవంతమును పర్వతరాజముగనే గాక, దైవముగను దేవతల నివాస భూమిగను పరిగణించుచున్నారు.

వాయవ్యభాగమందలి పర్వతపంక్తు లిట్టివికావు. ఇవియు హిమాలయ శాఖలేగాని, వీటియందు లక్షలకొలది జను లేక కాలమున దాటగల కనుమలు పెక్కులున్నవి. వీటిలో ప్రధానములైనవి ఖైబరు, కుఱ్ఱం, బోలను కనుమలు. ప్రాచీనకాలమందు మనదేశము జయించ నుద్దేశించివచ్చిన పారసీకులు, గ్రీకులు, శాకులు, పహ్లవులు, హూణులు, తురకలు, మొదలగు దేశాంతరవాసులందఱు నీకనుమల మార్గముననే మనదేశమును ప్రవేశింపగలిగిరి. ఇవిగాక, బెలూచిస్థానపు తీరమందుండి కరాచిపట్టణమున కుత్తరముగ మనదేశము చేరుటకు మరియొక దారియున్నది. ఇదియు చాలపురాతనమై ప్రాచీనకాలమందు మనదేశమునకును పశ్చిమయేషియాలోని బాబిలోనియా, అసిరియా మొదలగు సామ్రాజ్యములకును జరుగుచుండిన వ్యాపారమునకేగాక ఆరాజ్యములందలి ప్రజలును వారినాగరికతయు మన దేశమును బ్రవేశించుటకు కూడ ప్రధానమార్గముగ నుండెను. మహమ్మదీయులలో మొట్టమొదట మనల జయించుటకు వచ్చిన అరబ్బీలు దీనినే యుపయోగించిరి.

ప్రస్తుతముకూడ మెట్టమార్గమున మనదేశమును దండెత్త నుద్దేశించు విదేశీయులెల్లరు యీవాయవ్య కనుమలగుండ రావలయును. కాని వారికి వేఱుమార్గములు లేవు. ఇందుచేతనే యిప్పటిప్రభుత్వమువారు యీప్రదేశముల రక్షించుటకై యెంతయో శ్రమపడుచు విశేష ద్రవ్యము ఖర్చుపెట్టి యనేక కోటలగట్టి విస్తారసైన్యముల వాటియందు నిలిపియున్నారు. విదేశీయుల యుపద్రవ మెల్లప్పుడీ ప్రాంతమం దత్యధికముగ నుండినందున నిచ్చట నివసించు సిక్కులు మొదలగు పంజాబు రాష్ట్రీయులీ కాలపు హిందువులలోనెల్ల యోధాగ్రగణ్యులనియు, నసమాన బలపరాక్రమ వంతులనియు ప్రఖ్యాతిగాంచియున్నారు. ఇంతకు బూర్వ మీప్రదేశములోని కనుమల జాగ్రతగ కాపాడుకొనుటయందు మనమసమర్థులుగ నుండినందుననే, మన దేశమన్యుల పాలగుట సంభవించెను.

ఆగ్నేయ భాగములోని కనుమలు ప్రయాణీకులకు సులభసాధ్యములు కావు. ఇందుచేత నీదిక్కునుండి మనల బాధపెట్టినవారు చాలమందిలేరు. కాని యుపయోగింపదగిన మార్గములుకొన్ని వీటియందుండుటబట్టి, మంగోలియను జాతివారు కొందఱు ప్రాచీనకాలమందు మనదేశమును బ్రవేశించి, యిప్పటి . అసాం, బంగాళా రాష్ట్రములలో కాపురము లేర్పఱచుకొనగలిగిరి.

4 సముద్రములు దేశమున కెల్లలుగా నుండుటవలన యొకప్పుడు లాభమును, మరియొకప్పుడు నష్టమును సంభవించుచుండును. దీనికిమనదేశపు చరిత్రయే నిదర్శనము. సముద్రసహాయమున నితర దేశములతో సాంగ

త్యము సంపాదించుట సులభము. నౌకానిర్మాణ కుశలులగు ప్రజలు సముద్రతీరమందుండిన యెడల, వారిసహాయముచే నెంతటి గొప్ప సముద్రములనైన దాటుటకవకాశముండును. మన పూర్వులలో నిట్టి సామర్థ్యముగల వారనేకులుండిరి. వారిచే నిర్మితములైన నౌకల సాధనముగఁ జేసుకొని, మనవారు బంగాళాఖాతమును దాటి యావలనున్న దూరదేశములకును ద్వీపములకును వెళ్ళి వాటిని జయించి, గొప్పరాజ్యముల స్థాపించఁగలిగిరి. మన కిరుగుపొరుగున నాకాలమందుండిన విదేశీయులెవ్వరు నౌకాబలమందు మనకంటె నధికులు గాకపోవుటచేత, సముద్రమార్గమున మన దేశమును జయించ ప్రయత్నించు వారెవరును లేరైరి. హిమవత్పర్వతముల వలె సముద్రములు కూడ మనకు రక్షకములై యుండెను.

కాని, యిటీవల, గతించిన నాలుగైదువందల సంవత్సరములనుండి, యివియే మన స్వాతంత్ర్య నష్టమునకు హేతువులైనవి. పదిహేనవ శతాబ్దాంతమందు ఐరోపియన్లు సముద్రమార్గ మొకదానిని మన దేశమునకు గనిపెట్టిరి. అది మొదలు పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషు మొదలగువారు మనదేశమును జయింపఁ బ్రయత్నించి తుదకాకార్యమును సాధించఁగలిగిరి. సముద్ర సహాయమే లేనియెడల నంతదూరమందుండు విదేశీయులు మనల వశపరచుకొనుట సంభవించి యుండదు. సముద్రయానమందును నౌకానిర్మాణమందును వారు మనకంటె యెక్కువ నేర్పును ధైర్యసాహసములును గలిగినవారు. వారి నౌకాబలము మన దేశపుప్రభువుల నౌకాబలముకంటె నత్యధికముగ నుండెను. ఇదియే వారి విజయమునకు హేతువు. సముద్రము లెల్లలుగ నున్నప్పుడు ప్రభువులు విశేషనౌకాబలముఁ గలిగియుండినఁ గాని సముద్రమార్గమునవచ్చు విదేశీయుల బాధ తప్పించుకొనుట దుస్సాధ్యము. కనుక ప్రస్తుతకాలమందుకూడ వాయవ్యభాగమందలి నేలకన్న సముద్రమందలి బ్రిటిషునౌకలే మనల నెక్కువగఁ గాపాడుచున్నవి.

సముద్రయానమందు తగినంత నేర్పును మనవారు సంపాదించక పోవుటకనేక కారణములు గలవు. మనదేశము మిక్కిలి సారవంతమైనది. విదేశవ్యాపారమవసరములేకయే మనకుఁ గావలసిన పదార్థములనన్నిఁటిని స్వదేశమం దుత్పత్తిఁజేసుకొనుటకు వలయు సదుపాయములన్నియు మనకున్నవి. సముద్రయానమందు నేర్పరులై విదేశములకు వెళ్ళి సరుకులఁదెచ్చుకొన్నఁగాని జీవయాత్రజరుగదన్న భయము మనపూర్వులకు లేకయుండెను. ఇట్టి సందర్భమందీ విషయమై ప్రజ్ఞానుభవములఁ బొందఁగోరినవారి సంఖ్య చాల తక్కువగనుండెను. ఇదిగాక ఇంగ్లండు, హాలెండు, గ్రీసు మొదలగు పాశ్చాత్యదేశముల సముద్రతీరములందువలె మన దేశమున గొప్పయోడలు నిలుచుటకుఁదగిన రేవు లనేకములు లేవు. తూర్పుతీరమం దిట్టివి లేవనియే చెప్పవచ్చును. పశ్చిమ తీరమందు బొంబాయినగర మున్నదిగాని యినుపదారులు లేకపూర్వము దానినుండి మనదేశపు మధ్యభాగమునకు మెట్టమార్గమున వెళ్ళుట సులభసాధ్యము కానికారణముచే దానిని రేవుపట్టణముగ నుపయోగించుటకు వీలులేక యుండెను. సముద్ర మనేకప్రదేశములలో భూమిలోనికిఁ జొచ్చుకొనివచ్చి తీరమును వంకరగఁ జేసినయెడల, రేవులేర్పడుట కవకాశముండును. మన సముద్రము లట్టివికావు. ఇంతయేగాక, తీరమందీ సముద్రములు విస్తారము లోతులేనివై, యిసుకతో నిండియుండుటచేత, గొప్పయోడలన్నియు, సముద్రపుగట్టునకు రాఁజాలక, నాలుగైదు మైళ్ళదూరమందుండవలసియున్నవి. కొన్ని దేశములయందు నదుల ముఖద్వారములు విశాలములై, పెద్దనావలు నిలుచుటకును, ప్రవాహమార్గమున విదేశములోపలికిఁ బోవుటకును, సౌకర్యములుండును. మన దేశమందాలాటి సదుపాయములు తక్కువ. గంగానది ముఖద్వారముతప్ప మిగిలినవన్నియు మిక్కిలి యిరుకై, యిసుక దిబ్బలతో కూడియుండుటచేత చిన్నపడవలకేగాని పెద్దనావలకవి యుపకరించుటలేదు. ఇన్ని లోపములు మనసముద్రతీరమందుండుటఁ బట్టి నావలఁజేయువారును వాటిని నేర్పుతో నుపయోగించగలవారును బహుస్వల్పము. ఈకారణముచే నౌకాబలము మనకుఁ గావలసినంత విశేషముగ నభివృద్ధిఁగాంచలేదు. ప్రాచీన గ్రంథములలో మనవారు వర్ణించిన యుద్ధములన్నియు భూమిమీఁదఁ జరిగినవికాని సముద్రయుద్ధములుకావు. శ్రీరాములవారు లంకాద్వీపమునకు సేతుమార్గమున గాని నౌకాసహాయమున వెళ్ళలేదు. అర్థశాస్త్రములలోను నీతిసారములయందును ప్రభుబలముల నిర్ణయించు సమయమున చతురంగబలమున కిచ్చిన

ప్రాముఖ్యత గ్రంథకర్తలు నౌకాబలమున కిచ్చినదిలేదు. మన దేశమున బ్రసిద్ధిగాంచిన సామ్రాజ్యము లన్నియు భూమినే కాని సముద్రముల సాధారముగ జేసుకొనినవి కావు.

6 ఆంగ్లేయ సామ్రాజ్యస్థాపనకు బూర్వము మన దేశమునంతయు నేకచ్ఛత్రముగ పరిపాలించిన వారెవరును లేరు. మహాశూరులనియు జక్రవర్తి శ్రేష్ఠులనియు బిరుదువహించిన అశోక, విక్రమాదిత్య, శ్రీహర్ష, కృష్ణదేవరాయ, అక్బరు మొదలగు మహానీయులుకూడ దేశములోని కొంతభాగమునకుమాత్రమే పరిపాలకులుగ నుండిరి. అనాదిగ మనదేశమందొక్క రాజ్యము గాక యనేక స్వతంత్రరాజ్యము లుండినవి. వీటినే పౌరాణికులు యాభైయారు దేశములుగ వివరించియున్నారు. దేశమొక్కటియైనను రాజ్యములు పెక్కులుండుటకు కొన్ని హేతువులున్నవి. వీటిలో మొదటిది దేశముయొక్క వైశాల్యతయే. మన దేశము 1,630,059 చదరపుమైళ్ళ విస్తీర్ణముగలదై, యింగ్లీషువారు నివసించు దేశమునకంటె పదిహేనురెట్లు గొప్పదై, యిరోపాఖండమందలి (రష్యాతప్ప) దేశములన్నిటి వైశాల్యమెంతయో అంతటివైశాల్యముగలదిగ నున్నది. ఇంత గొప్ప దేశమును యొకరు సంపూర్ణముగ జయించి పరిపాలించుట సులభసాధ్యము కాదు. ముఖ్యముగ, ఇనుపదారులు లేక, దేశములోనియొకభాగమునుండి మఱియొకభాగమునకు బ్రయాణము జేయుట కష్టతరమైయున్న కాలమందిట్టి మహాకార్యము జేయుట కవకాశములులేకయుండెను. ఇదిగాక వైశాల్యాధిక్యమువలన బ్రజల యాచారవ్యవహారములందనేకభేదములు పుట్టుటయు, వీటివలన రాజకీయ విషయములందుగూడ వారు వేర్వేరు ప్రభువుల యధికారమునకు వశులగుటయు సంభవించెను.

మన దేశములోని యొకప్రాంతమునుండి మఱియొక ప్రాంతమునకు వచ్చుట కెన్నియో ఆటంకములున్నవి. స్వాభావికముగ నీదేశము మూడుభాగములుగ విభజింపబడియున్నది. ఇందులో మొదటిది యుత్తరయిండియా. దీనికే ఆర్యావర్తమనియు హిందూస్థానమనియు పేర్లుకలవు ఇది వింధ్య, హిమాలయపర్వతములకు మధ్యనున్నది. వింధ్య పర్వతములకును కృష్ణా తుంగభద్రానదులకును మధ్యనుండు (రెండవ) భాగమునకు దక్కను (దక్షిణాపథము) అని పేరు. దీనికి దక్షిణమున కన్యాకుమారివఱకునుండు ప్రదేశము మూడవభాగమగు దక్షిణయిండియా లేక ద్రావిడము, హిందూస్థాన, దక్షిణాపథములకు మధ్యన వింధ్యపర్వతములు, నర్మదానది, సాత్పురా పర్వతములు, తపతినది, ఉత్తరకనుమలు మొదలగునవి యడ్డములుగ నున్నవి. వీటినన్నిటిని దాటినగాని హిందూస్థానమందుండి దక్షిణదేశమునకు వచ్చుటకు వీలులేదు. సూర్యబింబమునుగూడ నడ్డగించుచుండిన వింధ్యపర్వతమును అగస్త్యమహర్షి యేదియో నొకవిధమున వశపఱచుకొని దక్షిణదిక్కునకు రాగలిగెనను పౌరాణికగాథ యీయాటంకముల నతిక్రమించుటకై పూర్వులు పడినకష్టమును సూచించుచున్నది. సులభముగ దక్షిణదేశమును బ్రవేశించుటకు వీలులేకపోవుటచేత, ననేక విషయములందు దాక్షిణాత్యుల చరిత్రకును ఔత్తరీయుల చరిత్రకును నపరిమితభేదము కనబడుచున్నది. ఆర్యుల వైదికమతమును, వారిసాంఘిక వ్యవస్థలును, వారి యాచారవ్యవహారములును, వారినాగరికతయు, హిందూస్థానమందు వ్యాపించినతర్వాత, తగినంత సులభముగను సంపూర్ణముగను దక్షిణదేశమందు వ్యాపించలేదు. ఆర్యుల భాషయగు సంస్కృతము, ఉత్తరయిండియాలోని యిప్పటి ప్రజలు మాట్లాడుచుండు హిందీ, పంజాబీ, బంగాళీ మొదలగు భాషలన్నిటికి మూలమై, ఆర్యావర్తమందంతట ప్రచారము గాంచగలిగినదికాని, దక్షిణదేశమందలి ద్రావిడ భాషలగు నాంధ్రము, కన్నడము, అరవము మొదలగువాటిని వశపఱచుకొనజాలక పోయెను. ఉత్తర రాష్ట్రవాసులకును దాక్షిణాత్యులకును పరస్పరసాంగత్యము కష్టమగుటయే దీనికి హేతువు: ఇట్లే ఆర్యావర్తపరిపాలకులు కొందఱు దక్షిణాపథమును, దక్షిణాపథ ప్రభువులార్యావర్తమును, జయించి వశపఱచుకొనుట కుద్దేశించినను వారి ప్రయత్నములు సాధారణముగ కొనసాగక, కొనసాగినపుడుగూడ తాత్కాలిక ఫలమునే గాని స్థిరవిజయము నివ్వకపోవుటకే నైసర్గికాటంకములే ప్రధానకారణము. దైవనిర్మితములయిన యీయడ్డములులేని పక్షమున మనదేశమంతయు బూర్వకాలమందుగూడ నొక్క ప్రభుత్వమునకే వశమైయుండి యుండును.

వాయవ్య భాగమందునుండి మనదేశమును ప్రవేశించి, హిందూస్థానమును స్వాధీన పఱచుకొనిన అన్యదేశీయుల సేనలు దక్షిణదేశపు పరిపాలకులు కాకపోవుటకును, బలవంతులనియు పౌరుషవంతులనియు ప్రఖ్యాతిఁ గాంచిన మహామ్మదీయుల మతము సహితము ఉత్తరయిండియాయందువలె దక్షిణభాగమందు నాటుకొనకుండుటకు కూడ నిదియే కారణమని చెప్పవచ్చును

దక్షిణాపథ, దక్షిణయిండియాలకు మధ్యనున్న కృష్ణా, తుంగభద్రానదుల దాఁటుట సులభమగుటచే నీ రెండు ప్రదేశములలోని ప్రజలకు పరస్పరభేదము లనేకము లగుపడుట లేదు.

దక్షిణభాగమును ప్రవేశింపఁగోరు పరదేశస్థులకు మెట్టమార్గముకంటె సముద్రమార్గమె యెక్కువ సుకరమైనది. ప్రాక్పశ్చిమసముద్రతీరముల రెంటియందును పూర్వకాలమున నిప్పటికంటె రేవుపట్టణము లెక్కువగ నున్నట్టును, వీటిలోఁ గొన్ని కాలవశమునను సముద్రస్వభావమందు కలిగిన కొన్ని మార్పులవలనను క్షీణతఁ జెందినట్టును, దేశచరిత్ర వలనఁ దెలియుచున్నది. ఈ రేవుల నాధారముఁ జేసికొని దక్షిణయిండియాకు అన్యదేశీయు లెందఱో వచ్చి యుండవచ్చును కాని కారణాంతరముచే నట్లు జరుగలేదు. ప్రాచీనకాలమందు మనకు తూర్పుగనుండు బర్మా మొదలగు దేశములలోనివారు నాగరికతయందును నౌకాబలమందును మనకంటె యుత్కృష్టులు గాకపోవుటచే ఆవైపునుండి తూర్పుతీరపు రేవులచేరువారెవరును లేరైరి. పశ్చిమదేశము లందలి పారశీకులు అరబ్బీలు మొదలగువారు వ్యాపారమందు చాలప్రసిద్ధిఁ గాంచి మనదేశపు పశ్చిమతీరమునకు వచ్చుచుండిరిగాని వారుకూడ సముద్రతీరమును దాఁటి దేశము లోనిమధ్యభాగమును చొరలేకపోయిరి. దీనికి గారణము పడమటి కనుమలు. ఇవి పశ్చిమ సముద్రమునకును దక్షిణాపథ దక్షిణ యిండియాలకును మధ్యనుండు యెత్తైన కొండలు. వీటిని దాఁటినఁగాని నీప్రదేశములలోపలిభాగమును జేరుటకు వీలులేదు. ఈ కొండలు సముద్రతీరసమీపమందుండుటచే, వాటికిని సముద్రమునకును మధ్యనుండు దేశము మిక్కిలి సంకుచితమై అన్యదేశీయుల సేనలు స్థిరనివాసము లేర్పఱచుకొనుటకుఁ గావలసిన వసతులు లేక యున్నది. ఈ కనుమల ప్రాంతమందు కాపురముచేయువారు మిక్కిలి పౌరుషవంతులై, స్వతంత్రరక్షణయందు కడుదీక్షాపరులై, యున్నారు. శివాజీకాలమునుండి ప్రసిద్ధిగాంచిన మహారాష్ట్రులిక్కడివారే. పర్వతప్రదేశములనివసించువారగుటచే వీరు సహజశరీరపటుత్వముగలవారై పర్వతశిఖరములమీఁద దుర్గములగట్టుకొని, పరులెవ్వరు దేశములోనికిఁ జొరకుండునట్లు యుద్ధముఁ జేయుచుండిరి. ఈకారణముచేత పశ్చిమతీరమునకు విదేశీయుల సేనలు వచ్చుచుండినను, వారు దక్షిణాపథమును గాని దక్షిణయిండియానుగాని జయింపజాలరైరి.

తూర్పు భాగమందుకూడ నిట్లే తూర్పుకనుమలను కొండలున్నవి. ఇవి సముద్రమునకుఁ గొంచెము దూరమందుండుటచే, వీటికిని సముద్రతీరమునకును మధ్యనుండుప్రదేశము విశాలముగనున్నది. ఇందుచేతను, దీనియందు గోదావరి, కృష్ణా, కావేరి మొదలగు గొప్పనదులు ప్రవహించుచుండుటచేతను, దక్షిణ యిండియాలోని తూర్పుభాగము పశ్చిమభాగముకంటె నెక్కువ సారవంతమై, యెక్కువ ప్రజాసంఖ్యనుకలదై ఉత్తమ నాగరికత కనాదిగ నెలవైయున్నది. దేశము సుభిక్షముగనున్నగాని ప్రజలభివృద్ధిఁ గాంచలేరు. గనుకనే, దక్షిణదేశమందలి పాండ్య, చోళ, పల్లవ కాకతీయాది ప్రాచీనరాజ్యములన్నియు తూర్పుభాగమునబుట్టి, క్రమక్రమముగ పశ్చిమభాగమునకు వ్యాపించగలిగినవి. పశ్చిమతీరమందలి రాజ్యములెప్పుడు యింతటి ప్రాముఖ్యతను సంపాదించలేదు. మన నాగరికతాచిహ్నములయిన పుణ్యక్షేత్రములును ప్రశస్తదేవాలయములును తూర్పుభాగమందేయున్నవి. పడమటి కనుమలకును తూర్పుకనుమలకును గలభేదమే, తూర్పు పడమటి ప్రదేశచరిత్రములలోని యీ భేదములకు కారణమాయెను.

మహారాష్ట్రుల స్వాతంత్ర్యమును పడమటికనుమలు రక్షించినట్లు హిందూస్థానమందలి రాజపుత్రుల స్వరాజ్యమును యెడారులు కాపాడినవి. రాజపుత్రస్థానములోని యారావలి పర్వతములకుఁ బశ్చిమమున సింధునదీప్రాంతమువఱకు యెడారిమయమగు ప్రదేశమొకటియున్నది. ఉత్తర యిండియాలోని పంజాబు రాష్ట్రమును జయించినవారు నూటికి దక్షిణదిక్కున ప్రయాణముఁ జేసి యిప్పటిబొంబాయి రాష్ట్రమును ప్రవేశింపకయుండు

నట్లు,యీయెడారి యడ్డగించుచున్నది. దీనియందిప్పుడు యోధపురము, బికానీరు, జయసల్మీరు మొదలగు స్వదేశసంస్థానములున్నవి. మహమ్మదీయులు ఉత్తరయిండియాను జయించినప్పుడు వారియుపద్రవమునుండి తప్పించుకొనుటకై రాజపుత్రులీ యెడారిని బ్రవేశించి, యచ్చట పట్టణముల గట్టుకొని, స్వతంత్రరాజ్యముల స్థాపించుకొనిరి. అది మొదలు వీరిని వశపఱచుకొనుటకై తురకలనేక పర్యాయములు ప్రయత్నించిరి. కాని వీరి యుద్యమములు పూర్తిగ ఫలింపఁజాలినవికావు. యెడారిలోగొప్పసైన్యములు ప్రయాణముచేయుట సులభసాధ్యము కాకపోవుటయే దీనికి హేతువు.

పర్వతములు, నదులు, యెడారులు, అడవులు మొదలగునవి యీవిధముగ దేశమును విభజించి కొంతలాభమును మఱికొంత నష్టమును మనకుగలుగఁజేసినవి.

5 పూర్వకాలమందు ఔన్నత్యముగాంచిన నాగరికతలన్నిఁటికిని గొప్పనదులు ప్రవహించు ప్రదేశములుజన్మస్థానములుగ నుండెను. నైలునదీ తీరమందలి యీజిప్టుదేశమును, యూఫ్రటీసు, టైగ్రిసు నదులు ప్రవహించు బాబిలోనియా, అసిరియా, పారసీకసామ్రాజ్యములును, హోయాంగ్ హో, యాంగ్సికియాంగ్ నదులతీరమందుండు చీనాదేశమును దీనికి నిదర్శనములుగనున్నవి. మనదేశముకూడ నిట్టిదియనియే జెప్పవచ్చును. హిందూస్థానమందు సింధు, యమునా, గంగా, బ్రహ్మపుత్రాదినదులును, దక్షిణదేశమందు నర్మదా, తపతీ, మహానదీ, గోదావరి, కృష్ణా, కావేరీనదులును ప్రవహించుచున్నవి. ప్రసిద్ధిగాంచిన మౌర్య, ఆంధ్ర, గుప్త, శ్రీహర్ష, చోళ, విజయనగరాది సామ్రాజ్యముల కన్నిఁటికి యీ నదులే మూలాధారములై వాటియౌన్నత్యమును విస్తరింపఁజేసినవి. ప్రజల నైశ్వర్యవంతులఁ జేయుటయందును, తన్మూలమున ప్రభువుల శక్తిసంపన్నులఁ గావించుట యందును, నదులవలె నుపచరింపగలవి మరేవియులేవు. వీటి నన్నిఁటిలో ముఖ్యముగ గంగానది మనకు గావించిన యుపకార మింతింతయని జెప్పుటకు సాధ్యముకాదు. ఈనది ప్రవహించు ప్రదేశమత్యంత సారవంతమై, ప్రజలకు నీటిలోపమును గలుగఁజేయక, సమస్తమైన పంటలకు నెలవై, కర్షకులకు వలయు నాహారపదార్థముల సులభముగను అపరిమితముగ నుత్పత్తిఁ జేయించుచు, ప్రపంచములోని గణనీయములగు సుక్షేత్రములలో నొక్కటియై వెలయుచున్నది. దీనియందు,ముఖద్వారము మొదలు ప్రవాహసహాయమున ననేకవందల మైళ్ళవఱకు వస్తుకపుటోడలు ప్రయాణముఁజేయుట కవకాశమున్నది. ఇందుచేఁ బ్రజలకు జీవనోపాయము సులభముగ దొఱకుటయు, తన్మూలమున వారు విద్యాసంపన్నులై నాగరికతాగ్రగణ్యులగుటయు సంభవించుచున్నది. గంగానది తీరమందున్న పాటలీపుత్రమును రాజధానిగాఁ గలవారగుటచేతను, దానిప్రాంతమందలి సారవంతమైన ప్రదేశముల స్వాధీనపఱచుకొనుటచేతను, మౌర్యచక్రవర్తులు మిగిలినవారికంటె ముందుగమనదేశమున మొదటి సామ్రాజ్యమును స్థాపించఁగలిగిరి. స్థానేశ్వరము, ఇంద్రప్రస్థము, కన్యాకుబ్జము, ప్రయాగ, వారణాసి, పాటలీపుత్రము, కాళీఘట్టము మొదలగు ప్రఖ్యాత నగరములన్నియు గంగయొక్కయో లేక దాని ప్రధాన యుపనదియగు యమునయొక్కయో తీరమందున్నవి. మనమతమునకును సారస్వతమునకును శాస్త్రములకును యిదియే జన్మస్థానము. ఈనదుల ప్రాధాన్యముచేతనే మనదేశపు చరిత్రయందు దక్షిణభాగముకన్న హిందూస్థానమెక్కువ యాధిక్యతను బొందఁగలిగెను. తుదకు యిటీవలగూడ, ఆంగ్లేయులు దేశమునంతయు సులభముగ స్వాధీనపఱచుకొనుటకు గంగానది ప్రవహించు బంగాళారాష్ట్రమును వారు మున్ముందుగ జయించుటయే కారణము. బ్రహ్మపుత్రానదిలో చాలభాగము మనదేశమున కావలగ హిమవత్పర్వతమున కుత్తరముగ నుండుటచేతను, సింధునదీ ప్రాంతములోని ప్రదేశములు యెడారిమయములుగ నుండుటచేతను యివి ప్రవహించుభాగము గంగా, యమునానదీ తీర దేశములంతటి ప్రాముఖ్యతనుగాంచలేదు. ఇట్టిలోపములు గొన్నికొన్ని నదులలో కనుపడినను మొత్తముమీఁద మనయైశ్వర్యమున కంతయు నదులే మూలకారణములని జెప్పవచ్చును.

6 ప్రాచీనకాలమునందుండి మనదేశము సుభిక్షమగు దేశములలో ముఖ్యమైనదిగ పరిగణింపఁబడుచున్నది. నదులు, సారవంతమైన నేల, యుక్తమగు శీతోష్ణస్థితి, దట్టములైన అడవులు, సారముగల గనులు మొదలగు స్వభావసిద్ధమైన సౌకర్యము లనేకము లుండుటవలన, సమస్తధాన్యములు, వైరులు, లోహములు, కంప్యములు మన

దేశమం దుత్పత్తి యగుచున్నవి. ఇప్పటికంటెగూడ యెక్కువగాఁ బూర్వకాలమం దపరూప పదార్థము లనేకములు దొరకుచుండినవి రత్నములు, సుగంధద్రవ్యములు, సుకుమారులు, ధనికు లుపయోగింపఁ దగిన బట్టలు, మున్నగువాటిని విదేశీయులు మనదేశమందుండియే తీసుకొనిపోవుచుండిరి. మనదేశపు కర్మకారుల నైపుణ్యమద్వితీయమై, విలువగలసామగ్రుల నేకము లుత్పత్తి జేయుటయందు దోడ్పడుచుండెను. విస్తారము సంపదగల దగుటచేత, మనదేశమును యితరులు స్వర్ణభూమిగ భావించుచుండిరి. ఈయైశ్వర్యము మనకుఁ గొన్ని విషయముల లాభమును మఱికొన్నిఁటియందు నష్టమును గలుగఁజేసినది. విదేశములతోటి వ్యాపారమిందుమూలమున నభివృద్ధిఁగాంచెను విదేశస్థులగు బాబిలోనియావారు, పారసీకులు, అరబ్బీలు, రోమకులు, ఇతర యిరోపియన్లు మొదలగువారు మనదేశమునకు వర్తకులుగవచ్చుటయు, మనమితర దేశములకు వెళ్ళుటయు, యిందుచే పరులతోటిసాంగత్యము మనకు లభించుటయు వారి నాగరికత మన నాగరికతతో కొంతవఱకు మిళితమై మనయాచారవ్యవహారములలో మార్పులు గలుగుటయు మొదలగు ఫలముల నేకములు గలిగినవి. ఇదిగాక విశేష దేహపరిశ్రమ యవసరములేకయే మనకుఁ గావలసిన పదార్థము లన్నియు మనకు దొరకుచుండినందున మనవారున్న దానితోఁదృప్తి చెందుటయు, కొంచెముసోమరులుగనుండుటయుగూడ సంభవించెను. పాశ్చాత్యదేశములలో ప్రజలు విస్తారముగ కష్టపడినగాని వారికి వలయు నాహారపదార్థములు దొరకుటలేదు. గనుక వీటిని సులభముగ సంపాదించుట కన్నియో యుపాయముల కనుఁగొనుటకై వారు ప్రకృతిశాస్త్రములయందు విస్తారముగ కృషి చేయవలసియున్నారు. ఇందుచే పాశ్చాత్యదేశములవలె మనదేశమందు ప్రకృతిశాస్త్రజ్ఞానమభివృద్ధిఁగాంచలేదు. ఇహలోకమందు సౌఖ్యము సులభముగ లభించుచుండుటచే మనవారు పరలోకజ్ఞాన సంపాదనార్థమై వేదాంతాది ఆధ్యాత్మిక శాస్త్రములలో విచారముల సల్పుచుండిరి. దీని వలన కలిగిన లాభనష్టములు చదువరులే యూహించుకొనెదరుగాక. దేశము సంపదతోఁ దులతూగుచుండినందున దీనిని స్వాధీనము చేసుకొనవలయుననెడి దురాశ పరులయందు జనించి మనస్వాతంత్ర్యమునకు భంగము కలిగెను.

దేశచరిత్రయొక్క నిజతత్త్వముఁ దెలుసుకొనవలయునన్న దేశస్వభావ నిర్ణయమవసరమని యీయంశముల వలన స్పష్టమగుచున్నది.

—మామిడిపూడి వేంకటరంగయ్య,
ఎం. ఏ.

---

## విజ్ఞప్తి.

సీ॥ ఘనగుణాఢ్యులు ♦ కవ్యముల్ వ్రాయుట, గ్రంథాలయంబుల ♦ కతనఁ గాదె
కాళిదాసాది సత్కవులు పేర్గాంచుట, గ్రంథాలయంబుల ♦ కతనఁ గాదె
తొల్లి గైర్వాణి జగల్లాస్య మొనయుట, గ్రంథాలయంబుల ♦ కతనఁ గాదె
భారతమాత విశ్వఖ్యాతిఁగాంచుట, గ్రంథాలయంబుల ♦ కతనఁ గాదె
గీ॥ కాలవశమున నడుగంటె ♦ గ్రంథ మందిరంబులెల్లను భారత ♦ ప్రతిభవోలెఁ
గటకటా! పారదేశిక ♦ జ్ఞానమే ప్రబోధకంబయె మనకు సత్పురుషులార! ॥

సీ॥ సృష్టికిఁ బ్రతిసృష్టిఁ ♦ జేయఁజాలు రసాయనాదిక శాస్త్రంబు ♦ లబ్బుటెట్లు
కదలికేనియు సాగ ♦ కట్టఁ గట్టఁగఁ జాలు, శిల్పవిద్యలు వృద్ధిఁ ♦ జెందుటెట్లు
వాయువిమానాది ♦ వస్తువుల్ ప్రచరించు, శాస్త్రవిజ్ఞాన మెసంగుటెట్లు
ఆశ్రయంబువదీ ♦ తానాగతంబుల, నెఱిఁగించు కృతులు లభించుటెట్లు
గీ॥ కటకటా! యన్నియుంబోయెఁ ♦ గడకు నున్న, వాని నేనియుఁ జదివెడు ♦ వారు లేరు
విశ్వమెల్లను రక్షించు ♦ విద్యయొక్క, యాంగిలేయమె నుండి మహాత్ములార!

సీ॥ పాట్టముల్ కట్టుట ♦ పాంటె తేయులకు నర్పించు పొత్తములు లె♦క్కింపఁ గలమె
మేదర పెట్టెల♦లో దిక్కులేక చెదలచేఁ గృశించు గ్రం♦థమ్ము లెన్ని
ప్రకటింపఁ దనఖ్యాతి ♦ భంగమౌనని యెంచు, చేవటుల పుస్తక ♦ సంఖ్య యెంత
అన్యులు గొంపోవు ♦ నప్పుడు సంద్రమ్ము,నకె మునింగిన గ్రంథ ♦ నావ లెన్ని
గీ॥ యవనరాజులు మునువగ్ని♦యందు వేల్చ, గ్రంథ మందిరముల సెన్న♦గాఁ దరంబె?
గతమునకు వగవంబని♦గాదు కాని, తలఁప జల జల రాలు క♦న్నుల జలంబు.
సీ॥ అర్పించుఁడయ్య మీ♦యటకలమీఁద తపం బొనర్చెడు పుస్త♦కంబు లెల్ల
నవనగరంబు గ్రం♦థాలయంబున కేగి, చదువుఁడి గ్రంథరా♦జంబు లెల్లఁ
బదువుటయేఁ గాక ♦ చదువు నేరనిమూఢ, నరులకు బోధ యొ♦నర్పుఁడయ్య
దాంభికవ్యయము వృ♦థాగఁ జేయక గ్రంథ, సంచయమ్మును సమా♦ర్జించుఁడయ్య
గీ॥ మీరు మీరు యథాశక్తి ♦ లేదు యనక, తృణమొ పణమొ యొసంగుచు ♦ ఘనముగాను -
శాశ్వతంబుగ నుండెడు ♦ స్థాపనలను, జేసి యశమందుఁ డాంధ్రదే♦శీయులార! ॥
సీ॥ జాతీయ మనుమాట ♦ సంస్మరించినఁ గర్ణ,ములు "శివశివ"యంచు ♦ మూసికొంద్రు
జాతీయ విద్యల♦సంగతి వచియింప, విద్యయే లేదని ♦ వెఱచుచుంద్రు
మనదు ధర్మములు మ♦ర్మము లుపదేశింప, వినరయే పెడచెవిఁ ♦ బెట్టుచుంద్రు
జాతీయ విద్యల♦శక్తి యోజింపక, యర్థము కాలము ♦ వ్యర్థ పరతు
గీ॥ రయ్యయో! యెట్టియజ్ఞాన ♦ మందుచుండె,నార్యసంతతి, వేగఁ బూ♦ర్వాతిశయము
నర్పఁ జెప్పి సద్బోధ యొ♦నర్పుమమ్మ, అనుపమశ్రీసమేత యో ♦ యాంధ్రమాత! ॥

—జంధ్యాల వేంకట శివకవులు.

---

# ఆర్యుల ఉత్తరధృవ నివాసము.

## వేదప్రమాణసహితము.

శ్రీయుత లోకమాన్య బాలగంగాధర తిలక్ గారు వ్రాసిన గ్రంథములోని సారాంశము:—

### ప్రథమాధ్యాయము.

మనదేశపు చరిత్రనైనను తెలిసికొనఁ గోరినయెడల మన కాధారములేమి? ఆయాదేశముల వారిచే వ్రాసియుంపఁబడిన చరిత్రగ్రంథములే ముఖ్యాధారములు. ఈగ్రంథములు మనకుఁ గొంతవఱకే సహాయముఁ జేయగలవు. కాని యంతకంటెను యింకపూర్వకాలపు చరిత్ర దెలిసికొనఁ గోరిన యెడల మనకీ గ్రంథములేమియును తోడ్పడఁజాలవు. ఈ చరిత్ర గ్రంథముల మూలమునమన మెంతకాలము వఱకు తెలిసికొనగలమో ఆకాలమునకు "చారిత్రకయుగము" అనిపేరు బెట్టుదము. ఈచారిత్రకయుగమును దాటిపోయిన పిమ్మట, మనమీ ప్రపంచస్థితి నెట్లు తెలిసికొనగలము? అప్పటి ప్రజ లెట్లుండెడివారు? ఏవిధముగ వర్తింపుచుండెడివారు? వారియాచారవ్యవహారము లెట్లుండెడివి? వీనినన్నిఁటిని దెలిసికొనుటకు మన కాధారము లేమైనకలవా? ఆయాదేశములవారనాది నుండియు బహు భక్తిశ్రద్ధలతో గౌరవింపుచు బూజింపుచు నుండిన మతగ్రంథములు కొంతవఱకు మనకుఁ దోడ్పడఁగలవు. వారియాచారములును, వారుచెప్పుకొనుచుండు పూర్వగాథలును (Mythologies) కొంతవఱకు మనకు త్రోవఁజూపును. ప్రపంచములోనుండు వివిధభాషలను పరీక్షించి, చూచి, యొకభాషకును మఱియొక భాషకును గల తారతమ్యములను, భేదము

లను, పోలికలను, సంబంధబాంధవ్యములను బాగుగ పరిశీలించుట (Comparitive Philology) మూలముననుగూడ పూర్వచారిత్రము కొంత తేటపడఁగలదు.

మనమింకను వీనినన్నిఁటినిఁ గడచి యింకొక మెట్టు పైకి పోదము. ఈపైన జెప్పిన సాధనములద్వారా కొంతకాలమువఱకే ప్రపంచస్థితి మనకు తెలియఁగలదు. అంతకంటెను యింకఁబూర్వకాలపు చరిత్రను తెలిసికొనుట కేమైన నాధారములుగలవా? మనమెప్పుడైనను భూమిని త్రవ్వుచుండఁగఁ బూర్వులచే బహుకాలము క్రిందట నుపయోగింపఁబడిన గొన్నికొన్ని చిత్రమైన వస్తువులు దొరకుచుండును. ఈవిధముగ భూమిలో నణఁగియున్న యనేకమైన వస్తువులను త్రవ్వి యెత్తి దానిని పరీక్షించుటవలన కూడ మనకు మన పూర్వుల చారిత్రమెక్కొంత బోధపడఁగలదు. ఇట్లు "భూమిలోనుండు వస్తువులను త్రవ్వి యెత్తి, వానిని పరిశోధించి, తన్మూలమున పూర్వకాలపు చరిత్రను తెలిసికొనగలుగుట"యను నది ప్రస్తుతమొక గొప్పశాస్త్రముగఁ బరిగణింపఁ బడుచున్నది. దీనికే "భూనిక్షేప పరిశోధకశాస్త్రము" (archaeology) అని పేరు. ఈశాస్త్రపరిశోధనలవలన బూర్వచారిత్రమును మనము కొంతవఱకు దెలిసికొనఁగలము. కాని యంతకంటెను యింకఁబూర్వయుగముల నాఁటిచరిత్రను దెలిసికొనుట కాధారములేమైన గలవా? దీనిని దెలిసికొనుటకు "భూగర్భశాస్త్రము" (Geology) కొంతవఱకు సహాయముఁ జేయఁగలదు. భూమిని మనము త్రవ్విచూచిన యెడల ననేకవిధములగు రాళ్ళు, రప్పలు, యిసుక, మన్ను, బురద లోహములు, ఖనిజములు, చీకిపోయిన కొయ్యలు, బొగ్గులు మొదలగునవి పొరలు పొరలుగఁ గాన్పించును. వీనిని బరీక్షించి చూచికూడ పూర్వభూగోళ మేస్థితిలోనున్నదో తెలిసికొనవచ్చును. దీనిని దాఁటిపోయిన పిమ్మట మనకింక నేమియు నాధారములులేవు. ఈపైన చెప్పిన వివిధశాస్త్రపరిశోధనలవలన చారిత్రయుగమునకు బూర్వము భూగోళ మేస్థితిలోనున్నట్లీ యాధునికులు సిద్ధాంతీకరించిరో కొంచెము విచారించిచూచెదము.

భూగర్భశాస్త్రవేత్తలు భూమిలోనుండు వివిధమైన పొరలను పరీక్షించిచూచి, యీభూగోళము పుట్టినది మొదలు యీప్రస్తుత రూపమును ధరించు వఱకుఁ గడచిన కాలమును (ఆదిమపదార్థముగాక) మహాయుగములుగ భాగించిరి భూమియొక్క పైభాగమునుండి త్రవ్వుకొనుచు లోపలికి పోవుచున్నా మనుకొనుడు. అప్పుడు మనకీవిధముగ నీయైదుయుగముల నాటిపొరలును వరుసగఁ గాన్పించును.

భూగర్భశాస్త్రవిభజన.

I చతుర్థయుగము.

1 ప్రస్తుతరూపము

మంచుయుగానంతర యుగము.

(ఉత్తర హిమవద్యుగము (Post Glacial)

2 హిమవద్యుగము.

మంచుయుగము:—జంతువుల యెముకలు మంచుతో కప్పబడినది. జంతుసంతానము నివసించుటకు యోగ్యముకాదు. (Glacial)

3 పూర్వహిమవద్యుగము.

జంతువుల ఎముకలు.

(Inter-glacial) జంతుసంతానము నివసించుటకు అనుకూలస్థితి.

II తృతీయ యుగము.

చీకుడు మట్టిపొర

అంతకెక్కువ చీకుడుపొర

అంతకెక్కువ చీకుడుపొర

చీకుడు మట్టిపొర: సన్నజీవములున్నవి:

III ద్వితీయయుగము.

సీమసున్నపుపొర

సున్నపురాతిపొర

మూడుగకములు గలిగిన ఎర్ర క్రొత్తయిసుక గాతిపొర

IV ప్రథమయుగము.

క్రొత్త ఎర్రయిసుక గాతిపొర

బొగ్గుపొర

పాత ఎర్రయిసుకరాతిపొర

ఒకవిధమైన మట్టిపొర (Siluvian)

మరియొకవిధమైనపొర (Cambrian)

V ఆదిమపదార్థము. (మూలప్రకృతి) ప్రాణముతో గూడుకున్న వస్తువు లున్నట్లు సూచనలు.

భూనిక్షేపశాస్త్రవిభజన.

1 ఇనుపయుగము. (మనుష్య సంచారము.)

2 కంచు (కాంశ్య) యుగము.

3 శిలాయుగము.

(క) ఉత్తరశిలాయుగము.

(5 వేల సంవత్సరములు. మనుష్యసంచారము)

(ఖ) పూర్వశిలాయుగము.

(7, 8, 10 వేల సం॥ములు మనుష్యసంచారము.)

భూగర్భశాస్త్రప్రకారముఁ గావింపఁబడిన కాలవిభాగము, పైపట్టీ చూచినయెడల, తెలియఁగలదు. ఇక చతుర్థయుగపునాటి మట్టిపొరలలోఁ గాన్పించిన వివిధములగు వస్తుసామగ్రినిబట్టి భూనిక్షేపపరిశోధకశాస్త్రజ్ఞులెట్లు కాలవిభాగమును చేసిరో చూచెదముగాక. మంచుయుగపుపొరలలోను, తత్పూర్వయుగపు పొరలలోను యిప్పుడు ప్రస్తుతము మనకు తెలిసియున్నట్టి జంతువుల యెముకలు మొదలగునవి మట్టితో గలిసి యున్నట్లు భూగర్భశాస్త్రపరిశోధనల వలననే తెలియవచ్చినది. అదిగాక యీచతుర్థయుగములలోను తత్పూర్వయుగములోను గూడ యీ భూమిపైమనుష్యులు నివసించినట్లు సైతము సూచనలు గలవు. ఈయుగముల నాఁటి మట్టిపొరలలోఁ దొరకిన వస్తుసామగ్రిని నిక్షేపములను బట్టి భూనిక్షేపపరిశోధకశాస్త్రజ్ఞులు, ఆదిమ మానవుల కాలమును మూఁడు తరగతులుగ భాగించియుండిరి. (1) శిలాయుగము. (2) కంచు లేక (కాంశ్య) యుగము. (3) ఇనుపయుగము. శిలాయుగములోని మనుష్యులకు లోహపుపనిముట్లు చేసికొనుట తెలియనందున, వారు రాతితోడను, కొమ్ములతోడను, కొయ్యలతోడను, తమ పనిముట్లను జేసికొనుచుండిరి. ఈపనిముట్లు చాలమోటుగనుండెను. ఈకాలమునాఁటి మట్టిపొరలలో కొయ్యలతోడను రాతితోడను, చేయఁబడిన మోటుకత్తులు, అంబులు, మొదలైనపనిముట్లు దొరకిన వేగాని లోహపుసామగ్రిదొరకలేదు. అంతకంటె పైపొరలలో లోహపుసామగ్రి దొరకినది. ఆయాపొరలలో దొరకిన వస్తువులనుబట్టియే యీపై విభజనఁ గావింపబడినది.

ఈ శిలాయుగమును తిరిగి పూర్వ శిలాయుగము, ఉత్తరశిలాయుగము అని రెండువిధములుగ భాగించిరి. (Palaeolithic) పూర్వశిలాయుగపు రాతిపనిముట్లు ఉత్తరశిలాయుగపు పనిముట్లకంటె నెక్కువ మోటుగనున్నవి. పూర్వశిలాయుగపు పనిముట్లు, ఉత్తరశిలాయుగపు పనిముట్లకంటె క్రింది (ప్రాఁత) పొరలలో గనుపించినవి. పూర్వశిలాయుగపునాఁటి జంతువులు ఉత్తరశిలాయుగములోఁ గాన్పించుట లేదు. ఉత్తరశిలాయుగమునాఁటికే ఆపెద్ద పెద్దజంతువు లన్నియు పూర్తిగ నశించినట్లు కనఁబడుచున్నది. ఈ రెండుయుగములకును మధ్య ననేక గొప్ప మార్పు లీ భూగోళముమీఁద సంభవించినట్లు సూచనలు గలవు. అప్పటి శీతోష్ణస్థితి వేరు. అప్పుడు యీ గోళముమీఁద భూ, జలభాగము లీవిధముగ లేవు. అప్పటి సముద్రములు వేరు. అప్పటి దేశములు వేరు. ఇవన్నియు ఉత్తరశిలాయుగములో మారిపోయి నేఁటివఱకును ఒకేవిధముగ తిరిగి మార్పు లేమియు లేక నిలచి యున్నవి. భూగర్భశాస్త్రపరిశోధనలకును భూనిక్షేపశాస్త్రపరిశోధనలకును గల సంబంధమును కొంచె మిచ్చట విచారించి చూచెదము. పూర్వశిలాయుగములోని మానవులు మంచుయుగములోను, తత్పూర్వయుగములోను నివసించినట్లు గాఁబడుచున్నది. తత్పూర్వయుగములో దేశములోని శీతోష్ణస్థితి మిక్కిలి యనుకూలముగ నుండి, హిమవద్యుగము వచ్చుటతోడనే ఉత్తర దేశమంతయు మంచుతోఁ గప్పబడిపోవుటచేత, నచ్చటివారు బహుయిక్కట్టుల పాలైనట్లు తోఁచుచున్నది. ఈ మంచుయుగములోనే దేశములోని జంతువులన్నియు నశించి నష్టించవలెను.

పూర్వశిలాయుగపు మనుష్యులలో కొందఱు హిమవద్యుగమును గడచి బ్రతికినట్లు కనఁబడుచున్నది. ఉత్తరశిలాయుగము, కాంశ్య యుగము, ఇనుపయుగము యీ మూఁడును మంచు యుగానంతర యుగములో ప్రబలినవి. దీనిని బట్టి చతుర్థయుగమునందంతటను మనుష్యసంచారమున్నట్లు నిదర్శనములు గలవు. అదిగాక తృతీయ యుగములో సైతము మనుష్యసంచారమున్నట్లిప్పుడు నూతన పరిశోధనల వలన తేటబడుచున్నది.

ఈ మంచుయుగ మెన్ని సంవత్సరములక్రిందట ప్రబలినది ? ఉత్తరశిలాయుగ మెప్పుడు ప్రబలినది ? ఈ కాలనిర్ణయములవిషయమయి యనేకు లనేక యభిప్రాయములను దెలిపియున్నారు. ఉత్తరశిలాయుగపు మట్టిపొరలలో నక్కడక్కడ దొరకిన ఫర్, ఓక్ మొదలగు చెట్లు చీకుడు కర్రలనుబట్టి కొందఱు యీ యుగము క్రీ. పూ. ౯ వేల సంవత్సరముల క్రిందటఁ బ్రబలినట్లూహించిరి. ఇఁక పూర్వశిలాయుగ మెప్పుడు ప్రబలినదో విచారింపవలెను. అనగా మంచుయుగము గతించి తదనంతర యుగ మెప్పుడు ప్రారంభమయినదో విచారింపవలెను.

మంచుయుగమునకు పూర్వము మనుష్యులీభూగోళముపై ఉత్తరదేశములలో సంచరించుచుండి, మంచుయుగము రాఁగనే, అతి చలిచేతను, అనేక వందలడుగులయెత్తు వఱకును దేశమంతటను మంచుగడ్డలతో నిండియుండుటచేతను, నివాసయోగ్యముకాని యీ ఉత్తరభూములను వదలి, దక్షిణముగా భూమధ్యరేఖవైపునకు వచ్చి చేరినట్లు తెల్లమగుచున్నది. మొదట నివాసయోగ్యముగ నుండి, పిమ్మట మంచుయుగము రాఁగనే దేశముపాడై ప్రజలు నివసించుటకు దుస్సాధ్య మయ్యెను. దేశ మంతయు మంచుతోడ గప్పఁబడుటకు కారణమేమి ? ఈ మంచు యుగము తటస్థించుటకు కారణమేమి ? ఈ మంచుయుగము తటస్థించినందువలన దేశముయొక్క రూపము, మారిపోవుటకు గల కారణ మేమి ? ఈ విషయము లన్నిఁటిని ద్వితీయాధ్యాయములోఁ జర్చించెదము. ప్రస్తుతము మనము విచారించవలసిన యంశ మేమనగా ! ఈ మంచుయుగ మెప్పు డంత మొందినది? ఈ మంచుయుగము తటస్థించుటవలన భూగోళముయొక్క వైభాగ మంతయు మారిపోయిన దని చెప్పియుంటిమి. విస్తారమయిన పర్వతములవంటి మంచుగడ్డల బరువుచేత నిదివఱకు ఎత్తుగనున్న భూభాగములు పల్లములైనవి, పల్లముగనున్న భూభాగము లెత్తైనవి. ఈ పెద్ద పెద్ద మంచుగడ్డలు పర్వతశిఖరములనుండి క్రింది లోయలలోనికి పర్వతపార్శ్వముల వెంబడి జారుటవలన పర్వతపార్శ్వము లన్నియు కోతపడినవి. ఇట్లు కోతపడుట కెంత కాలము పట్టును ? ఈ విధముగ కొండలలోయలలోఁ బడిన మంచుగడ్డలపై తిరిగి కాలక్రమమున వండుమట్టి మొదలైన మట్టిపొరలు పేరుకొనుట కెంతకాలము పట్టును? వీని నన్నిఁటిని విచారించి, లెక్కవేసి చూచి, యిదంతయు జరుగుటకు షుమారు 7, 8 వేల సంవత్సరములు పట్టునని అమెరికా దేశపు భూగర్భశాస్త్రవేత్తలు నిర్ణయించిరి. స్విట్జర్లండు దేశపు సరస్సులలోఁ జేరుకొనిన వండుమట్టి పొరలనుబట్టిచూడఁగ పూర్వశిలాయుగ మంత మొంది (అనగా మంచుయుగ మంత మొంది), ఉత్తరశిలాయుగము ప్రారంభమై షుమారు 7, 8 వేల సంవత్సరము లైనదని నిర్ణయించిరి. ఈ రెండంశము లొకే కాలమును సూచించుచున్నవి.

కనుక పూర్వ మొకప్పుడు ఉత్తరధ్రువప్రాంత దేశ మంతయు తృణ కాష్ఠ జలసమృద్ధిగ నుండి ప్రజలు నివసించుటకు శీతోష్ణస్థితి బహు అనుకూలముగ నుండియుండుటవలన మనపూర్వు లాకాలములో నచ్చట నివసించియున్నట్లును, పిమ్మట కొంతకాలమునకు మంచుయుగము వచ్చి దేశమంతయు మంచుతో ఘనీభవించుకొనిపోగా వారచ్చట నివసించుట కనుకూలముగ లేనందున దక్షిణదేశములకు వచ్చి చేరినట్లును భూగర్భశాస్త్ర, భూనిక్షేప పరిశోధకశాస్త్ర సంబంధమైన నూతన పరిశోధనల వలన నిర్ధారణ చేయఁబడినది. అదిగాక మన పూర్వు లొకప్పుడు ఉత్తరధ్రువప్రాంత దేశములలో నివసించినట్లు వేదములయందు స్పష్టముగఁ గానఁబడుచున్నది. కాని వేదభాష్యకారులకు యీ పైవిషయములు తెలియనందువలనను, యీ భూగోళముయొక్క శీతోష్ణాదిస్థితు లెప్పుడును యిప్పు డున్నవిధముననే యుండి యున్నవని వారభిప్రాయ పడినందునను, వేదములలోని గొన్నికొన్ని ఋక్కులకు అర్థము తేటతెల్లముగ పైకిఁ గనఁబడుచున్నను వానిని విరిచి పెడ అర్థములను లాగి యేదో విధముగ అతుకులు పెట్టిరి. ఈ విషయముల నన్నిఁటిని ముందధ్యాయములలో విపులముగ చర్చించెదము.

—మానికొండ సత్యనారాయణశాస్త్రి,
బి. ఏ.

# ప్రకృతి.

మ॥ అకలంకంబు మహాద్భుతంబు బుధవి ♦ ద్యాభావనాభేద్యమై
ప్రకటామోద విషాద హాస్య రసభా ♦ వస్థాన ధామంబునై
సకలాశాంతర గూఢగుప్త ధరణీ ♦ చక్రంబునై దోఁచు నీ
ప్రకృతి ప్రాభవ చిత్రవైఖరిని జెం ♦ ప్పఁగ వర్ణనాతీతమౌ॥

సీ॥ సర్వసస్యముల భూ ♦ జములఁ బుష్కలఫల, స్థితిఁ బెంపఁజాలు ధా ♦ త్రీతలమ్ము
అమృతోపమానమై ♦ యలరి యశేష ప్రా, ణులఁ దన్పఁజాలు ని ♦ ర్మల జలమ్ము
సర్వభూస్థలులఁ బ్ర ♦ కాశస్థలులఁజేయ, సహ్యమయ్యెడి పవి ♦ త్రానలమ్ము
రవిసోమ తారకా ♦ రాజితరమ్యరం, గంబైచెలంగు చో ♦ క్క పుఖగమ్ము
నఖిల వనసీమలందు వి ♦ హారసరణి, సలిపి వివిధప్రసూన వా ♦ సనలఁ గ్రోలి
మేలౌ రీతిని వీఁచు స ♦ మీరణమ్ము, యుండఁగ తమేమొ? వీని నాథుం డెవండో?

ఉ॥ ఎక్కడఁజూడఁ దానెయయి ♦ యేర్పడు నా గగనం బదేమొకో!
యక్కమలాప్తుఁ డెల్లపుడ ♦ హస్సులఁదాఁ జరియించు టేలనో!
రిక్కల రేఁడు రాత్రులఁ జ ♦ రింపఁగ నుండుట నేకతంబొ! యీ
నక్క విచారణన్ సలుపఁ ♦ జాలరుగా బుధు లెంత వారలున్.

ఉ॥ మాటికి మాటికిన్ భువన ♦ మందిర నర్తనశాల లోపలన్
గోటుల కొక్కఁడౌ మనుజ ♦ కోటులఁ బాత్రలఁ గాఁగఁజేసి నా
హాటకగర్భ! నీవు పరి ♦ హాసము నాత్మఁదలంచి యిట్టి యీ
నాటక రాజమున్ సలిపి ♦ నావ! మహాద్భుత కౌశలంబునన్.

తే॥ గీ॥ సాంధ్యశోభావిలాస సౌ ♦ ష్ఠవము నరయ, నంబుధుల గర్భజనిత రౌ ♦ ద్రంబుఁ దలఁప
సూర్యచంద్రుల చలనంబుఁ జూడఁ జూడఁ, ద్వాత్రృదర్శిత ప్రకృతిచి ♦ త్రంబుఁ గాదె?

—మహాకాళి వేంకటేశ్వరరావు.

---

# మాతృస్మృతి

మాతృదేశమ నిన్ను ♦ మఱచిపోగలమె
చెవులూరు నీ నామ ♦ శ్రవణమాత్రమున
భావము లెన్నెన్నొ ♦ పరిఢవిల్లెడిని
సంతతానందంబు ♦ సంభవించెడిని ॥ మా ॥

బ్రతుకగలండె యీ ♦ క్షితి నెవ్వఁడైన
కంఠానప్రాణంబు ♦ గ్రాలునందాక
"ఇది నాదు దేశంబ ♦ యిదియె నా యూరు
అని పొంగకుండునే ♦ మనుజుఁ డెవ్వఁడును ॥ మా ॥

మఱచిర నీనామ ♦ స్మరణమాత్రమున
దుఃఖపరంపరల్ ♦ తొలఁగి పోవన్నె

ఝుమ్మనియేటి జం ♦ ఝూమరుత్తునకు
దూది పింజలవలె ♦ తొలఁగి వేచనవె
చిరకాలమునుండి ♦ చేయు పాపములు
తన్మయత్వంబు బొం ♦ దదె శరీరంబు
పులకరించదె గగు ♦ ర్పొదవదే మేను ॥ మా ॥

వనకోయిలల కుహూ ♦ స్వరముల కన్న
గానరాజి స్రవించు ♦ తేనెలకన్న
నేత్రపర్వంబునై ♦ నెగడు మందార
విరజాజి మల్లెల ♦ సుగవిజంబులను
అనయంబు ఝుంకార ♦ స్వనముల చేత

కమ్మపుష్పాళ్ళను ♦ గ్రాలు తేనెలను
గ్రోలెడు బంభర ♦ ఋతములకన్న
శారదచంద్రిక♦చలువలకన్న
మధురత్వమున నొప్పు ♦ మామిళ్లకన్న
కీరభాషలకన్న ♦ శారికకన్న
పిండారఁబోసి న♦ట్లుండు వెన్నెలను
గానెడు జాబిల్లి ♦ కన్నను నీదు
పావన నామంబు ♦ పలుకుమాత్రమున
జన్మకుఁ గలుగవే ♦ సకలసంపదలు
కవులకుఁ బుట్టవే ♦ కవనధోరణలు
సంగీతమబ్బదే ♦ జడులకునైన
స్పృశే స్వర్గసౌ♦ఖ్యమ్ము నిమ్మహిని ॥ మా ॥

జిలిబిలిపలుకుల ♦ చెన్నలరారి
ఆంధ్రి కెప్పుడును సం♦తసమును గూర్చు
ముద్దుల బిడ్డని ♦ మురిపెంబుకన్న
మించు నీ నామంబె ♦ మోదవారిధిని ॥ మా ॥

అనుపమ సౌందర్య♦మున గ్రాలియుండి
వాసిఁగాంచిన రతి ♦ ద్రోసి రాజనెడు
నందమామ హసించు ♦ సతిఁగల్గియున్న
మించు నీ నామంబె ♦ మోదవారిధిని ॥ మా ॥

అమెరికా కేగిన ♦ యబ్ధి దాఁటినను
ఆఫ్రికాకు చలన ♦ యరుగుమాత్రమున
నీదు నామమె కాదె ♦ నిత్య జీవనము
సీమకేగి నీదు ♦ క్షేమమే నరతు ॥ మా ॥
ఇతర లోకముతోడ ♦ యేటికే నాకు
క్షణభంగురంబైన ♦ శాశ్వతంబైన
జన బుద్బుదంబైన ♦ జన్మంబు నమ్మి
నాసపుత్త్రుమె నిన్ను ♦ మురిపెంపుతల్లి ॥ మా ॥

ఎచటికేగిన మరి ♦ యెందు డాగినను
చాటమే నీ కీర్తి ♦ సాంద్రచంద్రికల
విలపింపఁగా వద్దు ♦ విలపింపవలదు
మాతరో! నీ పేరు ♦ మంచి బంగరున
లిఖియించి మెడను దా♦ల్చెద ననారతము ॥ మా ॥

చల్లారగాలేదు ♦ చల్లారలేదు
రసపుత్రవీరుల ♦ రణప్రతాపాగ్ని
కరగిపోలేదింక ♦ కరగిపోలేదు
కాకతీయుల రక్త♦కణుడు లిప్పటికి
మఱచిపోలే దింక ♦ మఱచిపోలేదు
నరసింహకృష్ణునా ♦ నా "చమూధాటి"
ఘోర సంగ్రామంపు ♦ వీరకృత్యముల ॥ మా ॥

ఉడుగలే దింకనూ ♦ యుడుగనే లేదు
ఆంధ్రచాళుక్యుల ♦ యగ్ర్యావిక్రమము
మహి నెందుకలదెపో ♦ మహి నెందుకలదు
బొబ్బిలి వెలమల ♦ భుజ పరాక్రమము ॥ మా ॥

ఆరిపోలేదింక ♦ యారిపోలేదు
తెలుఁగు కత్తులనుండి ♦ దివ్య తేజంబు
అవిరళ భస్మంబు♦నం దున్న యట్టి
యగ్ని కణంబుల ♦ ననుకరించెడిని
ఆంధ్రుల శౌర్యంబు ♦ లంతట నేఁడు ॥ మా ॥

చండప్రతాప మా♦ర్తాండునిఁబోలు
ఘన ప్రతాపుని కేది ♦ కాపురం బిలను
భోజభూజానిబోల్ ♦ రాజనరేంద్రుఁ
గీర్తికాంతకు నేది ♦ కేళికా సీమ
పలుమారు పరులను ♦ భండనంబందు
దర్ప మడఁచిన రు♦ద్రమదేవి యునెట
వసియించె చెలువును ♦ వహియించి తొల్లి
ఖడ్గతీక్ష్ణన కత్తి ♦ కాకకోర్చకను
పటువీరులైనట్టి ♦ పరిపంథిజనము
కాళ్లకు బుద్ధులఁ ♦ గరపి రెచ్చటను ॥ మా ॥

కేళభావలయందు ♦ తెలుఁగదిలెస్స
మన భాషఁబోలెడు ♦ మధురంపుభాష
గాలించి వెదకిన ♦ గలదె యెచ్చటను
అది యాంధ్రులకును చు♦క్కెదురయ్యె గాని ॥ మా ॥
నన్నయకవనంపు ♦ విన్నాణసొంపు
తిక్కనకవితలో ♦ తేటభావములు
బమ్మెరపోతన్న ♦ భక్తితత్పరత
పింగళిసూరన్న ♦ పెనుభావగరిమ
తాతగారైనపె ♦ ద్దన్న "యల్లిక"యు
పాండురంగ కవీశు ♦ పద్యంబు "వారువు"
ముక్కుతిమ్మన బుధు ♦ "ముద్దుపలుకులు"ను
ఆంగ్లకవీశ్వరు ♦ లెందెందుగలవు ॥ మా ॥

ఆంధ్రరాష్ట్రింబంచు ♦ ఆంధ్రోద్యమమని
అరచెదుమాటికి ♦ ఆంధ్రపుత్రుండ

ఆంధ్రుఁడ నయ్యును ♦ ధ్వాంధ్రమెఱుఁగవు
తెలిసికోలేవు నీ ♦ దివ్య శక్తులను
అరపులుమాని ముం ♦ దంజలు వేసి
కార్యశూరుఁడవు గమ్ము ♦ నైకొమ్ము దీక్ష॥ మా॥
కన్నుఁగానకనిన్నుఁ ♦ గనలేక పోతి
మాతగో నీ పట్ల ♦ మాన భావమును
వహియించి యుంటనే ♦ పాపుండనైతి
కాలునిబంట్లు వే ♦ కలవ వచ్చెడిని
భరియింపగాలేను ♦ బాధలనేను

అంజలి ఘటియించి ♦ యర్మిలి మ్రొక్కి
మరిమరి స్మరియించి ♦ మాతరో నిన్ను
హార్ద్రావ నీలోన ♦ నైక్యమొందెదను
సంపూర్ణసౌఖ్యంబు ♦ సతతంబుఁగోరి
మునిఁగి పోయెద నింక ♦ మోద వారిధిని
మాతరో యాశీస్సు ♦ మహి నిమ్ము నాకు
"ఆంధ్రవిష్ణు స్వరూ ♦ పాయ! శుద్ధాయ!"
మాతృదేశమ నిన్ను ♦ మఱచి పోఁగలమె.

—క్రొవ్విడి వేంకటరత్నశర్మ.

---

# శ్రీలక్ష్మీచెన్నకేశవ విలాస గ్రంథాలయము, కారెంపూడి.

తమోవంతంబైన లోకమునకంతకును సూర్యునిదీప్తిచే ప్రాణిసముదాయ మంతయు నెటుల చైతన్యమును బొందునో మానవజాతి యజ్ఞానతిమిరము నంతమొందింపుటకు జ్ఞానదీపిక లావశ్యకము. జ్ఞానమును సంపాదించుటకు విద్య మిగుల యాధారము. విద్యయన సృష్టియందలి నిర్మాణమును కనుఁగొనుటయని భావము. మనుజుఁడు కాలానుగుణ్యముగ నొకప్పుఁడౌన్నత్యమును మఱియొక సమయమున క్షీణత్వము నొందుచుండును. పూర్వము పుణ్యభూమియనఁ బరగిన మన ఆర్యావర్తము శాస్త్రములు, కళలు, నైతిక రాజకీయ విషయములన్నింటియందును అగ్రస్థానము నధిష్టించియుండెను. అప్పటికాలమున మన మేపరిశ్రమలకుఁగాని వస్తునిర్మాణత్వమునకుఁగాని పరదేశములమీఁద నాధారపడి యుండుటలేకుండెను. ఇంకను బలము సంపదలకు మన మాతృభూమి యాటపట్టైయుండెను. ఇదియంతయు మన పూర్వులు గ్రహించిన జ్ఞానధనమే. వారొనర్చిన దేశసేవయును వారుపొందిన యైహిక వ్యాపారములును వర్ణనాతీతము. ఇందుకు నిదర్శనము వారురచియించిన జ్ఞానప్రదీప్తమైన గ్రంథజాలమే. మనము వానిని తెలిసికొనఁజాలకయు క్రిమిసముదాయమున కర్పించియు భాషాసేవయొనర్పమియు, నింకను వాని మహిమాతిశయంబులను వెలువరింపఁబూను గురుసంప్రదాయము లేమియు క్రమముగా నాజ్ఞానధనము క్షీణదశకు రా నారంభించె. మఱియు హైందవుల సంతతికిని మహమ్మదీయులకును రాజ్యకార్యముల నేమి మతాంతరత్వమున నేమి వైషమ్యములు ప్రబలనారంభించె. అందునను గొన్ని గ్రంథములు అగ్నిదేవునకు నాహుతిఁజేయఁ బడినవయ్యె. మఱికొన్ని గంగాజలముల కర్పితంబులయ్యె. ఇటుల క్రమానుసారంబుగ విద్యలేమియు, మత విముఖత్వంబులను గ్రహించి పాశ్చాత్యదేశీయులు మన దేశమున యడుఁగిడ నారంభించి మన యమృతరసములోయన మన గ్రంథసందోహములను సాధించి తమదేశములయందు వెలకొలఁది తమ భాండాగారములయందుఁ జేర్చుకొనిన వారైరి. అప్పటినుండియు వారు వాని యందతి పరిశ్రమచేసి జ్ఞానాభివృద్ధిని జేసికొనిరి. వారా సాఫల్యమును బొందుటచే మహోత్కృష్టంబులగు కార్యముల నొనర్పగల ప్రజ్ఞావంతులైరి. అందుచే విదేశములే మనకు శరణ్యములయ్యె. పూర్వము మనదేశమునకంటె విదేశము లిప్పుడు వెలలేని కీర్తిని గడించినవయ్యె. ఆహా! కాలమెటుల ప్రసరించె. "కాలస్యకుటిలాగతిః" యను వచనము సార్థకమయ్యె. ఇటుల మారుటకుగల వ్యత్యాసమే మన మన గ్రంథపుంజముల మహిమాతిశయమే. వాటివలన వారికిఁ గలిగిన పాండిత్యప్రకర్షయే వారిని ధనవంతులుగఁ జేసినది. మన గ్రంథజాలమే వారిదేశంబును జ్ఞానప్రదంబుగఁ జేసినవి. మన గ్రంథపేటికయే ఇవ్విధంబున జ్ఞానవంతంబులై యావిదేశంబులు విలసిల్లుటంజేసి యచ్చట గ్రంథాలయములకు బుట్టినిల్లాయె. జర్మనీ గ్రంథాలయములను గుఱించి చరిత్రకారులు వ్రాసిన చొప్పు పరికించిన విస్మ

యము నొందక యున్నవి. ఇంకను అమెరికా విషయమును జూచిన వర్ణనాతీతము. ఇంకను తదితర దేశముల గ్రంథ భాండాగారము లెంతయో ప్రశంసాపాత్రముగ నున్నవి. ఇంగ్లాండును అత్యాశ్చర్య జనకముగ నున్నది. ఇక మన దేశమును గూర్చి విచారించిన బరోడాయందును తంజావూరునందున్నదియును యిటీవల స్థాపించిన రామ మోహన గ్రంథాలయమును యింకను యొకటి రెండు మాత్రము పెద్దవిగనున్నవి. తక్కిన వన్నియు కొద్దికొద్ది గ్రంథాలయములే. అవియైనను దేశమునంతటను విరివిగా నైనలేవు. ఇట్టిగ్రంథాలయోద్యమమును వ్యాపింపఁజేయుటకు 1916 సం॥ అగష్టు 6 వ తేదికి సరియగు నలనామ సంవత్సర శ్రావణ శు 7 తేదిన యీగ్రామమందు వేంచేసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవుని యంకితముంచి శ్రీలక్ష్మీ చెన్నకేశవ విలాస గ్రంథాలయమని పేరిడి నొకగ్రంథాలయము స్థాపింపఁబడియె. దీని ముఖ్యోద్దేశములలో నొకటి పల్నాడుతాలూకా యందు గ్రంథాలయోద్యమమును విరివిగ వ్యాపింపఁ జేయుటయైయున్నది.

ఈవత్సరము 8 మహాజనసభలు గావింపఁబడినవి. గతవత్సరాంతమందు గలసభ్యులు 30; ఇప్పుడు ౪౪ మందిగలరు. గతసంవత్సరాంతమున ౧౨౪ గ్రంథములు గలవు. ఇప్పుడు ౨౨౯ గ్రంథములుగలవు. ఈ సంవత్సరమున చదువఁబడిన గ్రంథములసంఖ్య ౨౪౦, ౭ పత్రికలు తెప్పింపఁబడుచున్నవి. ప్రతిదినమును సగటున ౭ మంది గ్రంథాలయమునకు వచ్చెదరు. ఈ సంవత్సరము ధర్మబుట్టలు పెట్టి బియ్యమును వసూలు చేసితిమి. రాత్రి పాఠశాల నేర్పరచుటకై ప్రయత్నించు చున్నాము. స్వంత భవన నిర్మాణమును జేయవలసియున్నది.

ఈ వత్సరము జమ:—

| | |
|---|---|
| గతసంవత్సరంనిల్వ | 16- 2-8 |
| చందాలు | 57- 6-0 |
| విరాళములు | 2- 0-9 |
| ధర్మబుట్టలవలన | 27-13-4 |
| వెరశి. | 103- 6-4 |

ఖర్చు:—

| | |
|---|---|
| ద్వితీయవార్షికోత్సవము | 15-14-0 |
| పత్రికలు | 9- 5-6 |
| గ్రంథములు | 6-10-0 |
| సామానులు | 4- 9-0 |
| చిత్రపటములు | 1- 0-0 |
| మరమ్మతులు | 3-12-0 |
| ఉత్తరములు | 2-10-3 |
| సాదరు | 8- 0-6 |
| వెరశి | 51-13-3 |

నిల్వ రు 51-9-1

—సాగి రామనాధశాస్త్రి,
కార్యదర్శి.

# వేంకట శివీయ గ్రంథాలయము, కొర్నిపాడు అగ్రహారం.

కృష్ణాజిల్లా గుడివాడ తాలూకాలోఁజేరిన పయిగ్రామంబున 1-5-1918 తేదిన పైపేరున నొక గ్రంథాలయము నెలకొల్పఁబడినది. ఇందిప్పటికి 324 ప్రసిద్ధములయిన సంస్కృత గ్రంథములును 876 ఆంధ్ర గ్రంథములును గలవు. ప్రతిదినము చదువుకొనువారిసంఖ్య 10. దీనికి మూలధనమెంతమాత్రము లేదు. కాని అగ్రహారం దారులయిన బ్రహ్మశ్రీ కూచిభొట్ల వెంకటాచలపతి శాస్త్రిగారి యొక్కయు నాగభూషణముగారియొక్కయు గాఢాభిమానము గలిగియున్నది. వారీగ్రంథాలయమునకు విలుగల కొన్ని సంస్కృత గ్రంథముల నుచితముగా నొసంగినందులకు మేము వారికి కృతజ్ఞులము. ఇంతేగాక దీనియభివృద్ధికై యనేకవిధముల సహాయ మొనర్ప సంసిద్ధులైయున్నారు. ఈ భాండాగారముయొక్క వ్యయ ప్రయాసములు నేటిఁవఱకు మావలననే భరింపఁబడుచున్నవి.

—జింధ్యాల వేంకట శివకవులు.

# యమళ గ్రంథాలయములు, అంగలూరు.

## ౧ లక్ష్మీ గ్రంథమండలి.

నా ప్రథమ యమళ (కవల) సంతానములో రండవదియగు లక్ష్మీబాయి 14 సంవత్సరములు 36 దినములు జీవయాత్ర చేసి పుత్రవతియై ఆనంద నామ సం॥ర జ్యేష్ఠ శు 2 ఆదివారము (31-5-14) సాయంత్రము అస్తమించినది. ఏతత్ జ్ఞాపకార్థము కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా మన్నివాస గ్రామమగు అంగలూరులో మద్గృహంబున "లక్ష్మీగ్రంథమండలి" యను నొక ఆంధ్రపుస్తకభాండాగారము స్థాపించితిని. అందిప్పటికి 552 తెలుగు గ్రంథములు గలవు. ప్రతివారును ఉదయమున్నూ సాయంత్రమున్నూ చదువుకొనుటకు నేర్పాటు గావింపఁబడినందున అట్లు జరుగుచున్నది.

## ౨ రామా గ్రంథమండలి.

పైనఁజెప్పిన కవలలలో ప్రథమురాలగు రామాబాయి కూడ నదేవిధమున కాళయుక్తి సంవత్సర భాద్రపద బ ౯ ఆదివారము (29-9-18) సాయంత్రమే పుత్రవతియై పుత్రునితో సహా అస్తమించుటచే తత్ జ్ఞాపకార్థమయి "రామాగ్రంథమండలి" అను పేరున సంస్కృత గ్రంథములుగల నొక భాండాగారమును స్థాపించినాను. అందిప్పటికి 252 గ్రంథరాజములు గలవు ఇదికూడ పైరీతిగ ప్రతిదినమును యుపయోగింపఁబడు చున్నది.

— నందగిరి వెంకటప్పారావు పంతులు.

---

# బాలభటునియాటలు.

## 1. సాలీడు—ఈగ.

ఈ యాట యెంతమంది అయినను ఆడవచ్చును. అడవులలో గాని, చిట్టడవులలో గాని, చెట్లు గుబురుగానున్న తోటలలో గాని ఆడవలెను. పిల్లలను రెండు జట్లుగ విభజించి, ప్రతిజట్టునకున్ను ఒక నాయకుని, ఒక మధ్యవర్తిని యేర్పరచవలెను, ఒక జట్టుకు సాలీడుల జట్టనియు రెండవజట్టుకు ఈగలజట్టనియు పేరిడవలెను లేదా యిష్టమువచ్చిన నామధేయములు పెట్టికొనవచ్చును. ఒక చతురస్రమైలు ప్రదేశమును హద్దుగా యేర్పరచుకొని అది సాలీడులగూడుగా యెంచి, సాలీడులజట్టును ముందుగా విడిచిపెట్టి నిర్ధారణచేసిన ప్రదేశములో వారి యిష్టమువచ్చినచోట దాగుకొనమని చెప్పవలెను. ఏర్పరచుకున్న నాయకులున్నూ, మధ్యవర్తులున్నూ జట్లతోనే యుండవలెను. సాలీడులు బయలుదేరిన 15 నిమిషములకు యీగలజట్టును విడువవలెను. అప్పటినుంచి ఆట ప్రారంభమవును. రెండు ఘంటలకాలము పరిమితియిచ్చి యీలోపున దాగియున్న సాలీడులు అందరిని యీగలజట్టువారు కనుగొనవలెను. అలా కనుగొననియెడల యీగలజట్టువారు గెలిచినట్టు యెంచవలెను. లేనియెడల సాలీడుల జట్టువారు గెలిచినట్టు యెంచవలెను. దాగియున్న సాలీడుల జట్టువారు, యీగల జట్టులో నెవరినైనను చూచుట తటస్థించినయెడల తాను యెవరిని చూచినది తన నాయకునికి తెలియచేయవలెను. పైవిధముగానే యీగల జట్టువారుకూడ తమ నాయకునికి తెలియచేయవలెను. ఈలాగున తెలియచేసిన సంగతులు యావత్తు మధ్యవర్తులు వ్రాసుకుని మార్కులను యిచ్చును. ఎవరు యేజట్టువారు అయినది సులభముగా తెలియగలందులకు వివిధగుర్తులను యేర్పరచుకోవలెను.

## 2. నేల కోతికొమ్మచ్చి.

ఈ ఆట సమభూమిమీద ఆడుదురు. ఈ యాటకు చెట్టుకుబదులు నేలమీద ఒక సున్న గీయవలెను. ఈ సున్న సాధ్యమయినంతవరకు పెద్దదిగానే యుండవలెను. ఈ ఆట యెంతమంది అయినను ఆడవచ్చును. ఈ ఆటలో ఒక కుర్రవానిని దొంగగా నియమించవలెను. ఈ ఆటకుకూడ ఒక గజము పొడవుగల కర్ర కావలెను. దొంగగా నియమింపబడిన కుర్రవాడు ఆ కర్రను సున్నాలో పెట్టవలెను. సున్న దాటి దొంగకుర్రవాడు యివతలకు రా కూడదు. దొంగకుర్రవాడు సున్నలో ఒక చోట స్థిరముగా నిలువకూడదు. అటు

యిటు తిరుగుచుండవలెను. సున్న వెలుపలనున్న యితర కుర్రవాండ్లు దొంగకుర్రవానిచేత తాకబడకుండ సున్న లోనున్న కర్రను తీసుకుని దూరముగా విసరి వేయుటకు ప్రయత్నించ వలెను. అలా చేయగలిగిన యెడల దొంగ కర్రను తీసుకువచ్చి తిరిగి సున్నలో నుంచవలెను. కర్రను విసరి వేయుటకు ప్రయత్నించునప్పుడు సున్నలో దొంగ యెవరినైనను తాకగలిగిన యెడల తాకబడినవాడు దొంగ యగును. కర్రను విసరి వేయక పూర్వమే దొంగ సున్నలో తాకవలెను కాని కర్రను విసరిన తరువాత తాకినలాభములేదు. దొంగసున్నలో నిలుచుని తనచేతితో యెవరినైనను బయటవున్నవారిని తాకిన తాకబడినవాడు దొంగఅగును. నియమిత కాలములో యెక్కువసార్లు దొంగ అయిన కుర్రవాడు ఆట ఓడినట్టు యెంచవలెను.

## 3. చెట్టుకోతికొమ్మచ్చి.

ఈ ఆట ఆడుటకు విశాలమైన చెట్టు ఒకటి కావలెను. చింతచెట్టు చాలామంచిది. యేచెట్టు అయినను యేర్పరచుకొనవచ్చును. గాని దానికొమ్మలు పెళుసుగా యుండగూడదు. యీఆట 10 మొదలు 12 మందివరకు ఆడవచ్చును ఈ ఆట ఆడుటకు కావలసిన వస్తువు ఒకగజము పొడవుగల ఒకకర్ర. యీకర్రనే కోతియందురు. మొదట ఈఆటలో ఒకకుర్రవానిని దొంగగా యేర్పచుకొనవలెను. కోతిగా యేర్పరచిన కర్రను మరియొక కుర్రవాడు తన కాలిక్రిందనుంచి విసరి వేయవలెను. విసరినతక్షణం దొంగగా నియమింపబడిన కుర్రవాడు కర్రను తీసుకొని రాగలందులకు పరుగిడవలెను. దొంగకుర్రవాడు తిరిగి వచ్చులోగా మిగతా కుర్రవాండ్లు అందరు చెట్టును యెక్కవలెను. దొంగ కుర్రవాడు కర్రనుతీసుకొని "వేడికోతి" అని గుక్క పెట్టుచు చెట్టువద్దకువచ్చి గుక్క వదలకయే ఆకర్రతో చెట్టుమీదనున్న కుర్రవాండ్లను అంటుకొన ప్రయత్నించవలెను. చెట్టుమీదనున్నవారిలో నెవరినైనను తాకగలిగినయెడల తాకబడినవాడు దొంగఅగును. గనుక అందరును తప్పించుకొనుటకు ప్రయత్నించవలెను. పైచెప్పిన విధముగ దొంగ కర్రతో తాకలేనియెడల కర్రను చెట్టుక్రిందవుంచి చెట్టుయెక్కి యెవరినైనను తాకి తిరిగి వచ్చి కర్రను ముట్టుకొన ప్రయత్నించవలెను. అలా చేయగలిగినయెడల తాకబడినకుర్రవాడు దొంగఅగును. దొంగ చెట్టు యెక్కినప్పుడు చెట్టుమీద నున్నవారు క్రిందికి దిగివచ్చి క్రిందవున్న కర్రను కాలిక్రిందుగా విసరి వేయుటకు ప్రయత్నించవలెను. అలావిసరి వేయగలిగిన యెడల దొంగ చెట్టు దిగివచ్చి కర్రను తీసుకువచ్చి తిరిగి తాకుటకు ప్రయత్నించవలెను. నియమిత కాలము పెట్టుకొని ఆటఆడవలెను. నియమితకాలములో యేకుర్రవాడు యెక్కువసార్లు దొంగ అగునో ఆకుర్రవాడు వోడినట్టు యెంచవలెను. ఈ ఆట ఆడునప్పుడు చేతులు కాళ్ళు విరుచుకొనకుండ జాగ్రత్తగాచూచుకొనవలయును.

## 4. వోలలాడుట.

ఈ యాట యెంతమందియైనను యాడవచ్చును. ఈతరానివారు యాడకుండుట మంచిది. ఈ యాటలో ఒక దొంగ యుండును. ఈ దొంగ నీటిలో మునిగి మన్ను తీసికొని నీటిపైకి వచ్చిన తరువాత నీటిలో మునగకుండానున్న వారిపైన వేయుటకు ప్రయత్నించవలెను. ఒక పరియాయము తెచ్చిన మన్ను ఒకరిమీదనే వేయవలెను గాని అందరి మీదను చల్లగూడదు. అందరు భటులును దొంగ మన్ను విసరివేయగలిగినంత దూరములోనే యుండవలెను. అందరును దొంగయొక్క చేష్టలను కనిపెట్టుచు, వాడు మన్ను విసురుసరికి తమమీద పడకుండ నీటిలోనికి మునిగి తప్పించుకొనవలెను. మన్ను యెవరిమీదనైన పడినయెడల అట్లు పడినవాడు దొంగయగును. ఒకసారి దొంగయైనవాడు తిరిగీ యింకొకని దొంగచేసిన తరువాత ఆటలో పాలు గొన కూడదు. పైజెప్పినవిధముగా వినోదార్థము కాలపరిమితి పెట్టుకుని యాడుకొనవలెను. ఈ ఆటవలన చురుకుదనము హెచ్చును. నీటి భయము తీరును. ఊపిరి బిగబట్టుట అలవాటు యగును.

## 5. స్థలమును కనుగొనుట.

ఈ ఆట ప్రారంభించుటకు పూర్వము ఉపాధ్యాయుడు భటులకు యెవరికి తెలియకుండ దగ్గర ఉన్న గ్రామమునకుగాని, పట్టణభాగమునకుగాని వెళ్ళి, కొన్ని జాగాలను, వస్తువులను, చూచి వాటియొక్క ఆకారము వగైరాలను ఒక కాగితముమీద వ్రాసుకొనవలెను. తరువాత ఆట ప్రారంభించవలెను. ఉపాధ్యాయుడు కాగి

తముమీద వ్రాసుకున్న సంగతులు యావత్తు కొన్ని కాగితములమీద వ్రాసి ప్రతిభటునకును, ఒక్కొక్క కాగితమును యివ్వవలెను. ప్రతి భటుడున్ను కాగితముమీద వ్రాసిన సంగతులు యావత్తు చదువుకొని, అవి యెచ్చట యే ప్రదేశమం దున్నది కనుగొనుటకు ప్రయత్నించవలెను. ఏ భటుడు నియమిత కాలములో తాను కాగితముమీద చదువుకున్న స్థలమును సమాచారమును కనుగొని తిరిగి వచ్చునో ఆ భటుడు ఆట గెలిచినట్లు యెంచబడును. ఆటకు కాలపరిమితి, ఆట ఆడు ప్రదేశమునుబట్టిన్నీ, యితర స్థితిగతులను బట్టిన్నీ, ఉపాధ్యాయుడు యేర్పరచవలెను

## 6. తోకలాట.

ఈ ఆట యెంతమంది అయినను ఆడవచ్చును. భటులను రెండుజట్లుగ విభజింప వలెను. రెండు జట్లులకు తేడా యుండులాగున ఒక గుర్తు యుండవలెను. రెండు జట్లులలోని వారందరికిని తోకలు వుండవలెను. అనగా ఒక చిన్న గుడ్డ లాగితే సులభముగా వూడి వచ్చేలాగున వెనుకవైపున దోపుకొనవలెను. నడుమునకు తాడు మొదలగునవి వేసి కట్టుకొన కూడదు. 15 గజముల దూరములో రెండు జట్లులవారిని యెదురు బదులుగా నిలబెట్టవలెను. ఆట ఆడు స్థలమునకు నాలుగు వైపులను గుర్తులు పెట్టవలెను. భటులు యీ గుర్తులను దాటి అవతలకు పో కూడదు. తరువాత ఉపాధ్యాయుడుగాని మధ్యవర్తిగాని ఒక యీల వేయవలెను. అప్పుడు ఆట ప్రారంభ మవును. ఒకజట్టువారు రెండవజట్టులోనివారి తోకను లాగివేయ ప్రయత్నించవలెను. యే జట్టువారు యెక్కువ తోకలను నియమితకాలములో లాగివేయగలుగుదురో, ఆ జట్టువారు గెలిచినట్లు యెంచుకొనవలెను. తోకను గోలుపోయిన భటుడు తిరిగి ఆటలో పాలుగొన గూడదు. ఉపాయముచేత తోకలనులాగివేయ ప్రయత్నించవలెను గాని, ఒకరిని ఒకరు కొట్టుకొన కూడదు. ఈ ఆట వలన ఆత్మరక్షణ అలవడును,

## 7. దీపము ఆర్పుట.

ఈ ఆట బహు వినోదముగా నుండును. పిల్లలను రెండు పార్టీలుగా భాగించవలెను. నాలుగు అడుగులు పొడవుగల వెదురు కర్రను భూమిలో పాతి దానిమీద ఒక మైనపువత్తి వెలిగించి పెట్టవలెను. ఈ కర్రకు యెదురుగా షుమారు 20 అడుగులదూరముగా ఒక సున్నా చుట్టవలెను. ఆడవలసిన ఒక్కని పిలచి వాని కళ్ళకు గంతకట్టి ఆ సున్నాలో నిలువ బెట్టి మూడుసార్లు గిరగిర త్రిప్పి విడిచిపెట్టి వానిని వెళ్ళి కర్రమీదనున్న మైనపువత్తిని ఆర్పమని చెప్పవలెను. ఏపార్టీవారు యెక్కువసార్లు దీపము ఆర్పెదరో ఆ పార్టీవారు గెలిచినట్లు యెంచవలెను.

## 8 ధ్వనిని కనుగొనుట.

ఈ ఆట యెచ్చటనైనను ఆడవచ్చును. ఒక పెద్ద మేకును భూమిలో పాతి దానికి 10 అడుగుల పొడవుగల రెండుతాళ్ళను కట్టవలెను. ఇద్దరు పిల్లలకు కళ్ళకు గంతలు కట్టి మేకుకు కట్టిన రెండుతాళ్లు చెరి ఒకటి యిచ్చి ఒక పిల్లవానికి మెత్తని దిండున్నూ, రెండవ వానికి ధ్వనిచేయు గంట కాని మరి యే యితర వస్తువు గాని యివ్వవలెను. ఆటవివరము:—గంట పుచ్చుకున్న కుర్రవాడు ధ్వని చేయవలెను. ఆ ధ్వని విని రెండవ కుర్రవాడు ధ్వని వచ్చిన వైపునకు వెళ్ళి ఆ కుర్రవానిని దిండుతో కొట్టుటకు ప్రయత్నించవలెను. రెండవ కుర్రవాడు దెబ్బ తప్పించుకొనుటకు ప్రయత్నించవలెను. కుర్రవాండ్లు పట్టుకున్న తాళ్ళు బిరుగా పట్టుకుని చుట్టు తిరుగవలెను. లేని యెడల క్రింద పడిపోవచ్చును. ఈ ఆటవలన లాభము ధ్వని యే వైపునుంచి వచ్చినది కనుగొనుట అలవడును.

## 9 శత్రుశిబిరమునందు బాంబును పాతివేయుట.

ఈ ఆటఆడుటకు చెట్టుమొదలగునవి గుబురుగా యున్న స్థలము కావలెను. రాత్రిపూటఅయిన మంచిది. పిల్లలను రెండుపార్టీలుగా భాగించి ప్రతిపార్టీకి ఒక నాయకుని యేర్పరచవలెను. ప్రతిభటునికిన్ని 9 అంగుళములపొడవుగల చిన్న కర్రలను యివ్వవలెను. ఈ కర్రలకు ఒక మొన సన్నగాయుండి భూమిలోనికి గ్రుచ్చినపుడు సులభముగా దిగేలాగున వుండవలెను. నాయకులకు కర్రలు అవుసరములేదు. ప్రతిభటునికిన్ని తోకలు వుండవలెను. అనగా ఒకచిన్న గుడ్డను లాగితే తేలికగా ఊడి వచ్చేలాగున వెనుకవైపున దోపుకొనవలెను. తరువాత ఉపాధ్యాయుడు రెండు శిబిరములు రెండు

పార్టీలకు యేర్పరచ వలెను. ప్రతిశిబిరము 25 గజముల చతురము వుండవలెను. శిబిరము మధ్య యెత్తుగా కనుపించేలాగున ఒక జండాను కట్టవలెను. రాత్రులుఅయిన యెడల లాంతరు కట్టవచ్చును. ఈ ఆటఉద్దేశ్యము ఒక పార్టీవారు రెండవపార్టీవారికి కనుపించకుండవచ్చి శిబిరముగ యేర్పరచిన స్థలములో యెచ్చటనైనను సరె తమ చేతిలోని కర్రను భూమిలో గ్రుచ్చుటకు ప్రయత్నించవలెను. అలాగ్రుచ్చునప్పుడు, తోకగా వెనుకవైపున దోపుకున్న గుడ్డనుతీసి ఆకర్రకు కట్టవలెను, అప్పుడాతడు తిరిగి వేరొకతోకను ధరించవలెను. యేకుర్రవాని తోకనైనను వైరికుర్రవాడు లాగివేయగలిగిన యెడల తోకగోలుపోయిన కుర్రవాడు అయిపోయినట్టుయెంచబడి ఆటలో పాలుగొనగూడదు. అలాఅయిపోయిన కుర్రవాండ్లు అందరు ఒకచోట విడిగా కూర్చుండవలెను. కుర్రవాండ్లు అందరు నాయకుని వుత్తరవుప్రకారము నడచుకొనవలెను. నాయకులు కొంతమంది కుర్రవాండ్లను కర్రలు పాతుటకున్ను, కొంతమందిని శత్రువులు శిబిరములోకి రాకుండ కాపాడుటకున్ను ఉపయోగించవలెను. నాయకుడు ఉత్తరవులు యివ్వవలసినదేగాని ఆటలలో పాలు గొనగూడదు. నాయకుడు ఉత్తరవులు యిచ్చుటకు చెట్లనుగాని లేక యెత్తైన ప్రదేశమునుగాని, ఉపయోగించవచ్చును. వైరి శిబిరములో కర్రనుపాతిన ప్రతికుర్రవాడున్ను సరాసరి తన నాయకుని వద్దకు వెళ్ళి సమాచారము తెలియచేయవలెను. ఆకుర్రవాడు శిబిర రక్షకులలో చేరవలెనే గాని తిరిగి కర్రను పాతుటకు ప్రయత్నించకూడదు. వైరి శిబిరములో కర్రనుపాతి తిరిగి వచ్చునపుడు కుర్రవాడు వైరులచేత జిక్కినయెడల వైరులు ఆకుర్రవానిని వెనుకకు తీసుకొనివెళ్ళి ఆకుర్రవాడు పాతిన కర్రను ఊడదీయించి ఆకర్రకు కట్టిన తోకను వైరులు తీసుకొని ఆకుర్రవాడు అయిపోయినట్లు చేయవచ్చును. ఈ ఆట నియమితకాలము పెట్టుకుని ఆడవలెను. నియమితకాలము కాగానే ఉపాధ్యాయుడు ఈలను వేయవలెను ఈలను వేసిన తక్షణం ఆట చాలించవలెను. ఏపార్టీవారు శత్రుశిబిరమందు యెక్కువ కర్రలు పాతిరో ఆపార్టీవారు గెలిచినట్లు యెంచవలెను. లేదా రెండుపార్టీలవారును కర్రలను పాతలేకపోయిన యెడల యేపార్టీవారు యెక్కువతోకలను లాగికొనగలుగుదురో ఆపార్టీవారు గెలిచినట్లు యెంచవలెను.

—కావలి శంకరరావు,
ఆంధ్రరాష్ట్రీయ సహాయ కమీషనరు.

# వల్లూరుపాలెములో నొక క్రొత్తవింత

## పచ్చతలగుడ్డలు.

కాళయుక్తి సంవత్సర ఫాల్గుణమాస మధ్యమునం దొకనాటి సాయంసమయమున పదుగురు యువకులతి వేగమున బెజవాడతాలూకా కృష్ణానదీ తీరముననున్న వల్లూరుపాలెము వైపుకు వచ్చుచుండిరి. అందొకఁడు కాకీదుస్తులు ధరించి తల కాకుపచ్చని గుడ్డచుట్టి చేతిలోని బెత్తము నాడించుచు జురుకుగ ముందునడువ మిగిలిన వారందరును వానిని వెంబడి త్వరితముగ జనుచుండిరి. వారిలోఁ గొంచెము పొడగరియగు నతనిచేఁ బట్టుకొనబడి గాలికి టపటపఁ గొట్టుకొనుచున్న జాతీయ పతాకమును, నడుమ నడుమ "ఆంధ్రమాతకు జై" "బాలభటోద్యమమునకు జై" యని నడచువారు చేయు కేకలను, దేశసేవయందు వారికిగల యుత్సాహమును ప్రకటించు సంభాషణమును గలిగిన వారెల్లరకును వారేదో యత్యవసరమగు కార్యముపట్లఁ బోవుచున్నట్టు స్పష్టపడక మానదు. వారు దాటి వచ్చిన ప్రతిగ్రామమునందును, వారివెంట గుమిఁగూడి పరువెత్తుకొని వచ్చుజనుల గుంపులును, మీదేయూరు ఎచటి కేమి పనికై బోవుచున్నారలని ప్రశ్నించు జనుల యాతురతయు, ప్రజలకు బాలభటోద్యమము నందుగల యభిలాషను విశదముగ వెల్లడించు చుండెను. చదువరులారా! ఆపోవువారెవరో గ్రహించితిరా? కాకీదుస్తుల ధరించి యాకుపచ్చని తలగుడ్డఁజుట్టి, చేతిలో దండమునుబూని యెల్లపుడును దైవమునకును, రాజునకును, దేశమునకును సేవఁజేయ సంసిద్ధులుగ నుండు భారతయువకులను మీరేగ్రామమునం

గును జూచియుండలేదా? వారేబాలభటులు. వల్లూరు పాలెములో జరుప నిశ్చయింపఁబడిన శిక్షాస్థానమునకే వారు పోవుచున్నారు ప్రొద్దుగ్రుంకునప్పటికి వారెల్లరును వల్లూరుపాలెముచేరి వారికొఱకై దేశాభిమానులగు బండి వేంకటకృష్ణయ్య సోదరిగారి వలన నేర్పరుపబడినఁ గృహమున విశ్రమించిరి.

## క్రొత్త ఆట.

మరువాఁడుదయమునుండి బాలభట శిక్షణము ప్రారంభింపఁబడెను. అదియే ప్రథమాంధ్రబాలభట శిక్షాస్థానమగుటచే చుట్టుపట్ల గ్రామములనుండి యనేకమంది బాలభట శిక్షణము నొందుటకై వచ్చిరి. వందేమాతరగీతసంకీర్తనముతో శిక్షణము ప్రారంభింపఁబడెను. ప్రథమమున అయ్యంకి వేంకటరమణయ్య పంతులుగారుద్యమమును గూర్చియు, దానియావశ్యకతను గూర్చియు ముచ్చటించిన పిదప, శిక్షణక్రమము ప్రారంభింపఁబడెను. ఉదయము 5 గంటలకు మొదలు 10-30వరకును బంధనములు, నమస్కారములు, రహస్యపు గుర్తులు, కవాతు మొదలగు బాలభట విషయములును, మధ్యాహ్నము 1-30—2-30 వఱకు హిందీభాషయు సాయంత్రము 3-30—6-30. వరకు జండావధానము, ప్రథమచికిత్స, మంటలనుండియు, నీళ్ళలోనుండియు మనుష్యులరక్షించు విధములును బోధింపఁబడినవి. ప్రతిదినమును సాయంత్రము, పరిశీలనాశక్తి, యుక్తి, స్వరక్షణ, జాడలు తీయుట మొదలగు గుణముల నభివృద్ధిపరచు నాటలాడఁబడుచుండెను. రాత్రి భోజనానంతరమున బాలభటోద్యమమును గూర్చియు నక్షత్రమండలిని గూర్చియు, తదితర విషయములను గూర్చియు పాఠములు జరుగుచుండి మంగళగీతములతో నాటి కృషి సమాప్తి గావింపఁబడుచుండెను. ఇవ్విధముగ పది దినములకాలములో సుమారు 30 మంది బాలభటోపాధ్యాయులు శిక్షణము నొందియున్నారు.

## గమనియాంశములు.

శిక్షణములోనెల్ల ముఖ్యమగు నట్టియు, మిక్కిలి యుత్సాహకరము గట్టియు విషయము; శిక్షణమంతయు మాతృభాషయందుఁ గరపుటయే. అంతేగాక భరతఖండమున నంతటను సామాన్యభాష కాబోవు హిందీభాష నేర్పఁబడుచున్నది తెనుఁగులో తంతిసమాచారములఁ బంపుటయు హిందిలో కవాతు చేయించుటయు. మఱి రెండు క్రొత్తవిషయములు రాత్రియందు వంతులు ప్రకారము కాపలాకాయుట, నేర్చుట మఱియొక ముఖ్యవిషయము. ఇంతవఱకును మాతృభాషయందు మన దేశమున నేర్పఁబడిన శిక్షాస్థానములలో నిదియే మొదటిది. మఱియు భోజనాదులు ధర్మాత్ముల యభిమానముచే నుచితముగ నేర్పరుపఁబడుట చేతను, నూతనముగ నేర్పరుపఁబడిన యీ క్రొత్తవిషయముల మూలముననను, పిఠాపురమువంటి దూర గ్రామములనుంచి వచ్చిన దేశభక్తులపట్టుదల సందర్భముననను, యీ వల్లూరుపాలెపు బాలభటశిక్షాస్థానము, క్రిందటివత్సరపు టాంధ్ర బాలభటచరిత్రయందు మిక్కిలి ప్రాముఖ్యత గలదిగా నెంచబడవలసి యున్నది ఇట్టి శిక్షణము దేశభక్తిగల ప్రతి పౌరుఁడును పొంది తీరవలయుననుట నిస్సంశయము.

## తుమ్మతోపు.

మా కొఱకై యేర్పరుపఁబడిన నివాసగృహమునకు సుమారు మూడు ఫర్లాంగుల లోపుదూరమున నొక తుమ్మతోఁపు గలదు. గ్రామమునకును నీ చెట్ల తోపునకును నడుమ ప్రవహించు కాలువగట్టుపైన నొక నెత్తైన ప్రదేశమునందు రెండు చిన్న డేరాలు వేయఁబడి యచట శిక్షణకు సంబంధించిన యుద్యోగస్థులు కలిసి విశ్రమించి యాలోచనలు సలుపుటకేర్పాట్లు చేయఁబడి యుండెను. రెండు డేరాలనడుమను జాతీయపతాకమాకాశమున నెగురుచు పూర్వపు టాంధ్రపుత్రుల స్వాతంత్ర్య స్థితిని ప్రకటించుచుండెను. డేరాలయందు ప్రకటనల బల్లయు, శిక్షణమున కవసరమగు జండాలు, కట్టుగుడ్డలు మొదలగు నితర వస్తువు లుంచబడి యుండెను. ఈ విధముగ నన్ని విధములను శిక్షణకు వచ్చిన వారికి వలయు సౌకర్యము లన్నియు, సృష్టినైపుణ్యమువలనను వేంకటకృష్ణయ్యగారి యాదరణవలనను నొక్కచోఁ జేర్పఁబడి యుండెను.

ఉదయము సరిగా 5 గంటలకు ఈల వేయఁబడఁగనే యెల్లరును లేచి కాలకృత్యములు తీర్చుకొని 6 గంటల వఱకును మేలుకొలుపులుపాడుచు భగవన్నామ స్మరణఁ గావించుచుండిరి. వెంటనే అందఱును గ్రామము వెలుపల నుండు చెట్లతోఁపునకు త్వరితముగ వచ్చి

యొక గంటకాలము శరీరపరిశ్రమ విధములు నేర్చుచుండెడి. 7-30 అగునప్పటికి శరీరమునకు గలిగిన పరిశ్రమ ఫలహారములచే నుపశమింపఁబడిన పిదప తిరిగి శిక్షణము రెండు గంటలకాలము జరుగుచుండెను. చెమట పోయునట్లు పని చేసిన తరువాత చేయు ఫలహారమునకు గల రుచియు, శిక్షణము కాగానే కాలువలోనికి దుమికి హాయిగ చేయు స్నానముయొక్క సౌఖ్యమును వర్ణించుటెట్లు? పిమ్మట ఎల్లఱును కలసి గోవిందలు కొట్టుకొనుచు చేయు భోజనపు పట్టు మఱెప్పుడును ననుభవించియుండము. మధ్యాహ్న విశ్రమసమయము ముగియగనే యెల్లఱముఁ గొంతసేపాంధ్రులమనుమాట మరచి యుత్తరహిందూస్థానవాసులమై వచ్చీ రాని మాటలతో హిందీభాష నభ్యసించుచుంటిమి. ఇంతలో యీల వినబడగనే యూరిబయటి శిక్షణప్రదేశమునకుఁ బరుగిడి యితరవిషయముల నేర్చుచుంటిమి. అన్నిటికంటె యానందదాయకమగునవి సాయంకాలపు ఆటలు. వీనినిపుడువర్ణింప మొదలిడిన యెడల యీ గ్రంథాధికారి నన్ను మిగిలిన విషయములఁ జెప్పనీయడుఁ గావున నా మారువేషములు వేసికొనుటలు, ఆయుక్తులు, అపరుగులు ఆసంతోషము, యుత్సాహము తామే యూహించుకొన గోరెద. ప్రొద్దుగ్రుంకు నప్పటికి కెల్లఱును జాతీయ పతాకముచుట్టును జేరి యొండొరులతో సంభాషణ, గావించి దేశభక్తికీర్తనలు పఠించుచుంటిమి. రాత్రి భోజనానంతర మెల్లఱము యూరిబయట డేరాల వద్దనే వెన్నెలలోఁ గూర్చుని యనేక విధముల సంతోషకరములగు సంభాషణలగావింపుచు బాలభటోద్యమ రహస్యములను గ్రహించి దేశసేవావ్రతదీక్షగైకొంటిమి. గడియారము పదికొట్టునప్పటి కంతయు నిశ్శబ్దమే. దినమంతయు గ్రామము నల్లకల్లోలముఁగావించిన నలుబదిసోదరులెచటి కేగిరో!

సోదరులారా! ఇట్టిశిక్షాస్థానముల వలన గలుగు నుపయోగములే కాక యనుభవమును, యుత్సాహమును గ్రహించితిరా? గ్రహించినచో రాబోవు శిక్షాస్థానమెచ్చటనో విచారించి యచటికి తప్పకవత్తురు.

## అతిసంతోషము.

అచ్చట గడచిన పదిదినములలోను, అనుగిన చర్య గాక నెల్లఱును యమితోత్సాహముఁ గలిగించిన విషయములఁ బ్రత్యేకముగఁ జెప్పవలసి యున్నది. అందు మొదటిది పడవపందెములు, ఈతపందెములు. పడవపందెముల యాహ్లాద మనుభవించియే తీరవలయు. త్రాడులాగువారి పాటలు గడలు వేయువారి కేకలు, యెట్లు దిగవలయునో తెలియక వస్తువకు దుముక యత్నించి నీటిలోఁబడి లేచువాని దీనస్థితి, పడవమధ్యఁ గూర్చుండి ధైర్యపు కథుర్లు చెప్పు పిరికివారి పరాక్రమము, పందెము ముగిసి తిరిగి వచ్చునపుడుండు శాంతి, నెవరి వద్దనైన నపుడేమైన తినుబండమున్న దాని కొఱకుగలుగు నోరూరుటలు, పోట్లాటలు, నిశ్శబ్దముగ నున్నపుడు పడవ పోవుమార్గమునునుండు నీటిచప్పుడు, సాయంకాల భానుని మహిమ, చుట్టుపట్ల ప్రదేశముయొక్క సౌందర్యము అన్నియును తన్మయత్వమును గలిగించెను. 50 గజముల యీతపందెములో నాంధ్రజాతీయ కళాశాల విద్యార్థులే ముందు వచ్చిరి. శిక్షణమునకు వచ్చిన వారెల్లఱును రెండుగంటల కాలములో కొయ్యలేకుండ కేవలము రెల్లుగడ్డితో శాశ్వత నివాసయోగ్యముగ వేసిన వివిధ రూపములుగల చక్కని విశాలములగు పాకలను జూచినవారి కత్యంతాశ్చర్యము గలుగకపోదు. ఇట్లు పాకలు వేయుచుండగనే మాలోఁ గొంతకలకలము పుట్టెను. నలుదెసలఁ జూడ నాంధ్రజాతీయ కళాశాల హనుమత్పటాలపు బాలభటులు తమ నూతన రాక్షస (సింహళపు) సోదరులతోగూడ మావద్దకేతెంచి మాకు గల యుత్సాహమును పరింతలు చేసిరి. ఎల్లఱమును గూడి మరునటి దినమున తోట్లవల్లూరు గ్రామమును వీక్షించితిమి. ఉత్తరవల్లూరు వారు మాకు దగు నాతిథ్యమొసఁగి తమ కోటనంతను జూచుటకు మాకువసతులఁ జేసిరి. మేము తిరిగి వల్లూరుపాలెమునకు వచ్చునపుడు గలిగిన యాహ్లాద మెప్పటికిని మరువఁజాలము. అప్పుడు సుమారు పదకొండు గంటలయి నెత్తి, కాళ్ళు, కడుపు మాడుచున్నను, రెండుమైళ్ళదూరము నడచినను మాకావంత ప్రయాసపడినట్లుగూడఁ దోఁచలేదు. దీనిరహస్యము శిక్షణకు వచ్చినవారికే తెలియును. మేమాగ్రామము వెళ్ళిననాఁడు మొదలు వదలి వచ్చునఱకు యేవిధమగు బాధచే పీడితులగువారు గూడ తమంతట తామే మావద్దకు వచ్చి చికిత్స నొందించుకొనుచుండిరి.

## విచారము.

మార్చి 24 వ తేదీరాత్రి మాకు మిక్కిలి విచారము గలిగించిన సమయము. రాత్రి పండ్రెండు గంటలకు నప్పటికి మేమందఱమును మా సామానులఁ గట్టుకొని గూడు లేక చంద్రమండలము వంతను రాత్రి యంతయు మా కండ్ల ముందగ నుంచిన నాలుగు మోట బండ్లపై నుప్పులూరు రైలుస్టేషనుకు ప్రయాణ మైతిమి. రాత్రి వల్లూరుపాలెమున సోదరబృందమును విడచి వచ్చునపుడును, స్టేషను వద్ద బెజవాడ సోదరుల విడనాడు నపుడును గల్గిన విచార మెవ్వరును దాచఁజాలక పోతిమి. ఆ సమయమున నున్న వారిలో ప్రతివారును బాలభటోద్యమమునందును మన జీవితమునందును నిట్టి యాత్ర లెంత సంతోష జనకములో తెలుపుటకు సాక్షులు.

## యాత్ర.

ఆంధ్రసోదరులారా! మనలో దైవభక్తి, దేశభక్తి నశించిన కొలఁదిని తీర్థయాత్రలు తగ్గి పోవుచున్నవి. భరతఖండమున నవతరించి, దైవసృష్టినైపుణ్యమును ప్రకటించు పుణ్యక్షేత్రముల వీక్షించఁజాలకపోయినను, యట్టి జన్మయే పరమావధిగ నెంచుకొను భక్తి జీవనమునకు ప్రథమసోపానములగు నీ బాలభట శిక్షాస్థానయాత్రల సేవించి, మాతృసేవావ్రతదీక్షఁ గైకొనుటకు సమకట్టుదము.

## నే నేమి సేయుదు.

వల్లూరుపాలెములో నేర్పరుపఁబడినది మొదటి శిక్షాస్థానమే ఇంక నట్టి వెన్నియో నేర్పరచినఁగాని యాంధ్రయువకు లెల్లరు నిట్టి శిక్షను పొందఁ జాలరు. కావున దేశాభిమానులును ధర్మపరాయణులును నిట్టి శిక్షణమునకు నన్ని విధముల సాయము సేయ ప్రార్థితులు.

ఇట్టి శిక్షాస్థానముల ప్రయోజనమును గ్రహించియు, భోజనాదు లుచితముగ నొసంగఁ బడు సౌకర్యమును మరువకయు, శిక్షణయంతయు నాంధ్రమున గరపఁబడు నను విషయము గమనించియు నెట్టి విచక్షణ లేక, ఆంధ్రు లెల్లరును నిట్టి శిక్షాస్థానముల కధిక సంఖ్యలుగా వచ్చి మాతృసేవఁ గావింతు రని ప్రార్థించుచున్నాము.

ఈ శిక్షాస్థానము నేర్పరచి, ఖర్చులు భరించి మాకెల్లఱకును గావలసిన సమస్త సహాయమును గావించిన శ్రీ బండి వేంకటకృష్ణయ్య సోదరి గారికిని వారి స్నేహితులకు, వల్లూరుపాలెపు సోదరులకును, వందనము లర్పించుచున్నాము.

ఈ ప్రథమాంధ్ర బాలభట శిక్షాస్థానమున సేవావ్రతదీక్షఁ గైకొన్నవా రెల్లరును తమ కృషిని క్రియారూపముగఁ గనఁబరతు రని నమ్ముచు వారికెల్లప్పుడును నాయురారోగ్యముల నిచ్చి తోడుగ నుండునట్లు నిరంతరమును దైవమును ప్రార్థించుచున్నాము.

## రైలుబండి.

చదువరులారా! మనము పుప్పులూరు స్టేషనుకు వచ్చి చాలా సే పైనది. బండియు మెయిలు లాలస్యము గుటచే మిమ్ము నింత సేపు నిలుప వలసి వచ్చినది. రైలుబండి స్టేషనులో వచ్చి నిలిచినంత నే చూడవచ్చు తల గుడ్డలవారంద ఆశ్చర్య మైరి. బండి కదలు నప్పటికి ప్రదేశ మంతయు "ఆంధ్రమాతకు జై" "బాలభటులకు జై" యను కేకలతో మారు మ్రోగెను. వందేమాతరం.

— వారణాసి వేంకట సుబ్బారావు,
ప్రధానశిక్షకుఁడు.

---

# అర్ధరాత్రి.

I. రెండు జాములు కా వచ్చె • రేలతాంగి
ప్రౌఢ దశనుంట సంతోష • వారిగాని
మేరమీరు సుఖంబుల • మ్రోది నిజ
నాళిఁ దేలిచి దా శాంతి • నందు చుండె
విరహి జనములు వేదనా • పీడమతులు
పాప కార్య శీలురు మధు • పాన రతులు
కవులు చింతనాపరులు మేల్కొనుచు నుండ
వసుధఁ బనిపాటలను శ్రమఁ • బడినవారు
భోగ వైభవములఁ దులఁ • దూగువారు
చింత లన్నియు మరచి నిశ్చింత నిదుర

శేయి వైచి సుషుప్తిని ♦ జెందు చుంద్రు
మధు రసాస్వాద మొనరించు ♦ మందభాగ్యుఁ
డెంచ నింకొక్కపరి చవి ♦ గొంచునుండు
పర ధనాయత్త చిత్తుఁడు ♦ భాగ్యశాలి
గృహము ముంగల దా సంచ ♦ రించు చుండు
పావన శరంబుఁ గోల్పోవ ♦ పాప బుద్ధి
నాత్మ హత్యపరుండు స్వ ♦ హస్త మెత్తు
భూతకాలవిశేషముల్ ♦ పొగడుచుంట
వర్తమాన విచిత్రముల్ ♦ పాడుచుంట
నీ నిశాకాల మంతయు ♦ నే వృథాగ
వ్యర్థ మొనరింప నేల? నీ ♦ పట్టణంబు
సమద సమ్మోద జనసమూ♦హములచేత
నూత నోద్యోగ వితతి మ♦నోహరమయి
పవలు వీథు లెల్ల మహోత్స ♦ వముల వెలిగి
వెక్కి వెక్కేడ్చి నిద్రించు ♦ పెంకిపిల్ల
వానికైవడి విశ్రాంతిఁ ♦ బడయు చుంట
సందు గొందుల వెంబడి ♦ సంచరింతు.

II. కారుచీఁకటి పుర మెల్లఁ ♦ గప్పె నహహ
ఆరిపో నున్నతరి దీప ♦ మల్పకాంతి
నించి బగ్గున మండి క్షీ♦ణించు చుండె
మొరగుచుండెడి కుక్కలు ♦ మొరలుదక్క
మ్రోగుచుండెడి గంటల ♦ మ్రోఁత దక్క
వేఱురావంబు లేవియు ♦ వినఁగ రావు
జగతి గర్వప్రలాపముల్ ♦ సన్నగిల్లె
నరుల రీతి మహా పట్ట♦ణములు గూడ
సమసి పోవంగ నవి యరు ♦ స్థలము లగును
కాలపరిపాటి నీ రాత్రి ♦ కాల మకట
కాల రాత్రియా కాలంబు ♦ గలుగు నొకట
ఇట్టి పట్టణ రాజము ♦ లెన్నియేని
వెలసి క్రమముగా వర్ధిల్లి ♦ విరివి సిగుల
కాటపట్టులై పేరు ప్ర♦ఖ్యాతి నొంది
మన్ను మిన్నుగల న్నాళ్ళు ♦ మను నటంచు
భూమి జనములచే నుతిఁ ♦ బొందు చుండు
భావిజనసమూహముఁ గొన్ని ♦ పట్టణముల
గురుతు లైనను నిజముగా ♦ నెఱుఁగ లేరు
పాడు వడినట్టి యా మహా ♦ పట్టణముల
దుస్థితిం గను పాంథుఁడు ♦ దుఃఖ మొందు
వాటిఁ గన్నులగాంచి దా ♦ భావ మందు
జగము సర్వము మాయ నా ♦ సత్యవాక్య
మరసి వెంటనె విజ్ఞాని ♦ యగును గాదె?

III. మింటి చుక్కల నంటెడి ♦ మేటి కోట
లెన్నియో సౌధరాజము ♦ లిచట వెలసె
తీర్థవాసుల దేవ సం♦ప్రార్థనలకు
గుళ్ళు గోపురాలలు నెల ♦ కొల్పఁబడియె
యిప్పు డవి పాడువడి కడు ♦ హీన దశను
జెంది ముండ్ల డొంకలు చెట్లు ♦ చేమ లెల్ల
పెరిగి క్రూరసర్పములకు ♦ నెలవు లయ్యె
మది దురాశలపాలయి ♦ మనుజు లెల్ల
విషయసుఖముల లోనయి ♦ భీతిలేక
చెనటు లాటచే నవి యెల్ల ♦ శిథిల మయ్యె
మానవాధీశు లెల్ల స♦మ్మానములను
స్థిరతరంబులగు పనులకు ♦ నెఁగపకుండ
రాజ్యసుఖముల క్షణభంగు♦రంబు లైన
కార్యజాలంబులం జూపు ♦ కలుష మతులు
వారి సిరి సంపదలు భోగ ♦ భాగ్యములును
వైరి నృపతుల స్వాయముగా ♦ వలచి వచ్చె
శత్రురాజులు తొలి నప♦జయము నొంది
మరల దండెత్తి కాలక్రి ♦ మంబు గాగ
మించి పరబలమెల్ల ని♦ర్జించి వారి
రాష్ట్ర దుర్గకోశంబుల ♦ రహి వచించి
రంచు పాంథజనంబు త♦లంచుచుండు.

IV. తిలలు నెత్తి పైఁ జల్లిన ♦. తెగపి లేక
లెక్క కెక్కుడు మనుజుల ♦ త్రొక్కుడులకు
స్థాన మైన పట్టణపు బ♦జారు లెల్ల
గాచపాటలు వీథు లీ ♦ రాత్రి వేళ
కొలఁది జనముల చేతనే ♦ గూడి యుండె
ఎవ్వ రీ నిరుపేదలు? ♦ పవ్వళింప
కటికి రానేలయే పాన్పు ♦ గాఁ దలంచి
ధనికు లా వారి యిండ్ల ముం♦దరను నిదురఁ
బోవుచున్నారు విశ్రాంతిఁ ♦ బొందఁగోరి
తల్లి దండ్రులఁ గోల్పోయి ♦ తల్లడిల్లి
భాగ్యవంతుల దయకు న♦పాత్రులగుచు
తిరిపె మెత్తుక దేశముల్ ♦ తిరుగువారు
వీరి దారిద్ర్యముం గను♦వారి కెల్ల

రూఢిగా మానసంబున ♦ రోత బుట్టు
గాని కారుణ్య మేమియు గలుగఁ బోదు
ధరణిని కుచేలుఁనప రాజ♦తారులనగ
చింపిపాతలఁ గొందఱుఁ ♦ జెలగు వారు
తలపఁ గొందఱు కూడు గు♦డ్డలకు వాచి
మెయిఁ గృశింపఁగ రోగులై ♦ మెలఁగువారు
భాగ్యదేవత వీరి గో♦పమునఁ జూచె
జగము సర్వము ♦ వీరిని సన్యసించె.

V. భారతీయులు భ్రాతృభా♦వము త్యజించి
లేశమైనను మది దయ ♦ లేక వారి
పాపఫలమునకై వారి ♦ వదలి రకట
అంగనలు గొంద ఱెందుఁ జె♦లంగు చుంద్రు
క్రమముగా భోగ సౌఖ్య మా ♦ ప్రాయమందు
సౌఖ్య సంపద లెన్నిగా ♦ చాల గల్గి
నేఁడు దురదృష్ట దేవతఁ ♦ గూడి వీరు
చలిని భూమిని శయ్యగా ♦ సలిపి రకట
అక్కటా! వంచకులచేత ♦ నబల లగుట
మానధనమును గోల్పోయి ♦ మరల వారి
దయకు బేరాస దాల్చి త♦ద్ద్వారసీమ
రిత్త కోర్కెలతోడ ని♦ద్రించువారు
ఇట్టి నిశ్చలమగు నిశ ♦ లెంచి చూడ
జనుల మానస జనిత వి♦స్ఫార గర్వ
సర్వ శూన్య తత్వంబును ♦ చాటుచుండు
మదిని బరమాత్మరూపంబు ♦ కుదురు కొలిపి
సత్వగుణసము పేతుఁ డై ♦ శాంతి నెఱిఁగి
పుడమినిఁ జరింప వలెనని ♦ బోధసేయు.

— యస్ రాఘవ అయ్యంగార్.

# * ఆంధ్ర మాతృ స్తవము

శ్రీలన్ జెల్వొసలారుచున్ సుతులచే ♦ సేవల్ దగంగొంచు, స
చ్ఛీలుల్, సాధులు, బండితుల్ దనఁ బ్రశం♦సింపంగఁ బెంపొంది, యె
వ్వేళన్ సూనుల భవ్యమే యరయుచున్ ♦ బేర్మిన్ మహోత్కృష్టయై
హాళిన్ బొల్చెడు నాంధ్రమాతకివె నే ♦ నర్పింతుఁ గైమోడ్పులన్.

సీ. శ్రీశైలమాది స♦త్క్షేత్రంబు లెల్ల నీ,యందుఁ గాదొకో! పొల్చు ♦ నాంధ్రమాత!
గోదావరీముఖ్య ♦ ప్రాదినుల్ జూడ నీ,యందు గాదొకో! యొప్పు ♦ నాంధ్రమాత!
దండకాద్యాటవుల్ ♦ మెండుగానుంట నీ,యందుఁ గాదొకో! చెప్పు ♦ మాంధ్రమాత!
వివిధ మహీధ్రముల్ ♦ వెల్గుచునెప్డు నీ,యందు గాదొకో! మించు ♦ నాంధ్రమాత!

గీ. పరమ కారుణ్యచిత్తులు ♦ భవ్యమతులు, నీతియుతులును విజ్ఞులు ♦ నిర్మలయశు
లరయ నీయందుఁ గాదొకో ♦ వరలుచుండు, రార్యనుతగుణ సంఘాత ♦ యాంధ్రమాత!

సీ. పుత్రివై, విమల చా♦రిత్రవై శ్రీభార,తాంబ గొల్తువు గాదె ♦ యాంధ్రమాత
మాతవై సర్వదా ♦ పూతవై సూనుల, నాదరింతువుగాదె ♦ యాంధ్రమాత
దేవివై మన్నించు ♦ దీవివై దీనుల, యార్తిబాపుదుగాదె ♦ యాంధ్రమాత
పుణ్యవై యార్యాళి ♦ గణ్యవై కోర్కెలీ, వరసి యిచ్చెదుగాదె ♦ యాంధ్రమాత

గీ. అమ్మ నిన్నెప్డు భక్తితో ♦ నమ్ము వతని, కన్నియును గూర్తుగాదె యో ♦ యాంధ్రమాత
ఎంచఁగలదిఁకఁ గొఱఁత నీ ♦ నందనులకు, ఆర్యనుతగుణ సంఘాత ♦ యాంధ్రమాత!.

సీ. పుస్తకాగారముల్ ♦ పొల్పుగా నెలకొల్పి; భావను సేవించు ♦ భవ్యమతులు,
సంఘసభల్ నిల్పి ♦ సంఘ దురాచార,ములఁ ద్రుంపఁజూచు స♦ద్బుధవరులును,

* ఈ పద్యములు అనంతపురమున 1919 సం॥రం ఆగష్టు 23, 24, 25 తారీఖులలో జరగిన ఆంధ్ర మహాజన సభలో జదువబడినవి.

స్వాతంత్ర్యవాదముల్ ♦ సల్పుచు దానికై, శ్రమనొందు చుండెడు ♦ విమల యశులు,
పత్రికల్ ప్రచురించి ♦ ప్రజలలో విజ్ఞానమును వ్యాప్తి నొందించు ♦ వినుత గుణులు,
గీ. నందఱును నేఁడు నీ చర♦ణాబ్జములను, డెందములనిల్పి కొలుచుఁ గ♦డిందిబత్తి
నేగుఁదెంచిరి చూడుమా! ♦ యెలమి మీఱ, నార్యనుతగుణ సంఘాత ♦ యాంధ్రమాత!

సీ. "దేశభాషలయందుఁ ♦ దెనుఁగు లెస్స" యటన్న, నాంధ్రభోజుని దివ్య♦మైన పలుకు,
నెలమిఁజూడఁగ "జన ♦ నీ జన్మభూమిశ్చ, స్వర్గాదపిగరీయ" ♦ సనెడు పలుకు,
నరయ "విద్యావిహీ♦నః పశుభిస్సమానః" యను నీతియై♦నట్టి పలుకు
"బరవశందుఃఖ"మను ♦ భవ్యమౌ పలుకును, "నాత్మవశంసుఖ" ♦ మనెడు పలుకు
గీ. మఱచి పోవక మీ హృత్క♦మలములందు, మననముఁ జేయుఁ డెల్లప్డు ♦ తనయులార!
యనెడు నీబోధ శరముల♦యందుఁదాల్తు, మార్యనుతగుణ సంఘాత? ♦ యాంధ్రమాత.

సీ. విశ్వ విద్యాలయా♦వేశంబు వదలక, కృషిసల్పు చెంతయుఁ ♦ గీర్తి కరము
ప్రత్యేక రాష్ట్రాభి ♦ వాంఛనుఁ బాయక, ధీయుతులై పూనుట ♦ తృప్తి కరము,
ఆంధ్రాంగ్ల పత్రిక ♦ కగు శ్రద్ధ విడువకఁ, బాటుఁ జేకొను చెంతొ ♦ భాగ్యకరము,
"ఆంధ్రుల"మని చాటు ♦ నాసక్తి మానక, దిటవుతో గైకొంట ♦ దీప్తి కరము,
గీ. కరముఁగనికర మొప్ప నం♦దఱును స్వీయ, సోదరుల భంగిఁ గాంచుటే ♦ శుభకరంబ
టంచు బోధించు నీప్రేమ ♦ నెంచఁ దరమె, ఆర్యనుతగుణ సంఘాత! ♦ యాంధ్రమాత.

సీ. ఆంధ్రమా! నాన్సెన్సు ♦ ఆంగ్లంబుతో సాటి, భాషయా యది? యని ♦ పలుకువారు,
రామాయణంబేమి? ♦ రైనాల్డ్సు నావెల్సుఁ, బోలునా? ఛీ! యంచుఁ ♦ ప్రేలువారు,
పాశ్చాత్య జనులచేఁ ♦ బ్రభవించె జ్ఞానంబు, మన కసలెక్కడి ♦ దనెడువారు,
డర్టీ ఫెలోస్ మన ♦ డామిట్సు హైందవుల్, కొఱగారటంచు వా ♦ కొనెడువారు
గీ. అక్కటా! స్వాభిమానంబు ♦ నవలఁ ద్రోసి, యిట్లు మనవా రెగారద ♦ రేమిచెప్ప?
వెన్నువంకను నింటివా ♦ ర్వెక్కిరింప, నెదుటనే పోషణము సేతు ♦ రితర నరులు
ఆర్యనుతగుణ సంఘాత! ♦ యాంధ్రమాత.

సీ. ఆంధ్రభోజుఁడు వోయె♦నంచు నేడ్చెద వేల?, పీఠికా పుర నేత ♦ వెలయుచుండఁ,
బోతన లేడంచుఁ ♦ బొగులఁగా నీకేల?, ఆంధ్రవాల్మీకి తా ♦ నమరుచుండఁ,
దిమ్మర సరిగానం ♦ చుమ్మలించెద వేల?, విశ్వేశ్వరునివంటి ♦ విజ్ఞులుండ,
రణతిక్కఁ డేగెనం ♦ చని వగపా? యశః, కాముఁడై కలియుగ ♦ భీముఁడుండ,
గీ. నీదు సేవను జేసెడు ♦ నిపుణు లెవ్వ, రిపుడు లేరంచు దుఃఖింప ♦ నేల తల్లి?
సిద్ధమైయుండ నీ సేవ♦చేయు సుతులు, ఆర్యనుతగుణ సంఘాత ♦ యాంధ్రమాత.

సీ. ఆంధ్ర దైనిక పత్రి♦కా ప్రచారకుఁడు శ్వేతచ్ఛత్రముఁ భక్తిఁ ♦ దాల్చి నిలువ,
బయ్యావర్యాంభోధి ♦ వారిజారాతి తాఁ, జామరంబొక వంక ♦ సరగ విసర,
వేంకటప్పయ్యయు ♦ వేఱొండు వైపున, మఱియొండు చామర ♦ మంది వీవ,
మోచర్లరులుఁడు స♦మ్ముదమున నీ వెన్కఁజేరి తా వ్యజనంబు♦చే విసరఁగ,
న్యాపతి సుబ్బరా ♦ వాతత భక్తితో, రజిత వేత్రంబొండు ♦ రహివహింప,
భోగరాడ్వంశ్యుండు ♦ పొలుపుగా వేఱొక్క, వెండి బెత్తంబును ♦ వేడ్కఁ బూన,
వేంకటపతిరాజు ♦ విమల భక్తిని ఖడ్గముఁ గేడెముఁ బట్టి ♦ ముందు నిలువ,

సర్వోత్త మాఖ్యుండు ♦ సాభిలాషంబుతో, మ్రొక్కుచు నిన్ జేరి ♦ పొగడు చుండఁ,
గలన నాసంచెర్ల ♦ కృష్ణరా వెలుగెత్తి, "యాంధ్రమాతకు జయ" ♦ మంచు నొడువఁ,
గవులెల్లఁ దమచేతఁ ♦ గావింపఁ బడినట్టి, గ్రంథరత్నంబులఁ ♦ గానుకలివ్వ,
గీ. నిండు కొలువుండు తల్లిరో! ♦ నేఁడు నీకు, లలి సమర్పించితిదె నవ♦ రత్నమాల
తప్పులుండిన నోర్చి సన్ ♦ దయను గనుమ, ఆర్యనుతగుణ సంఘాత! ♦ యాంధ్రమాత.

వేదము వేంకట కృష్ణశర్మ.

---

# ద్వితీయ బాలభటోపాధ్యాయ శిబిరము - కోడూరు

దత్తమండలములు శిశువిధ్యుక్తధర్మమును గుర్తెఱిఁగి రెండుసంవత్సరములుగ నాంధ్రమాతను బూజించుచుండఁ దన్మండల వాస్తవ్యులలో "సిద్ధపడని" వారెవరు? ప్రతిసోదరుఁడును స్వీయధర్మమువంక దృష్టులఁ బఱపుచున్నాఁడు. అట్టియెడ మా కోడూరు సోదరులొక్కకొందఱు "సేవావ్రతదీక్షఁ" గైకొనఁగోరుటలో వింతయెద్దియు లేదు. అట్లు తామాదీక్షను స్వీకరించుటతో నే సంతృప్తి నొందక తోడిదత్తమండల సోదరులకు సయితమొసంగఁదలఁచి శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్య పంతులు గారరుదెంచి శిక్షనొసంగుటకై వాంకి మాయభిలాషమును దెలిపితిమి. దయతోడ వారుసహిత మంగీకరించిరి. "శిక్షాస్థానము కోడూరునందు స్థాపింపఁబడు"నని పత్రికలలోఁ బ్రచురించితిమి. ఇందులకు (వచ్చు వారిభోజనాదివసతులకు) అగువ్యయములను మేముమాత్రమే భరింపఁజాలమి పౌరులపై సయితము వేయఁదలఁచి ౧౯-౭-౧౯ తారీఖున జ్ఞానోదయనిలయభవనమున శ్రీయుత భద్రి సీతారామయ్యగారి యధ్యక్షతక్రింద సభజేసి "బాలభటోపయోగముల"ను గూర్చి మాపౌరులకుఁ దెలిపితిమి. వారును, నుత్సాహముతో నేబదియైదు రూప్యములొసంగునట్లు వాగ్దానమొసరించిరి. ఇంతలో మాలోనొకరును, నీయుద్యమమునందత్యంతాభిమానులును నగు భద్రి సోదరులకుఁ బితృవియోగదుఃఖము సంప్రాప్తమై మాయుత్సాహమున కొకింత యంతరాయముఁ గలుగఁజేసెను. అయిననేమి? తలపెట్టినయుద్యమ మెన్నివిఘ్నములు ఘటిల్లినను సంపూర్తిఁ జేయుటయే మాస్వభావము. అట్లగుటచే మాశక్తికొలఁదిఁ బాటుపడఁదలఁచి యుద్యమవిషయమున విశేషశ్రద్ధఁబుచ్చుకొనఁ జొచ్చితిమి. ఏట్టులో ౧౪౭ రూపాయిలు రాఁబట్టఁగలిగితిమి. కానిరాబట్టిన ద్రవ్యమును వితరణగ నుపయోగించుటలోఁ దగిన శ్రద్ధఁ బుచ్చుకొనుటకు మిత్రులు సహాయపడఁజాలకపోయిరి. మొట్టమొదట మమ్ము ప్రోత్సాహపఱచిన వారిలోఁ గొందఱు మెల్లగ జారుకొనిరి. ఇంకమాకర్తవ్యమెద్ది? భగవంతునిపై భారమువైచి కార్యక్రమమున కుపక్రమించితిమి. సేవకసంఘమునకు వసతిగృహముగ ధూమశకటాలయ సమీపమునందు పేరూరి ఎరికలయ్యశ్రేష్ఠి గారి సత్రము నేర్పఱచుటయు గాక దానికనతిదూరమున నే బోధించుటకనుకూలముగనుండునట్లు పటకుటీరము సయిత మొకటి నిర్మింపఁబడెను. వసతిగృహమునకేదురుగనుండు పొలములలో కవాతు నేర్పుట కనుగుణ్యముగనుండెను. ౨౬ వ తారీఖు రాత్రి రైలుబండ్లలో నే, మదనపల్లి, నారాయణవరము, ఉరవకొండ, ధర్మవరము, పుల్లంపేట, ఇంద్రావతీ మొదలగు స్థలములనుండి సుమారిరువదినలుగురాంధ్ర సోదరులు శిక్షనందుటకరుదెంచిరి. ఇట్టి యుద్యమములన్న వెనుదీయు దత్తమండలవాసులు మాశిక్షాస్థానమునకుఁ బదిమందియో పదునైదుగురో వత్తురనియు, నందును మా కుగ్రామమునకు-సర్వవిధముల హైన్యస్థితి యందుండు కడపమండలములోని యీయరణ్యప్రాంత్య గ్రామమునకింకను దక్కువ వత్తురేమోయనియు, మాయుద్యమము సఫలీకృతము కాదేమో యనియుఁ జింతించుచుండ నిందఱు సోదరులరుదెంచుటచే మాప్రయత్నములు సంపూర్ణ సాఫల్యత నొందెను. దత్తమండల భావిశుభోదయమున కీయుద్యమము రెండవసూచనమగుఁగాక!

ప్రతిదినము ఉదయము 7 ఘంటలు మొదలు రాత్రి పదిఘంటలవఱకును శిక్షనొందవలసినవారు శిక్షకులయాజ్ఞానుసారము నడువవలసియుండెను. మధ్యాహ్నము భోజనానంతరమును, రాత్రిభోజనా త్పూర్వమును శిక్షాగ్రాహకుల కొకింత విరామముండెను. కానియప్పుడుసయితము తమబంధుగుల . కుత్తరములు వ్రాసికొనుటో- తమపాఠముల జదువుకొనుటో తప్ప విశ్రమించుటకు సాధ్యములేకుండెను.

వసతిగృహకుడ్యములకుఁ గాలక్రమసూచికయు, భటవందనపటమును, హిందీయుత్తరసూచికయు, భటశుల్క పటమును భటునిగుర్తులు తంతిగుర్తులు బంధనములు-వీనినిదెలుపు పటమును వ్రేలాడఁగట్టబడి యుండెను. సర్వవిధముల బోధనకనుకూలమగు పద్ధతులనవలంబించి శిక్షకులు, వచ్చిన సోదరులకు శిక్షనొసంగిరి. ఆతొమ్మిది దినములును వర్షము లేకుండుట యొక్క మేలు. పక్షులరుతములచేతను, మంచెలపైనెక్కి కూయుచున్న కాపుల కోలాహలములచేతను ప్రకాశించుచుండు సజ్జపైరులును అడవులును తోటలును ఆటలందు భటోపాధ్యాయులు దాగుకొనుటకెంతయు ననుకూలముగనుండెను. వేయేల! సర్వవిధముల శిక్షణకాలము సంతోషదాయకముగనే యుండెను. మాసోదరులు మాలోపములను గొప్పగా నెంచక శిక్షణనొందుటయే ఘనముగ నెంచి, తమతమ గ్రామములయందు బాలభటసంఘ నిర్మాణమునకుఁ గొందురుగాక !

వ ం ద న ము లు.

మా ప్రార్థనమంగీకరించి మా యూరికి రుదెంచి, యనేక శ్రమలకోర్చి శిక్షణనొసంగిన శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్యగారికిని, ద్రవ్యసహాయము, శరీరసహాయము నొనరించిన శ్రీయుత దరిశి గురవయ్యశ్రేష్ఠిగారికిని, భద్రిసోదరులకును, తోట రామకృష్ణయ్యగారికిని, సుగాశి గురవయ్యగారికిని, పోతురాజు వేంకట సుబ్బయ్యగారికిని మా కృతజ్ఞతాభి వందనముల నర్పించుటయ కాక, బాలుఁడయ్యును నీయుద్యమము నందత్యంతాభిమానముతోఁ బ్రథమమునుండియు మాతోడఁ బాటుపడిన శ్రీ సుగాశి రంగస్వామిగారికి భగవంతుఁ డాయురారోగ్యైశ్వర్యము లొసంగుఁగాక!

సీ. ఆంధ్రోద్యమంబెంతొ ♦ నా దర్శముగఁగొని
దేశసేవకుఁడైన ♦ ధీరుఁ డెవఁడు,
బాలభటోద్యమం ♦ బాంధ్రదేశంబున
విస్తరిల్లగఁజేయు ♦ విజ్ఞుఁ డెవఁడు,
గ్రంథాలయోద్యమ ♦ కార్యాలయంబునఁ
గార్యదర్శిగనుండు ♦ ఘనుఁ డెవండు,
"సర్వస్వము"నకుఁ దా ♦ సంపాదకుండయి
భావనసేవించు ♦ ప్రాజ్ఞుఁ డెవఁడు

అతని శ్రీయుతుఁడైన న♦య్యంకి వంశ్యు
వినుత వేంకట రమణాఖ్యు ♦ విశ్రుతయశు
మాయుపాధ్యాయు యుద్యమ ♦ మన్నిదిశల
జేరిపెల్లును గావుత! ♦ శ్రీశుకరుణ.

—వేదము వేంకటకృష్ణశర్మ,
కార్యనిర్వాహకుఁడు.

---

# "ఉండవిల్లి" యాత్ర

తెలతెలవార గగనంబను ముఖంబునకు బొట్టుగనున్న జుక్కలు రాల, కుక్కుటంబులు కూతలుకూయ, తమమిత్రుని వాగ్ధోరణిని గుర్తెఱిఁగి ఛిడియుంబుబాప బరుగులిడు బాంధవునివలె నాప్రభాకరుండు తనకిరణంబుల వెంటనిడుకొని వేదవేదాంత రహస్యంబుల శిష్యులతోడ ప్రసంగింపుచు జనుదెంచు భూసురునిచందంబున ప్రాఙ్ముఖంబున ప్రవేశించి- హస్తంబుల సమ్మార్జనీలచేత నలంకరించి నిస్సరణంబులజిమ్ముచు, సందురము వ్యాపింపజేయుచు, నిగ్భయంబుననుండు కులుకురాండ్లను, బెదరగొట్టి, కడుపారపాలుద్రావి మాతలకడ చెల్లాటలాడు నావుదూడలకు నలసట గలిగించుచుండెను.

అంత నే నిదురలేచి కాలకృత్యంబుల నెరవేర్చుకొని ప్రాతఃకాలభోజనమాచరించిమాబాలభట ప్రధానకార్యాలయమగు రామమోహన ధర్మగ్రంథాలయమున కరుదెం

చితిని. అచ్చట మా ప్రధానరాష్ట్రీయ కమిషనరు గారు నాకు తోడిభటుల మువ్వురనొసంగి, ముందుగా యుండవల్లి గ్రామంబునకరుదెంచి, యచ్చట వలయు సామగ్రిని సిద్ధముచేయుడని యానతిచ్చిరి. అంతట మేమును శ్రీ వారియాజ్ఞ శిరసావహించి పయనమై విజయవాడకు దక్షిణముననున్న మహానదియగు శ్రీ కృష్ణానదిని సందర్శించితిమి.

అయ్యది, పూర్వమింద్రకీలాద్రి పర్వతంబను పేర్వడసి శుద్ధోదకస్నాన మాచరించుచు తపోనిష్ఠాగరిష్ఠులైన ఋష్యాదులచే నలంకరించబడి దుర్గాపీఠంబును తన మీద నధిష్ఠింపజేసికొనిన పడమటి దిక్కుననున్న దుర్గకొండను భేదించుకొని, దాని సోదరభావమును విడదీసి, పక్కన ఘోషంబులకు పంటలకాధారమై, నడిమిన ద్యాణంబు చందంబున నానకట్టచేత బంధించబడి, కంఠహారంబు పగిది నొకవంతెనచే నలంకరింపబడి, యావలి యొడ్డున నుండు సీతానగరాది పల్లెలకుబోవు పాంధులకు మార్గమొసంగుచు, చూపరులకు నేత్రానందకరంబుగనుండి, స్నానపానాదుల కుపయోగించుచుండెను. తనభర్తయగు సముద్రునిచెంతకు జనుచుండ సంతోషానంద భరితంబున పరిచారకులందరు భేరీమృదంగాదుల మ్రోయించుచున్నారోయన నొక్క ధూమశకటంబు సరకులచేనింపబడి, యావంతెనకు పైభాగంబున పలుగులిడెడి బాలభటులమైన మమ్ము నల్వురిని దాటవలయునని నిశ్చయించి పయనమై వంతెనకుదిగువ భాగముననున్న యినుపమార్గమును వెంబడించుకొని పోవుచుండెను. మేమును దానిని దాటి పేర్వడయవలయునని దృఢనిశ్చయులమై, తలపాగలు కర్రలు శిరకరంబులదాల్చి పరుగులిడి, మార్గమధ్యంబునవలయు చిదుకులనుగొని బయనమై పడమటి దిక్కున దిటిగి నదియొడ్డున దుర్గకొండలోనుండి చీలిన సీతానగరపుకొండ ప్రక్కనున్న కాలిత్రోవను రాళ్ళు అప్పలు మున్నగునవి లెక్కకు మిక్కుటముగనున్నను వినుకుజెందక గురునాజ్ఞకు బద్ధుండైన శిష్యుడే శిష్యుడనియెంచి పరుగులిడుచు, వెనుకవచ్చెడి మాభటపటాలంబునకు మార్గమతి సులభంబుగ దెలియుటకై, యందందువలయు గుర్తుల నలంకరించితిమి.

పిమ్మట నానకట్టసమీపమునకు రాగనే మూడు వంతెనలచేత నలంకరించబడిన మద్రాసుకాలువ మర్యాదగ శాంతవృత్తిదాల్చి జనుదెంచుచుండె.

అంత నాలుగుబారలు నడువ రస్తాకు నావలిభాగమున నొక వాగుగలదు. దానివెంబడి నొకకాలిత్రోవ వాగులచందంబున వంకర వంకరగదిరిగి యుండవల్లి గ్రామంబున కలుదెంచును. వాగుకు నీవలప్రక్క రస్తామీదనొక ఇనుపమార్గముగలదు. వాగు వెంబడినున్న కాలిమార్గము, రెండుప్రక్కల తుమ్మలడే నిండుటచే, ముండ్లచేత నచ్చటచ్చట నింపబడియున్నది. వాగు మొదటను పాడుపడిన పడవయొకటిగలదు. ఆమార్గము మిట్టపల్లములుగనుండుటచే పరుగెత్తుటకు కష్టముగానుండెను.

అందందు తాళవృక్షములు గల జొన్నచేలును తోటలును నమితముగ పెంచబడి యుండుటచే నచ్చటి జనులకు దాటికలుప చౌకయని నూహింపవచ్చును. మరియు నా జొన్నచేలకు హిందూమతసిద్ధాంత ప్రకారాను సారంబుగ నొక కుండను ఆచేలమధ్య నొక కర్రకు తగిలించిరి. ఆప్రదేశములయందు పచ్చిక బైళ్ళమితము గనుండుటచే పశ్వాదు లపరిమిత సంతోషానందముచే కడుపారసుఖంబుగ భుజించుచు, నందందుగల గుంటలలోనీళ్ళుత్రాగి హాయిగబరుండియుండెను, మఱికొన్ని బురదలోనుండిలేచి మారంగు తలపాగలను జూచి బెదరి పారిపోవుచుండెను.

మార్గమునకు కుడివైపున నొక జొన్నచేనుగలదు. అందొక మంచెగలదు. ఆ మంచెమీద షుమారేబది వత్సరముల మానవుడొకడు పక్షులను తోలుకొనుచుండెను. ఇట్టి మార్గంబున పైనుదహరించిన గుర్తులవలయు చోట్లనిడుచు, నందడ్డువచ్చు ముండ్లను తొలగించుచు గ్రామమునకు మొదటనున్న నొకమఱ్ఱిచెట్టువరకేగితిమి.

అది యూడలుదిగి నలుదిక్కుల వ్యాపించిన కొమ్మలుగలిగి మధ్యాహ్నపు మార్తాండుని ధాటికాగలేక గగనమార్గంబున పంక్తులుగట్టి పరుగులిడు పతంగసమూహములను తన యొద్దికిజేర్చుకొని యుండుటంబట్టిజూడ, పూర్వీకులకేవిధముగ పరోపకారస్వభావముగలదో నట్లే మారాడుట కశక్తురాలైన యావృక్షము భూతదయగలదిగానొప్పును. దానియొద్ద నొక మంచినీళ్ల భావిగలదు.

గ్రామస్థులందరు సాధారణముగ నాభావినీటి నుపయోగించుచుందురు. ఆ చెట్టుక్రింద మేము వెనుకవచ్చెడి మాసోదరభటులకు అతిసులభంబుగ గ్రామముజొచ్చితిమని తెలియునటుల నొక చీటిఁవ్రాసి యందుకలయులకు గుర్తులనిమిడ్చి భూస్థాపితము జేసితిమి.

అంతట మేము గ్రామములోనికేగి యాయూరి సత్పురుష స్నేహసాఫల్యంబున, వలయు సామగ్రిని సిద్ధపరచునంతలో, పై నుదహరించిన మాసోదరులు భోజనపదార్థంబులచే శిరంబులును, కఱ్ఱలచే కరంబులును, నలంకరించుకొని భటోపాధ్యాయుని యాజ్ఞానుసారంబుగ- గొందఱు సామగ్రిని పర్వతముమీదికి గొంపోవుటకై యుండి, తక్కినవారు "కమీషనరు" గారితో పర్వతము నెక్కసాగిరి. పిమ్మట మాసోదరభటులా సామగ్రిని శిఖరంబునకు జేర్చిరి.

అంత మేమత్యంతకుతూహలాయత్తచిత్తులమై యొక కుండను చేతబట్టుకొని మువ్వురము బయలుదేరి "యుండవల్లి" గ్రామసంచారము గావించి మజ్జిగను సంపాదించుచుండ, మార్గమధ్యంబున నెదురైన మానవులందఱు, మమ్ములజూచి పరిహసించుచున్నట్లు తమలో తామేదియో గొణగుకొనుచు నవ్వుకొనుచుండిరి.

అంత మేమందరమునుగలిసి యాయూరి రెడ్లబజారునకేగితిమి. ఆబజారు షుమారిరువదియడుగుల వెడల్పుగలదు. దానిని వెంబడించి పడమరగబోవ శివాలయ విష్ణాలయములు రెండునుగలవు; అవి యేడంతస్థులు గలిగియున్నవి. ఈ యాలయములాయూరికి పడమరనున్న మహాపర్వతముక్రింద మారేడు మొక్కలచేతను, పశువులకుపయోగించు పచ్చిగడ్డిచేతను నలంకరింపబడియున్న యొక దిబ్బమీదగలవు. శివాలయమునకెదురుగ శిలాశాసన మొండుగలదు. అందు లిఖించబడిన యక్కరములు బొత్తిగగనపట్టకుండెను.

తదుపరి మేము కొంచెముదవ్వునకరుగ పూర్వస్నేహవాత్సల్యమును వీడలేక నావాగు మాప్రక్కనుండెను. ఈవాగు మన పటాలమున్న పర్వతపుప్రక్కగ పరుగెత్తుచుండును. అచ్చట నాంజనేయులవారి దేవాలయ మొకటి రాతిమండపముమీద నిర్మింపబడియుండెను. దాని దరువాజకమ్ములు జూడ నెడమవైపున పూజలుచెక్కిన రాతికమ్మియు కుడివైపున సాగా రాతికమ్మియునుండి, కుడ్యపుఁగొళ్ళునియు గదలినటుల గన్పట్టుటచేతను నయ్యది పురాతన దేవాలయమని చూపరు లూహింపవచ్చును. దానికిముందు నొక మఱ్ఱిచెట్టుగలదు. అది షుమారు పదారు గజముల విస్తీర్ణమున నీడ వహించియున్నది. దానిక్రింద పదునేడు బండ్లుగలవు. దీనినిబట్టిజూడ నా గ్రామస్థులు తమ బండ్లను నచ్చట నుంచుకొనెడి వాడుక గలదని దోచక మానదు.

ఆ చెట్టుముందు భీమలింగస్వామి దేవాలయము గలదు. దానికి రెండు స్తంభములు గలవు. అదియు పురాతనము గానొప్పు. దానికిముందు తాటితోపుగలదు. అయూరివారు దానిని వనమందురు. పై నుదహరించిన ఆంజనేయులవారి దేవాలయమునకు దక్షిణమున గ్రామమును శివాలయ విష్ణాలయములును, ఉత్తరమున వాగును, పడమర గ్రామదేవతయగు గంగానమ్మ గుడియు దానివెనుక మాభటపటాల మలంకరించిన పర్వతంబును గలదు. ఆపర్వతమందు మూడు చిన్నగుహలు గలవు. వానియందు కొన్ని ప్రతిమలు చిత్రికలతోడ నలంకరింపబడియున్నవి. ఆ గుహలు పూర్వమెట్టి మహాత్ములును, తపోనిష్ఠాగరిష్ఠులును నైన ఋష్యాదులచేత నలంకరింపబడెనో గాని, కలిమాయవలన నేడవన్నియు గ్రామస్థుల వంటచెరుకైన పిడకలచేత నింపబడియుండెను.

అచ్చట కొంతతడవుండి, పర్వతముమీది కేగుటకై పడమరగ దిరిగి కాలిమార్గమును వెంబడించుకొనిపోవ, పర్వతము మాకంటికొక పెద్ద పెనుభూతమువలె గన్పట్టె. దానిమీద నొక ఆంజనేయుని విగ్రహము బాలభానుని భంగి నెఱ్ఱని సింధూర తిలకముచే నలంకరింపబడి యుండెను. ఆ విగ్రహము ప్రక్కను కొండమీదకు నొక మార్గముగలదు. అది సాధారణముగ నా గ్రామస్థుల వలన వాడుకయందుంచబడుటనుబట్టి శుభ్రముగ నుండెను. మరియు నీగ్రామమం దక్కడక్కడ నాంజనేయుల విగ్రహములు మెండుగనుండుటచే పూర్వమచటి వాస్తవ్యులు నా రామభక్తుండగు ఆంజనేయుగొలిచి యుండిరని చూపరులు గ్రహింపకమానరు.

కొంతవడికి మేమచటనుండి బయలుదేరి, పర్వతము దరికివచ్చితిమి. ఆపర్వతముమీద మూడంతస్థులుగ గొప్ప

దేవాలయముగలదు. అందు మొదటియంతస్థు ఒక పెద్దగుహయై యేడు ద్వారములను కలిగియుండెను. ఈగుహకు ముందు చిన్నచిన్న చెట్లు చాలగలవు. అదియునుంగాక నందందు పిల్లగుహలును చాలగలవు. దీనికి కుడివైపుననున్న పర్వతపుఖాళీస్థలమున కర్రలచేతను, వచ్చుటనుండెడి చెట్లయాకులచేతను నొకగుడిసె మాభటులచే నిర్మింపబడినది. ఈగుడిసెపైభాగమునంతను ఆకులతోనె కప్పియుండిరి ఇక రెండవయంతస్థుసంగతి విచారింతము. ఇదియొక పెద్దగుహయై నాలుగువరుసలుగలిగి, వరుసయొక్కొంటికి ఆరుస్తంభములుగలిగి, షుమారు 30 అడుగులపొడవును ౧౨ అడుగుల వెడల్పునుగలిగి ముందు విశ్రాంతిస్థలముతో నుండెను. అందుపడమరవైపుననొకవిగ్రహము గలదు. అదిపరుండియుండెను. దానికి తలలేదు. అది షుమారు ౧౫ అ. ౯ అం. పొడవును, ౨ అడుగుల మందముగలకాళ్ళను, ౧ అడుగు మూడంగుళముల పొడవుగల పాదములను గలిగియుండెను. మరియు మొదలికితగినటుల దీర్ఘబాహువులును గలవు. ఈ విగ్రహము షుమారు ౨ అ. 3 అంగుళముల ఎత్తుగల పది దిమ్మెలచే గట్టబడిన యరుగుమీద నున్నది. ఈ విగ్రహము బుద్ధదేవుడని కొందరును, శ్రీరంగనాయకులని మరికొందరును జెప్పెదరు. ఈ రెండవయరయందే భటులుకొందరు వంటలు చేయుచుండిరి ఈ పర్వతమునకు ముందుగల వాగునుండి కొందరు భటులు తమ మతాచార ప్రకారముగా మడిగట్టుకొని శుద్ధోదకముల నతి ప్రయాసముతో కొండపైకి జేర్చుచుండిరి.

ఇక మూడవ యంతస్తునకొత్తము. ఇచ్చట ౨ గుహలు గలవు. వీనికి వెనుక పర్వతాగ్రము విస్తీర్ణముగ వ్యాపించియున్నది. ఈ గుహలయందు కొంద అలసట దీర్చుకొనుచుండిరి. పర్వతముమీదికి కొందఱు ప్రాకుచుండిరి.

అంత నెప్పటిచొప్పున మేము మజ్జిగకై మరల కుండను జేబట్టి దానికి పడమరగనుండు పెనమాక గ్రామమున కేగితిమి. ఆ గ్రామమునకు మొదట వినాయకుని గుడిగలదు. కుడివైపున ఆంజనేయుని గుడిగలదు. అక్కడ పెద్దబజారు గలదు. ఆంజనేయుని గుడికి ముందు రావిచెట్టు గలదు. అచ్చట కొండ మనుష్యులు గుమిగూడి మారంగుతలపాగలజూచి "మీరు తురుష్కులా యుద్ధమునుండి వచ్చితిరా లేక యుద్ధములోనికి గొంపోవుటకై వచ్చితిరా యుద్ధమేమయినది"యని పలు తెఱంగుల ప్రశ్నింపసాగిరి. అప్పుడు మాకొకవిధమైన నవ్వు గలిగినది. కాని యాలసించిన గాలమతిక్రమించునని భయముచే మేము బాలభటులమనియు పరోపకారకులమనియు జెప్పి గ్రామములోనికి ప్రవేశింపనెరుగుగుండ నొకశ్రీరామగుడి మాకక్షిగోచరమయ్యె. దీనికి కుడివైపున నొకబజారుకుబోవు మార్గము మొదటలో శిలాశాసనమొకటిగలదు. మరల దీనికి నెడమవైపున కుడిభాగమునన్నొక గిలకలభావిగలదు. ఆశ్రీరాముని యాలయమును జూచి మనస్సుయుప్పొంగి నీక్రింది పద్యమును జెప్పితిని.

ఉ. ఎందఱు దేవతల్ జనిరి యెందరుయోగులు
జోగులైరి గో
విందునిపాదభక్తి నిక వీడక నుండెడి వార లెందఱో
డెందములందు వేడి తమ డాంబికమంతయు
ద్రోసి వేయగా
చందమునుండి మేము మనసార భజింతుము
రామదేవుడా.

అని ప్రార్థించి యావిగ్రహమునకు వందనంబులొనర్చి గ్రామసంచారంబుగావించి మజ్జిగ సంపాదించుచుండ, లేవనువారును పోట్లాడువారునుతప్ప పోసెడివారరుదు ఐనను ప్రపంచమునందు ప్రతిప్రాణికిని సుఖదుఃఖములు సహజంబులని నమ్మి- గ్రామమంతయు దిరిగి కుండనింపుకొని బయలుదేరుసరికి రెండుగంటలయినది.

అంత మధ్యాహ్నమార్తాండుండు మాయాలస్యమునకు కోపగించుకొని తనబంటులగు కిరణంబులచే బాడిపించుచుండ నట్టి బాధకు తాళలేక మాభటులయొద్దకి బరుగులిడుచుండ, నచటమాభటులు మూర్ఛచే నేలగూలిన నొకశూద్రజాతిస్త్రీకి ముఖమున నీరుజల్లి లేవదీసి ఆమెకును ఆమెచిన్నిబిడ్డకును నన్నపానాదులనిచ్చి బంపి, పర్వతముమీది నొకచెట్టుక్రింద నిదురబోవు మాసోదరభటునిజూచి వానికేదో యాపదసంభవించినదని యనికొని, తాము వేసినగుడిసెను యూడదీసి కర్రలను కరంబులదాల్చి వానియొద్దకరిగి వానినిదుర జెడగొట్టి భోజ

వనమునకు దీసికొనివచ్చుసరికి మేమును మాసోదరులతో గలిసి భోజనమాచరించితిమి.

నాలుగుగంటలయినది. అంతకొంతదడవు విశ్రమించి, తదుపరి యితిహాసోపన్యాసములచేత ప్రొద్దుపుచ్చితిమి. అప్పుడు మా "కమీషనరు" గారు మమ్ములను జేరబిలిచి యీ యాత్రవలన మనము నేర్చుకొనిన సంగతులు, ఈయాత్ర యందుగలిగిన లోపములు వానిని ముందు సవరించుకొన వలసిన మార్గములనుగూర్చి విపులముగ జెప్పిరి. మాకు అతిథులుగ విచ్చేసిన "మిషను" బాలభటులతోగూడి పిమ్మట జాతీయ కీర్తనలతో జయజయ ధ్వానములతో బయలుదేరితిమి. అప్పుడు భానుండు హస్తాద్రికేగుచుండ, మేమును గ్రామస్థులయొద్ద తెచ్చిన సామగ్రిని యొప్పగించి, నిజస్థానంబున కరుగ మొదలుపెట్టి, మార్గమధ్యంబున వచ్చెడి బిల్లగాలులను బీల్చుచు హాయిగ నడచుచుండ, సామగ్రినిదీసికొని కొందరు ముందరుగుచుండ, మార్గమధ్యమున బియ్యపు మూటలశకంబుల నిమిడ్చుకొని నానాజాతులవారును మాకెదురేగ, దారినితప్పికొని యెట్టకేలకు పూర్వజన్మసుకృతముచే నాకృష్ణవేణిని తిరిగి దర్శించితిమి.

అందు యతివడిగ ప్రవహించుటచే గలిగిన భీకరశబ్దంబులకంతయుజడిసి నీటికెదురీదు మీనంబులును, మీనంబుల ప్రాణంబులకు శత్రువులైన జాలరులు తమగాలములతోడ నీటియొడ్డున నిలుచుండుటయు, నట్లు నిలుచున్నవారలా యలలదెబ్బలకాగలేక వెనుకకు జరుగువారును, అట్లు గదలుతరివలలోబడ్డ పులుగులవలె గాలంబుల జిక్కిన మీనంబులనుదీసి బుట్టలవైచువారును, నట్టి బుట్టలనున్న మత్స్యరెక్కలనుజూచి యెత్తుకొనిపోవలయునని కుతూహలంబున, గగనంబుననుండివచ్చియచ్చోట వ్రాలెడి గృధ్రంబులును, గృధ్రంబులను వేటాడ ప్రయత్నించు కిరాతకులును, కిరాతకులు జేయు క్రూరకర్మములజూచి యోర్చుకొనలేని భూసురులచ్చోట స్నానమాడి సంధ్యావందనాది క్రియలక్రమంబుగ నెరవేర్చుకొనుచుండ, మేమును వంతెనదగ్గరనున్న ఆంజనేయుల వారి దేవాలయమును సందర్శించితిమి. అందొక విగ్రహముగలదు. అయ్యది దండధరుడు తన దండంబుచేత దండించుతరి గలుగు శోణితంబుభంగి నెఱ్ఱగ గనప్పట్టునా యస్తమయభానుని కాంతియు దీసిపోక సింధూరముచే నలంకరింపబడి బహువైయ్యారముగ నుంచబడెను.

ఈ ఆలయమునకు ముందు భాగమున నొక చిన్నితోటగలదు. అందు వేపమొక్కలును జాజిమొక్కలును పెంచబడియుండుటంబట్టి యొక విధమైన సువాసన యందుండివచ్చి మాఘ్రాణంబుల నలంకరించెను.

అంత మేము లోనికరిగి స్వామికి ప్రణమిల్లి ముఖంబున నింతసింధూరమలదికొని నందీయబడిన ఫలహారముల స్వీకరించి వంతెనమీద నడచుచుండ నొకధూమశకటము, సంతోషానంద భరితులమైన మేము వచ్చుచున్నామను వార్తను తెలుపుట కరుదెంచుచున్నదో యన పరుగులిడుచుండ హెచ్చరికగలిగి నీవలిగట్టున జేరితిమి. అచట మాతోడివచ్చిన మిషనుబాలభటులు తమ స్వస్థానంబులకరుగ, మేమును రాత్రి యొనిమిది గంటలగుసరికి, మా నిజస్థానంబుల నలంకరించితిమి.

ఉ. బాల భటోద్యమంబుదగ
బాలురుజేయుట కుత్సహించి రె
వ్వేళల నైనగాని దమ
వేల్పులమీదను భారముంచి తా
చాలునటంచును తృప్తినిక
జెందెడిదాకను గోరి, మీఱగన్
మేలులు జేయుచుందురిక
మానవులందఱు సంతసింపగన్.

దుర్గాపటాలము, బెజవాడ. } కుందేరు వేంకటేశ్వర్లు, మార్జాల జట్టు పెద్ద.

# బాల భటోద్యమము ఇంతవరకు జగిరిన పని

## ఉద్యమము యొక్క శక్తి.

నేడు బాలురుగను యౌవనులుగను ఉండి యున్న వారే రేపు జాతీయ మహాసౌధమును నిర్మించువారై యున్నారు. వారి నిర్మాణమునకు గావలసిన పునాదులను వేయుట మనయొక్క విధ్యుక్తధర్మమై యున్నది. మనము వారికి ఇపుడిచ్చు తరిబీతును బట్టియే ఆ సౌధనిర్మాణముగూడ నుండును; మన జాతియొక్క భావిప్రాశస్త్యమున కంతకును కర్తలగు వీరి కొరంతలేమియో దెలిసికొనుట మన బాధ్యతగాదా?

౧ వారు ఆరోగ్యవంతులుగా నుండవలయును. జాతియొక్క శారీరక బలమంతయు దీనిమీదనే ఆధారపడియుండును. సామ్రాజ్యమునకిది రక్తనాళమువంటిది.

౨ తమ ధర్మముయొక్కయు గౌరవముయొక్కయు విలువను వారు దెలసికొనవలెను. జాతియొక్క ధార్మికబలమంతయు దీనిమీదనే ఆధారపడి యున్నది. సామ్రాజ్యమునకిది ఆత్మవంటిది.

3 వారు సేవావ్రతులై యుండవలెను; అట్టి వ్రతమును నిర్వహించుటకు వలయు తరిబీతును శిక్షను వారు పొందియుండవలెను. దీనిమీదనే జాతియొక్క శక్తియంతయు నాధారపడియున్నది. ఇదియే సామ్రాజ్యమునకు శరీరమువంటిది.

౪ వారు పావనవంతులై యుండవలయును. జీవితము పవిత్రవంతమైనగాని ఇహపర సౌఖ్యములు లేవు మానవులభవిష్యత్తు దీనిమీదనే ఆధారపడియున్నది.

మన పిల్లలను యౌవనులను, ఆరోగ్యవంతులుగను ధర్మపరులుగను దేశ సేవానురక్తులుగను పావనవంతులుగను చేయుటకే భారతవర్ష బాలభటోద్యమము ప్రారంభింపబడినది; ఈ యుద్యమమునందు మన పిల్లలు సేవావ్రతదీక్షను గైకొనుటయేగాక, సేవావ్రతమును ఆచరణయందుగూడ బెట్టెదరు. వారేమి నేర్చుకొనెదరో దానిని ఆచరణయందు బెట్టుటకు వలయు సదుపాయములను వారు దీనియందు నేర్చుకొనెదరు.

పది సంవత్సరములకు పూర్వము బాలురను యౌవనులను పౌరధర్మములయందు తరిబీతుచేయుటకై బాలభటోద్యమము ఆంగ్లేయదేశమున "సర్ రాబర్టు బేడెన్ పవెలు" దొరగారిచే ప్రారంభింపబడినది. నాగరికత జెందిన దేశములన్నిటియందును ఇపుడది వ్యాపించియున్నది. అమెరికా దేశ సంయుక్త రాష్ట్రములందే ౨౫౦,౦౦౦ మంది బాలభటులు గలరు; ఈ యుద్యమమును జాతీయ ప్రతిష్ఠాపనగ నంగీకరించుచు నాదేశముయొక్క కాంగ్రెసు మహాసభవారు ఒక చట్టమునుగూడ చేసియున్నారు. రెండులక్షలు మాత్రము జనసంఖ్యగలిగిన "న్యూజీలాండు" దేశమునందే ౨౦,౦౦౦ మంది బాలభటులు గలరు. ఈ యుద్యమము ఆయా దేశములందు ఇంత అద్భుతముగ వ్యాపించు టెందుకు!

ఆ దేశములందలి తలిదండ్రులు తమపిల్లలు ఆరోగ్యవంతులును, ఆత్మవిశ్వాసముగలవారును కావలెననికోరిరి. పిల్లలు తమపనియందు సహాయభూతులయియుండవలెనని ఉపాధ్యాయులుకోరిరి; సన్మార్గులును, ఆత్మగౌరవము గలవారును, విశ్వాసపాత్రులును సేవావ్రతులును అగు పౌరులుకావలెనని అందరును కోరిరి. ఈయుగమందు విద్యావ్యాపకమునకిది అత్యుత్తమమార్గమని వారు కనిపెట్టిరి.

౧౯౧౭ సంవత్సరము మార్చి నెలవరకును భారతవర్షమందీయుద్యమమేలేదు; అప్పటికలుకును చట్టమననుసరించి ఐరోపాదేశీయులను, యూరేషియనులను, క్రైస్తవులనుతప్ప తదితరులను దీనియందు చేర్చుకొనుట లేదు. ఈవిషయము యుద్ధానంతరము ఆలోచించెదమనిరి. అందుచేత మద్రాసునగరమున అనీబీసెంటమ్మగారియాదరణక్రింద భారతబాలభటసంఘము స్థాపింపబడి, ఈ యుద్యమవ్యాపకము ప్రారంభమైనది, భారతవర్షపరిస్థితులకు అనుగుణ్యములగు మార్పులతోను చేర్పులతోను "బేడెనుపవెలు" గారిపద్ధతియే ఇచటను అమలులోనికి తేబడినది. ఇతరదేశములందీ యుద్యమమందు ౧౧ మొ॥ ౧౮ సం॥ వయస్సుగల బాలురకు మాత్రము స్థానముగలదు. మనదేశీయ ఉద్యమమందన్నా ౭ సం॥ మొ

దలు ౧౨ సం॥ వయస్సుగల మగపిల్లలును ఆడపిల్లలును, ౧౨ సం॥ వయస్సుమించిన ఆడపిల్లలును ౧౮ సం॥ వయస్సు మీరిన యువకులును గూడ అవకాశముగలదు.

దేశముకొఱకు తమ లాభనష్టములను వినియోగింపుచు దేవునిదైవభక్తులను సేవింపుచు, సామ్రాజ్యమున రాజభక్తిగలిగి జీవింపుచు, అందరికిని ఉపయోగకారులైయుండ వాంఛింపుచు పౌరధర్మములను గుర్తెఱిగిన వారినిగ మనబాలురను యావనులను జేయుటయే ఈసంఘోద్దేశము.

ఇవియే యీసంఘముయొక్క ముఖ్యసూత్రములు. పసిభటులు (ఏడు మొదలు ౧౨ సం॥ వరకు) బాలభటులు (౧౧ మొదలు ౧౮ సం॥ వరకు) యావనభటులు-అని ఈ యుద్యమమునందు తరిబీతును పొందువారు మూడుతరగతులుగనుందురు. బాలికలకుగూడ ప్రత్యేకశాఖ గలదు. అభిలాషులగు పెద్దలు తమతమగ్రామములందును పట్టణములందును ఈసంఘమునకు శాఖలనేర్పరచి, ఈయుద్యమాభివృద్ధికై కృషిసల్పుదగును. శారీరక సాధకముల మూలమునను, కవాతువలనను, బహిరంగ ప్రదేశముల నాడుకొను ఆటలవలనను, యాత్రలమూలమునను, పలువిధములగు చేతిపనులయందు ప్రాథమికజ్ఞానము కలుగజేయుటమూలమునను- దెబ్బలుతగిలినవారికి ప్రాథమిక చికిత్సజేయుట, అశ్రూషావధానమును జేయుట గుడిసెలను గట్టుట, తోటలను పెంచుట, ఈత నేర్పుట మున్నగునవి నేర్పుట మూలమునను యీ భటోద్యమమందు శిక్షనొసంగబడును. భటధర్మములవలన ధర్మమార్గానువర్తనమలవడుటయేగాక తమ గౌరవముయొక్క విలువను వారు తమ దృష్టియం దుంచుకొనెదరు. ఇతరుల బలవంతముమీదగాక తమంతట తాము ఒక విధమైన శిక్షకు లోబడియుండుట యందును జావాబుదారీని వహించుటయందును సోదరబంధములను పెంపుజెందించుకొనుటయందును ఈ యుద్యమము అద్భుతములగు అవకాశములను గలుగజేయుచున్నది.

మాతృదేశాభివృద్ధిని గోరువారందఱును భావికాలమందు జాతీయ నిర్మాతలుగ నుండతగిన బాలుర అభివృద్ధిని గోరువారందఱును ఈ యుద్యమ వ్యాప్తికై కృషిసలుపవలయును. యువకులయం దుత్సాహమును కలిగించుటయందు దీనితో సాటియగునది లేదు. ఇది రాజకీయ విషయములకు గాని, మతకక్షలకు గాని, చోటియ్యనిది; మన పిల్లలయొక్క శక్తియుక్తులను సన్మార్గమున ద్రిప్పునది. ఆత్మగౌరవమును, ఆత్మ విశ్వాసమును జితేంద్రియత్వమును గలిగించి సేవావ్రతమునందును, పౌరధర్మములయందును తరిబీతు నిచ్చునది; దేశమునకును సామ్రాజ్యమునకును మానవకోటికిని సేవజేయించునది.

## ఉద్యమబీజములు.

౧౯౧౬ సం॥ రమున సంభవించిన కృష్ణ, కొల్లేరు వరదల సందర్భమున పలుగ్రంథాలయముల ప్రతినిధులు బెజవాడ సేవకసంఘమువారి ఆదరణక్రింద చేసినసేవ చాలమందికి జ్ఞప్తియందున్నదని తలంచెదను; అప్పుడు వరదలపనులు ముగిసిన పిమ్మట సేవజేయుటయందు సేవకులకు తరిబీతునిచ్చినయెడల, సేవావ్రతమింకను ఎక్కువ దీక్షతోడను ఎక్కువ పవిత్రతతోడను జరుగగలదనియు, ఇట్టి యాపత్తులు ఒకరితో చెప్పిరావు గనుక వచ్చినప్పటికి "సిద్ధపడియుండు" వారుండుట అత్యంతావశ్యకమనియు తలంచినవారమై బాలభటోద్యమమునుగూడ నెలకొల్పి ఆంధ్రదేశమున కంతకును సేవాసంఘమును స్థాపింపవలయునని వాంఛించితిమి. ఇంతకాలముదాక ఆకోరిక ఫలింపకపోయినప్పటికిని మాహృదయములందు పరిపక్వమగుచున్నదని మాత్రము చెప్పగలము. సుమారు నాలుగు మాసములక్రిందట భారత బాలభటసంఘ ప్రధాన కమీషనరుగారగు పియర్సుదొరవారును, బందరు జాతీయకళాశాలయందు బాలభటోపాధ్యాయులగు వారణాసి వేంకటసుబ్బారావు గారును దయతో బెజవాడకు విచ్చేసి మాలోగొందఱకు బాలభట శిక్షణము నొసంగి మావాంఛ సఫలమగుటకు గావలసిన యవకాశము నొసంగిరి.

## ఈయుద్యమమును వ్యాపింపజేయుటెట్లు ?

ఆంధ్రదేశమునందీ యుద్యమమును విరివిగ వ్యాపింపజేయుటకుగాను, ప్రతిపట్టణమునందును, పల్లెలయందును బాలభటోపాధ్యాయులుగ తయారయినవారు ఒక్కరయినయుండుట అత్యంతావశ్యకము; అట్టి ఉపాధ్యాయులు తయారగుటకుగాను అక్కడక్కడ శిక్షాస్థానములనేర్పరచి, వారిని తరిబీతుచేయవలసియున్నది. శిక్షాస్థానములను యేర్పరచుటయన్న సులభముగ కొనసాగు నట్టికార్యముగాదు. విశేష వ్యయప్రయాసలతో గాని కొనసాగదు. భటోపాధ్యాయులను తరిబీతుచేయుటకు తగినంతమంది శిక్షకులుండవలయును. భటోపాధ్యాయులుగ తయారగువారికి తగిన వసతులమర్పుటకు ఉదారవంతులుండవలయును. బాలభటోపాధ్యాయులనుతయారు జేయుటకయి అథమము ప్రతితాలూకాకును ఒకశిక్షాస్థానమునయిన ఏర్పరచుట అత్యంతావశ్యకమయి యున్నది. ప్రస్తుతమున్న పరికరములనుబట్టి ప్రతితాలూకాకును

ఏర్పరుపలేక పోయినప్పటికిని, ప్రతిజిల్లాకును ఒక్క శిక్షాస్థానమునైన ఏర్పరచుటకయి ప్రయత్నములను సలుపుచున్నారము.

## ప్రథమశిక్షా శిబిరము.

ఔదార్యవంతులును, దేశాభిమానులును, పరోపకారపారీణులును అగు శ్రీబండి వేంకటకృష్ణయ్యగారి పోషణ వలన, కృష్ణాజిల్లా బాలభటోపాధ్యాయుల శిక్షాశిబిరమును గడచిన మార్చినెలయందు బెజవాడ తాలూకా వల్లూరుపాలెమునందు బెజవాడ బాలభట సంఘమువారి యాదరణక్రింద నిడపితిమి. భటోపాధ్యాయులకు కావలసిన సమస్త సౌకర్యములను, శ్రీ వేంకటకృష్ణయ్యగారు మిక్కిలి ఓపికతోను, శ్రద్ధతోను నిర్వర్తించి బాలభటుల కృతజ్ఞతకు పాత్రులైరి. బాలభటులు సేవావ్రతులుగదా. కావున వారు ప్రతిఫలముగ జేయదగినది భక్తిపురస్సరమగు ఒక్క వందనమే; ఆవందనమును వారెప్పుడును జ్ఞప్తియం దుంచుకొనుటకై ఒక పతకమును జేసి వారికర్పించితిమి.

వల్లూరుపాలెమునందు యేర్పరచిన యీ శిక్షాస్థానముతో భారతవర్ష బాలభటోద్యమ చరిత్రయందొక నూతనయుగము ప్రారంభమైనదని చెప్పవచ్చును. ఇంతవరకును భారతవర్షము నందంతటను భటులశిక్ష ఆంగ్లేయ భాషయందే నడుపబడుచున్నది. కాని ఈ శిక్షాస్థానమునందు శిక్షయంతయు ఆంధ్రమునందే గరపబడినది. కవాతు పదములు హిందీయందు వాడబడినవి. అక్షరావధానము ఆంధ్రమునందే గల్పింపబడినవి. ఈశిక్షాస్థానమునందు ౩౨ మంది ఉపాధ్యాయులుగను, ౮ మంది బాలభటులుగను తరిబీతును పొందియున్నారు

## ఇతర శిక్షా శిబిరములు.

కడపజిల్లా కోడూరు గ్రామమున ౧౯౧౯ సం. ఆగష్టు నెల ౨౭ వ తేదీనుండి, తొమ్మిది దినములు బాలభటోపాధ్యాయులద్వితీయ శిబిరము అత్యుత్సాహముతో మిక్కిలి జయప్రదముగ జరిగినది. ౧౬ మంది బాలభటోపాధ్యాయులుగను, ౮ మంది యాకన భటులుగను తరిబీతునొందిరి దత్తమండలముల యందిదియే ప్రథమ శిక్షాస్థానము. కడప, అనంతపురం, చిత్తూరు, కృష్ణాజిల్లాలనుండి ఉపాధ్యాయులుగ తరిబీతును పొందువారేతెంచిరి. కోడూరు గ్రామము శిక్షాస్థానమునకు అనేక విధముల ఒప్పియున్నది. ఎక్కడ జూచిన చక్కని తోటలు, దొడ్లు, పైరులతో నిండియుండిన పొలములు, అడవులు, చక్కని సెలయేరులు. గ్రామస్థులు అత్యుత్సాహవంతులు. జ్ఞానోదయ గ్రంథాలయ సభ్యులందరును-ముఖ్యముగ అధ్యక్షులగు శ్రీదర్శి గురవయ్యగారును కార్యదర్శులగు శ్రీ సీతారామయ్యగారును వారి సోదరులును శ్రీ పెరుమాళ్ల శ్రేష్ఠిగారును చూపిన యాదరణము ఎన్నటికిని మరపురాదు. శ్రీ వేదం వేంకట కృష్ణశర్మగారి పట్టుదలయే ఈ శిక్షాస్థానమునకు ముఖ్యకారణమయ్యెను. దత్తమండలములందు బాలభటోద్యమ బీజములను నాటుటకు ప్రథమ ప్రయత్నము నొనర్చిన కోడూరు వాస్తవ్యుల మాతృదేశాభిమానము మిక్కిలి ప్రశంసనీయము.

దత్తమండలములకు ద్వితీయ శిక్షాశిబిరము సెప్టెంబరు నెల ౨౨ వ తేదీనుండియు చిత్తూరుజిల్లా తిరుత్తని గ్రామమునందు నిర్వహింపబడినది. ఆంధ్రరాష్ట్రీయ బాలభట సహాయకమిషనరుగారగు శ్రీ వారణాసి వేంకటసుబ్బారావుగారు ఈ శిబిరమునునడపిరి. తిరుత్తని గ్రామము గొప్ప పుణ్యక్షేత్రము. కొండలతో దర్శనీయమై యొప్పుచుండును. ఈశిబిరమునకు గావలసిన యేర్పాటులను శ్రీ బూమూరు రామానుజులురెడ్డిగారును శ్రీ యం. ముని కన్నయ్యగారును బాల్యులయ్యు మిక్కిలి జయప్రదముగ నిర్వహించిరి; వీరికి అండగ చిత్తూరు న్యాయవాదులును దేశాభిమానులును నగు శ్రీ బి. మునుస్వామినాయుడుగారు నిలచి సర్వవిధముల సహాయమును జేసియున్నారు. ఈ శిబిరమునందు ౧౬ మంది బాలభటోపాధ్యాయులుగ తరిబీతును పొందియున్నారు.

సెప్టెంబరునెల ౨౯ వ తేదీనుండియు గుంటూరునందు వేరొక శిక్షాశిబిరము నెలకొల్పబడినది. ఈ శిబిరమునకు కావలసినయేర్పాటులన్నిటిని శ్రీ చట్టి నరసింహారావు పంతులుగారు అత్యుత్సాహముతోను, మిక్కిలి పట్టుదలతోను జయప్రదముగ జేసియున్నారు. తొంబదిమంది బాలభటోపాధ్యాయులుగను, జట్టుపెద్దలుగను తరిబీతును పొందినారు. ఈశిక్షాస్థానమును ఆంధ్రరాష్ట్రీయ బాలభట సహాయకమిషనరుగారగు శ్రీ కావలి శంకరరావుగారు తమ సహాయకులతో నడపిరి. ఈశిక్షాస్థానమును జయప్రదముగా కొనసాగించుటకై శ్రీ నరసింహారావుగారు అనేక విధముల మిక్కిలి ఓపికతో శ్రమపడి పనిజేసి యుండుట శ్లాఘాపాత్రము.

## ఉద్యమము ప్రచారమగు టెట్లు?

ఈ బాలభటోద్యమము ఇతరోద్యమములవలె ఉపన్యాసములతోను, సంఘస్థాపనలతోను మాత్రమే కొనసాగునది గాదు. బాలభటులను సేవావ్రత దీక్షితులుగ తయారుజేయుటకై ప్రత్యేకముగ తరిబీతును పొందినట్టి బాలభటోపాధ్యాయుడు ప్రతిపట్టణమునందును, ప్రతి

పల్లెయందును ఉండుట అత్యంతావశ్యకమైయున్నది. అట్లు తరిబీతును పొందిన ఉపాధ్యాయుడైనను ముప్పది కంటె ఎక్కువమందిభటులను తీసికొని పనిజేయుటకు వీలులేదు, శిక్షణము సక్రమముగను ఫలవంతముగను ఉండవలెనన్నచో ఒకఉపాధ్యాయుడు అంతకంటె ఎక్కువమంది భటులను తయారుజేయ బూనుకొనగూడదు. ఇట్లు ఉపాధ్యాయులుగ పనిజేయువారికి తరిబీతు ఎట్లులభించును? అట్లు పనిజేయగోరువారందరిని ఒక గ్రామమందుగాని పట్టణమునందుగాని చేర్చి అక్కడ శిక్షాశిబిరము నేర్పరచి వారికి పదిదినముల కాలము శిక్షనొసంగవలయును. ఈ పదిదినముల కాలమును ప్రతిదినము ఉదయమున ౫ గంటలకు లేచి రాత్రి ౧౦ గంటల వరకును, భోజనసమయములందు తప్ప మిగిలిన కాలమునందెల్ల మిక్కిలి శ్రద్ధాభక్తులతోడను ఓపికతోను పట్టుదలతోను అభ్యసించిన గాని శిక్ష సక్రమముగ నలవడదు. అట్లు మిక్కిలి కష్టముతోను, ఆనందముతోను పదిదినముల కాలమును అభ్యసించిన విద్యను భటులుగా జేరదలచుకొన్నవారిని ఒకచోటకూర్చి బోధించినకొలది వన్నెదేరును. ఈ ప్రకారము ఉపాధ్యాయులుగా తరిబీతును పొందగోరునట్టివారు తగినంతమంది గలరాయని సందేహము కలుగవలసినది లేదు. ఎందుచేత యనగా, ఇదివరకే గ్రంథాలయముల మూలమున సేవావ్రతమును ఆచరణయందు పెట్టుచున్న దేశాభిమానులగు యువకులు అనేకులు సిద్ధముగ నున్నారు. వారికి తగిన తరిబీతు నిచ్చినచో, వారివలన ఎక్కువ ఫలప్రదమగుననుట కొంతమాత్రమును సందియము లేదు.

## శిక్షాశిబిరములు ఎట్లేర్పడును?

ఆంధ్రదేశమునందు ఈ యుద్యమమును వ్యాపింపజేయుటకై ప్రతిజిల్లాయందును అనేకమంది ఉత్సాహులై యున్నారు. అందుచేత ప్రతి తాలూకాయందును ప్రతి జిల్లాయందును శిక్షాశిబిరముల నేర్పరచి, ఆ చుట్టు ప్రక్కల నున్నవారి నందరిని అచటికి వచ్చునట్లుల జేసి, వారిని బాలభటోపాధ్యాయులుగ తరిబీతు చేయవలయును. అట్లేర్పరచు శిక్షణ శిబిరములయందు భోజన వసతులకగు వ్యయములను ఆయా గ్రామవాస్తవ్యులు భరించెదమని వాగ్దానములను జేసియున్నారు. ఇదివరకు గూడ అట్లే భరించియున్నారు. కాని శిక్షకువచ్చునట్టి ప్రతి ౬ గురికిని శిక్షనిచ్చుట కొకరుండవలయును. వీరందరిమీదను ప్రధానశిక్షకు డుండవలయును. శిక్షనిచ్చుటకు పోవువారికగు ప్రయాణ వ్యయములున్నవి. ఇదిగాక శిక్షనిచ్చుటకు కావలసిన సాధన సామగ్రికగు తగులుబాటులుగూడ కలవు. ఇంతవరకును శిక్షనిచ్చునట్టి పరోపకారులందరును ప్రయాణ వ్యయములను మాత్రము గైకొని, ఉచితముగ నేవచ్చి పనిజేయుచున్నారు. అట్టివారికి ప్రయాణ వ్యయములనైన నియ్యనిది వారు వచ్చుటెట్లు?

## ప్రకటన కార్యము.

ఈ యుద్యమప్రచారమునకై ఇదివరకు "బాలభటులమై యుండుటెందుకు" అను గ్రంథమును మొదటి ముద్రణము ౫౦౦ ప్రతులును, ద్వితీయ ముద్రణము ౨౦౦౦ ప్రతులును ప్రకటించితిమి. "బాలభట పటాలములను గూర్చుటెట్లు?" అను పొత్తమును మొదటి ముద్రణము ౨౫౦ ప్రతులును రెండవ ముద్రణము ౧౦౦౦ ప్రతులును ప్రకటించితిమి. "బాలభటుని తరిబీతు" అను పొత్తముయొక్క మొదటి ముద్రణము ౫౦౦ ప్రతులును అయిపోగా రెండవ ముద్రణమును తయారు జేయుచున్నాము. "జాతీయగీతములు" "బాలభటుని కవాతు-అక్షరావధానము" అను పొత్తములను కొన్ని కరపత్రములనుగూడ ప్రకటించియుంటిమి. ఇవిగాక శాఖాసంఘముల దరఖాస్తు ఫారములు, సైన్యముల దరఖాస్తు ఫారములు, బాలభటుని దరఖాస్తు ఫారములు—వీనినిగూడ ముద్రించితిమి. "గ్రంథాలయ సర్వస్వ"మందు ఈ యుద్యమమును గూర్చిన వ్యాసములు ప్రతి సంచికయందును విరివిగా ప్రకటించుచున్నారము. "బాలభటుని యాటలు" అను పొత్తమును సహాయసైన్యాధ్యక్షులగు శ్రీ కావలి శంకరరావుగారు వ్రాసినారు. కొంతవరకు గ్రంథాలయ సర్వస్వమునందు వానిని ప్రకటించినారము. కొలది దినములలోనే పుస్తకరూపమున వెలువడగలదు.

"ఆంధ్రపత్రి"కాధిపతులు మేము ప్రతి వారమును వ్రాయు వ్యాసములను ప్రకటించుచు ఉద్యమాభివృద్ధికై అమితసహాయమును జేయుచున్నారు. మరియును "కృష్ణా" "హితకారిణీ", "ఆంధ్రవాణి" "గోదావరీ పత్రిక" "బాలభారతి" "ఆంధ్ర ప్రకాశిక" పత్రికాధిపతులు గూడ మేము పంపువ్యాసములను ముద్రించుచు అమిత సహాయమును జేయుచున్నారు.

ఇదిగాక ఆంధ్రమునందు బాలభటోద్యమమును గూర్చిన సమగ్రమగు గ్రంథము నొకదానిని వెంటనే వ్రాయించుట, ఈయుద్యమాభివృద్ధికై అత్యంతావశ్యకమయియున్నది. మనదేశ సాంప్రదాయానుసారముగ ఈయుద్యమమును నడపుటకు ఇది అత్యంతావశ్యకము. బాలభటోపాధ్యాయులేమి, బాలభటులేమి నిత్యమును పని

జేయుట యందనేక సంశయములు తరుచుగా దోచుచుండును. అందుచే సంపూర్ణగ్రంథము నొకదానిని తయారుజేయుటకు గలయావశ్యకతను నేను వివరించి జెప్ప నక్కరలేదు.

## పసిభటుల తరిబీతు.

పెద్దలకును, పిన్నలకును, చదువుజెప్పు పద్ధతులు వేరువేరుగానుండును. ఎట్టికష్టమైన విషయములనైనను గ్రహించుటకు పెద్దవారు అలవాటు పడియుందురు. కానిపిల్లలు అటులగాదు. పెద్దలకంటె పిల్లలకు గ్రహణశక్తి విశేషముగ నేయుండును. వారికి బోధింపవలసిన రీతిని బోధించిననేగాని ఆగ్రహణశక్తి వినియోగింపదు. కావున బాలభటోద్యమమునందుగూడ పిల్లలకిచ్చు తరిబీతువేరు, పెద్దవారికిచ్చునదివేరు, దానికిని దీనికిని విశేషముగ తారతమ్యముగలదు. అందుచేత పిన్నభటుల తరిబీతు నిచ్చుటకై ప్రత్యేకశిక్షణము పొందుట అత్యంతావశ్యకమైయున్నది. ఇట్టి పిన్నభటోపాధ్యాయుల శిక్షణ స్థానమును గడచిన మార్చినెలయందు మద్రాసు నగరమునందేర్పరచిరి. శిక్షనిచ్చుటకై సింహళద్వీపమునుండి "విక్రమనాయకరు" గారు ప్రత్యేకముగ విచ్చేసిరి. ఈశిక్షను గైకొనుటకై ఆంధ్రదేశమునుండి బెజవాడ సంఘపక్షమున నేనును శ్రీకావలి శంకరరావు గారును, మొవ్వ నాగేశ్వరరావుగారును వెళ్ళి శిక్షను గైకొని వచ్చితిమి.

పిల్లలకిచ్చు శిక్షయందు ఆంగ్లేయదేశమునందలి శిక్షాక్రమము మనదేశమునకు బొత్తిగాపనికిరానేరదు. అందుచేత పిల్లలకిచ్చు శిక్షవిషయమునగూడ మనము ప్రత్యేకశ్రద్ధను వహించి, కార్యక్రమము నాలోచించుట అత్యంతావశ్యకము.

## ఇప్పుడున్న సైన్యములు.

ఇంతవరకును ఈక్రింది చోట్ల బాలభటసైన్యములు పనిజేయుచున్నవి:—(౧) మదనపల్లి (౨) మచిలీపట్నము (౩) వాయల్పాడు, (౪) బెజవాడ (౫) రాజమహేంద్రవరము (౬) రొయ్యూరు (కృష్ణా) (౭) వల్లూరుపాలెం (కృష్ణా) (౮) గోవాడ (గుంటూరు) (౯) కోడూరు (కడపజిల్లా) (౧౦) మోపర్రు (గుంటూరు) (౧౧) మేడూరు (కృష్ణా) (౧౨) మైసూరిపాలెం (కడపజిల్లా). (౧౩) నెల్లూరు.

ఇప్పుడున్న సంఘములు గుంటూరుజిల్లాకు మండలసంఘమేర్పడి ఇప్పుడేపనిని ప్రారంభించినది. విశాఖపట్నమునందుగూడ సంఘస్థాపనయైనది. ఇదిగాక ఈక్రింది స్థలములయందుగూడ శాఖాసంఘములేర్పడి పనిజేయుచున్నవి:— ౧ బందరు ౨ బెజవాడ ౩ రాజమహేంద్రవరము ౪ కాకినాడ ౫ వల్లూరుపాలెం (కృష్ణా) ౬ మైసూరివారిపాలెం (కడపజిల్లా) ౭ వాయల్పాడు (చిత్తూరుజిల్లా) ౮ కోడూరు (కడపజిల్లా).

## గోదావరీ పుష్కరము - చేయవలసిన పని.

రాబోవు రౌద్రి సంవత్సర అధికశ్రావణ శు ౧౦ ఆదివారమునాడు గోదావరీ మహానదీ పుష్కరప్రవేశము గలుగుచున్నది. భగవతి గోదావరి సప్తమహానగులలో వాసిగాంచినది. మన యాంధ్రదేశమునకు విలువలేని జీవాభరణమనంటిని. ప్రధానముగ ఆంధ్రమహాసభ్యత గౌతమీపరిసరము నవలంబనము చేసికొని ప్రోదియై పూర్ణవికాసమునంది రాణించినది. అఖండగోదావరీ స్నానమొనరించు నేయాంధ్రునకు పులకలెత్తవు! ఆంధ్రకవుల కవితాదుగ్ధమును ఆంధ్రయోధుల వీరరక్తమును నేటికిగూడ తల్లి గోదావరి అగాధ గర్భమునందు ప్రతిఫలించుచున్నవి. దేశాంతరులను "వృద్ధగంగ" యను ప్రమాణవచనమొక్కటే ఆకర్షించును. మన ఆంధ్రులనట్లుగాదు. మనభాష, మన నాగరికత, మనచరిత్ర, మనభాగ్యము—మున్నగుననేక జాతీయభావములు గోదావరీ ముఖసందర్శనమున నుప్పొంగును. విశాలమైన గౌతమీప్రవాహమును తిలకించి ఒకనాడు విశాలముగ ప్రవహించిన మన ఆంధ్రవైభవమును దలచుకొందుము. కావున గోదావరి పూజయనిన జాతీయపూజయే. గోదావరీ సేవయనిన జాతీయసేవయే. ఇట్టి మహోత్కృష్టకార్యమునకు పుష్కరమహోత్సవముహూర్తముకంటె ఉత్తమముహూర్తములేదు. ఈమహానదీ పుష్కరమునకు కనీసము కొన్నికోట్ల, జనమైనను వత్తురని వెనుకటి యనుభవము ననుసరించి మదింపువేయవచ్చును. ఈ మహాజనులందరికిని సదుపాయములు చేయుటయందు శ్రీ గవర్నమెంటువారు తగిన సాయముచేయుదురు. పురపాలకసంఘమువారు తమ విధాయకమును నిర్వహింతురు. కాని అంతటితో సరిపోదు. మనము చేయవలసిన కార్యముగూడ చాలగలదు.

౧౯౧౫ వ సంవత్సరమున గంగానదీ తీరమందున్న హరిద్వారమందు జరిగిన కుంభమేళా మహోత్సవమునకు వచ్చిన జనమునకు పరిమితిలేదు. అంత జనసమూహము మరియొకచోట సమావేశమగుట అసంభవమని తోపకపోదు. హరిద్వారమందు ఆ యాత్రాప్రపంచమును సురక్షితముగ నావల బంపినేయుట కెంత వ్యయప్రయాసలనివార్యములయ్యెనో దురూహ్యము. ప్రభుత్వమువారు పోలీసు సిబ్బందితో యా జనరక్షణమునకు వచ్చిరి.

బొంబాయి సేవాసదనమువారు వచ్చి సాయపడిరి. ప్రయాగ సేవక సమితి సంపూర్ణ జనసత్వములతో బాసటయై నిలచెను. అప్పుడా యాత్రికుల సహాయ్యమునకు కృషిచేసిన పదుమవాండ్రు అనేకవేలమంది యుండిరి. వీరందరును సుశిక్షితులు. ఆకస్మికములగు ప్రవాసకష్టములను జక్కగ నెరింగినవారు. తన్నివారణోపాయముల యందు మంచి తరిబీతును బొందినవారు. అపాయములకు జంకని సాహసము, దేహశ్రమకు వెరుదీయని ఉత్సాహము, నాయకుల యాజ్ఞలను నిరుత్తరముగా నిర్వహించు విధేయత-యున్నగు సేవకలక్షణము లభిమానముతో నార్జించినవారు ఈపటాలమునకు మహామహులు చమూపతులై పాలించిరి కావలసిన వేలకొలది ధనమును కలకత్తా మార్వారి సంఘమువారు పూర్ణవ్యయ స్వాతంత్ర్యముతో నిచ్చివేసిరి. ఇందఱు మహామహులు, ఇంత ధనసహాయముతో అహోరాత్రులు, అకలంకమును అస్ఖలితమును అగు నిష్కామ దీక్షతో పాటుపడినను ప్రభుత్వమువారొక ప్రక్క ప్రబలసన్నాహముతో తోడ్పడినను కుంభమేళాయాత్రికుల కష్టములు సంపూర్ణముగ దప్పినవిగావు; సేవకులు కొలది సంఖ్యాకులగుటయే దీనికి కారణము. కావున యాత్రాజనుల సౌకర్యమన్న మాటలతో నగునదికాదు.

గోదావరీ పుష్కరములోగూడ కోట్లకొలది యాత్రికులు రాజమహేంద్రవరము కొవ్వూరులలో దిగుదురు. ఇంతమంది యాత్రికులకు తగినట్లు చేవోడు వాదోడు సాయమిచ్చుట సులభమైన కార్యము గాదు. యాత్రికులు భిన్నదేశస్థులు భాషాంతరులు. వీరినందఱను అన్నివిధముల నాదరింపవలెను. గోదావరీ పుష్కరమునకు బోయి కష్టముల ననుభవింపకుండ వచ్చితిమని అనుకొనునటుల చేయవలెను. ఉపచార లోపములు కాననీయరాదు. ఆంధ్రులలో అతిథిసత్కారము మెండను కీర్తి రావలెను. ఈయుపచారసేవ సలుపు ఉత్సాహము నూతనముగ వెలువడిన బాలభటోద్యమమునందు మూర్తీభవించియున్నది. ఈ దీక్షను నిర్వహించుటకు తగిన అవకాశములు కల్పింపవలెను. ఆభారము ధర్మపరాయణులగు మహాజనులపైనున్నది. ఎట్లందురా? ముందు యాత్రికులకు దెలియుటకై ఆయా పుణ్యక్షేత్రములను గూర్చి కరపత్రములు వ్రాసి ప్రచురింపవలెను. స్థలాంతరములనుండి లేఖలు వ్రాయు యాత్రికులకు అడిగిన సమాచారములను తత్క్షణము తెలుపు లేఖకులను నిరూపింపవలయును. యాత్రికులకు వసతులు సాధ్యమైనంతవరకు యాత్రికుల భాషాసంబంధమునుబట్టి విడిదివాడలు నిర్మింపవలెను. ఉదాహరణము, మహారాష్ట్రివాడ; బెంగాలీవాడ మున్నగునవి. రైలుస్టేషనుకు సమీపమందు ప్రజలు నిలుచు పాకలు వేయించి వారి వారి నియామకవాటికలకు జేర్పవలెను. యాత్రికుల ఆధిక్యమును బట్టి తినుబండారములును, తీర్థవస్తువులును మితిమీరిన ధరలకమ్మబడును. అందుకొరకు పరపతి భాండారమును స్థాపించి వస్తువులు సప్లయిలకు తగిన యేర్పాట్లు చేయవలెను. ఉత్తరాలు మనియార్డర్లు మున్నగు విషయములలో సాయముచేయవలయును. ఉత్తరములు వ్రాసికొనలేనివారికి వ్రాసిపెట్టుటకు తగినవసతులు చేయవలెను. కలరా జ్వరము మున్నగు తరుణవ్యాధులకు మంచిమందులను సంపాదించి సహాయము చేయవలెను.

స్నానఘట్టములయందు అలలలుగట్టి ఈతసాధనములతో అపాయరక్షకుల నేర్పరుపవలెను. యాత్రికులు స్నానమునకును, తీర్థము చూచుటకును పోయినప్పుడు ఆయావాడలను చోరబాధలేకుండ కాపాడుటకు కొందరిని నిలుపవలెను గాయములు తగిలినవారికి తగిన సహాయము వెంటనే యొసంగుట అత్యంతావశ్యకము. రైళ్లరాకపోకలు, టిక్కెట్లచార్జీలు, అయాభాషలలో దెలుపగల ఉపచారకుల నందందు నిలుపవలెను. వంటచెరకు సేకరించి సరియైన ధరలకివ్వవలెను. శిశువులకు పాలు సమకూర్పవలెను. అన్నాతురులకు ఆహారమియ్యవలెను. దారితప్పినవారిని వారి ఆప్తులకు జేర్పవలెను.

యాత్రికులకు అత్యంతావశ్యకములగు కొన్ని ఉపచారములను మాత్రమియిచ్చట సూచించితిని. అవసరమునుబట్టి ఇంక నెన్నియో కార్యములనివార్యములగును. ఇన్ని పనులను యేలోపములేకుండ సమర్థించుట సామాన్యము కాదు. ఎందరో బాలభటులు కావలెను; ఎంతో ధనము కావలెను. ఎన్నియో పరికరములు కావలెను; పనిచేయు భారమునాది. పనిముట్లు సమకూర్చి యిచ్చుబాధ్యత మీది.

మహాజనులారా! పైనజెప్పిన కార్యములన్నియు యాత్రికులకు సంబంధించినవియే. ఇక యాత్రికుల కుపచారముచేయు సేవకుల ఆవశ్యకములనుగూర్చి యాలోచింపవలసియున్నది. బాలభటులును, సేవాకుమారులును ఉండుటకు విడుదులు కావలెను. పుష్టికరమును ఆరోగ్యకరమును నగు ఆహారము కావలెను; వీరొకరినొకరు గుర్తించుటకై విలక్షణమును కార్యయోగ్యమునునగు దుస్తులు కావలయును. వంటపాత్రలు తప్పనిసరి. భిన్నప్రాంతములనుండి వచ్చు సేవకులకు రైలుఖర్చులీయవలెను. వర్షపాతమునుండి సురక్షితులగుటకు తగినదుస్తులు, అవ

సరము. రాత్రులు కావలిగాయుటకు చేలాంతరులీయవలెను. దూరకార్యనిర్వాహకమునకు త్రొక్కుడు బండ్లు కావలెను. ఒకస్థలమునుండి మరియొక స్థలమునకు వార్తలను నిర్వహించుటకు జెండాలు, ఈలలు కావలెను. చెప్పులు, గొడుగులు, ఈతకు సాధనములు, గోనెసంచులు, త్రాళ్ళు, దబ్బనములు, నడుముపట్టాలు- గొంగళ్ళు, మున్నగు ననేక పరికరములు యాత్రకోపచారకులు తమ విధాయక కృత్యము నెరవేర్చుటకవసరము.

### చేయవలసిన పని.

బాలభటోద్యమ వ్యాపకమునకు ఇంతవరకును ఆంధ్రదేశమునందు జరిగిన పనినిగూర్చియు, జరుగవలసిన పనినిగూర్చియు మీకు నివేదించితిని మామూలుగా జరుగవలసిన పనిగాక, గోదావరి పుష్కరములుగూడ వచ్చుచున్నవిగదా; మనకున్న వ్యవధి స్వల్పము. అందుచేత విశేషముగా శ్రమపడి పనిచేసినగాని, పుష్కర సమయమున సంతృప్తికరముగు పనిని చేసి చూపజాలము. ఆసమయమునందు పనిజేయుటకై అధమపక్షము ౨,౦౦౦ మంది భటులైన తయారగుట అత్యంతావశ్యకము.

### ఎంతసొమ్ము గావలయును?

ఈ యుద్యమాభివృద్ధికై చేయవలసిన పనులన్నింటికిని, గోదావరి పుష్కరములు వచ్చులోపున అధమము రు ౨,౦౦౦ లైన ముఖ్యముగ గావలసియున్నవి. ఎంతో మెలకువగలిగి మితవ్యయము చేసినగాని ఈసొమ్ము నసరిపోదు. సేవావ్రత దీక్షవైకొని, ఆంధ్రదేశాభ్యున్నతికై పాటుపడదలచిన యువకులనేకులున్నారు. అట్టివారికి అవకాశములను కల్పించి, దేశోన్నతికై సహాయపడుట పెద్దలకును నాయకులకును విధియైయున్నది.

### సొమ్ము ఈయదగిన పద్ధతులు.

ఎవరికిదోచిన మొత్తమును వారీయవచ్చును. నూరురూపాయిలనొక్కసారిగా నిచ్చువారు భారత బాలభట సంఘముయొక్క ఆంధ్రదేశ శాఖయందు శాశ్వత సభ్యులగుదురు. సంవత్సరమునకు ౫ రూ॥ల విరాళమిచ్చువారు సభ్యులు. కావున ఆంధ్రులందరును తమకుతోచిన విధమున తోడ్పడి, దేశసేవజేయుటకు తగిన యవకాశములను మాకు గల్పించెదరని ప్రార్థించుచున్నాడను.

ఇట్లు విన్నవించు విధేయుడు,
అయ్యంకి వేంకటరమణయ్య,
ఆంధ్రరాష్ట్రీయ ప్రధానసైన్యాధ్యక్షుడు.
౧౦-౧౦-౧౯౧౯

# అనుబంధము.

### ఆంధ్రరాష్ట్రీయ సంఘము.

వల్లూరుపాలెమునందు జరిగిన బాలభటోపాధ్యాయుల శిక్షాస్థానముతో ఆంధ్రదేశమునందు ఈ యుద్యమ వ్యాపనార్థమై ప్రత్యేక రాష్ట్రీయ సంఘముయొక్క నిర్మాణమావశ్యకమైనది. ఈయుద్యమమును వ్యాపకముచేయుటకై భారతబాలభట సంఘమునకు ఆంధ్రరాష్ట్రీయశాఖ మేర్పాటుగావింపబడినది. ఆంధ్రరాష్ట్రమునకు ప్రధానసైన్యాధిపతిని, సహాయసైన్యాధిపతులను ఏర్పాటుగావించిరి; ఆసంఘముయొక్క ప్రధానకార్యాలయము "బెజవాడ" యందున్నది.

### అఖిలభారత బాలభటోపాధ్యాల సభ.

బొంబాయి రాజధానియందు "వెస్టరన్ ఘాట్సు" అను గొప్ప పర్వతములున్నవి. ఆ పర్వతములగుండ ముప్పదిగుహాలను తొలిచి, రైలుబండిని నడుపుచున్నారు. అట్టి పర్వతములందు మిక్కిలి ఎత్తయిన ప్రదేశమునందు "లోనవులా" అను చిన్నపట్టణమొకటి గలదు; ౧౯౧౯ సం॥ మే నెల ౬-వ తేదీనుండి ౧౬-వ తేదీవరకు అక్కడ అఖిలభారత బాలభటోద్యోగుల సభ జరిగినది. ఆసభకు మలబారునుండియు అరవదేశము నుండియు బంగాళము మహారాష్ట్రము గుజరాతుసింధు మధ్యపరగణాలు మున్నగు రాష్ట్రములనుండియు- ఇందోరు మున్నగు స్వదేశ సంస్థానములనుండియు ఎనుబదిమంది ప్రతినిధులు విచ్చేసిరి. అందు ఆంధ్రదేశమునుండి ఏడుగురు ప్రతినిధులు విచ్చేసిరి.

ఈ సభవలన అనేకలాభములు సమకూరినవి. దేశమునందు వివిధ శీతోష్ణస్థితులచేత, వివిధవేష భాషలచేత వివిధ సాంప్రదాయములచేత వివిధ ఆచారవ్యవహారములచేత వివిధ నాగరికతలచేత భిన్నులయి యుండిన జనులందరును అచటచేరిరి. ఇన్నివిధములచేత వారు భిన్నులయి యున్నను, అక్కడకు వచ్చినవారందరును సేవావ్రత మహాదీక్షను గైకొన్నవారే. అందఱి ముఖకమలములయందును నిత్యానందము - నిత్యసిద్ధత - నిత్య

విత్రత - ప్రస్ఫుటించుచుండెను. ఒకరికొకరు నూతన పరిచితులుగ ఎవ్వరికిని దోపలేదు. అందరును యిదివరకెప్పుడో పరస్పరము పరిచయముగలిగి యున్నవారుగనే దోచుచుండిరి. ఒక గుజరాతుదేశస్థుడువచ్చి నన్ను తనదేశస్థునిగభావించి, నాదగ్గరకు జేరి, తన మాతృభాషలో నన్నేమో ప్రశ్నింప; నేను తెల్లబోయి చూచితిని) అంతట ఆతడును తెల్లబోయి చూడసాగెను. ఇంకొక మహారాష్ట్రునిచూచి, ఆంధ్రుడనుకొని మాటలాడ కుతూహలుడనై దగ్గరకుబోతినికాని మాట్లాడలేదు.

ప్రతిదినమును ఆదినమున జరుగవలసిన కార్యములను సక్రమముగా జరుగునటుల జూచుటకొక ఉద్యోగి నియమింపబడెను. వంటజేయుటకు, వడ్డనజేయుటకు పరిశుభ్రముచేయుటకు కొందరు పూనుకొనెదరు. ప్రతిదినమును తెల్లవారగనే అందరునులేచుటకొక ఈల వేయబడును. అంతట అందరునులేచి తమ కాలకృత్యములను దీర్చుకొనునంతలో రెండవ ఈల వేయబడును. అప్పుడు అందరును జెండాచుట్టునుచేరి, జాతీయకీర్తనలనుపాడి శరీరవ్యాయామమునకు బోయెదరు. శరీరవ్యాయామమైన పిమ్మట ఫలహారముజరుగును. పిమ్మట కొండ ప్రదేశములందు వివిధములగు ఆటలాడుటకు పోవుట - అటుపిమ్మట మధ్యాహ్నభోజనము. భోజనమైన పిమ్మట కొంతసేపుసభ. సభకు పిమ్మట తిరిగి ఆటలు. ఒక్కొక్కప్పుడు రాత్రులయందుగూడ ఆటలేర్పరుపబడుచుండును. ఈ మధ్యనేమైన కొంచెము తీరికగలిగిన, ఒక ఆంధ్రుడు మహారాష్ట్రునితోగలసి తన దేశస్థితిగతులు తన దేశమందలి ఉద్యమములు అతనితో జెప్పి, అతని దేశస్థితులను తాను దెలిసికొనుచుండును. వేరొక సింధీయుడు మహారాష్ట్రునితోగలసి ఇటులనే మాట్లాడుచుండును.

మేము ఈపట్టణమందు గడపిన దినములు మిక్కిలి మండు వేసవికాలమే యైయున్నను, ఇక్కడ మిక్కిలి చల్లగానుండి, రాత్రులయందు శాలువలు గప్పుకొనవలసియుండెను. అందుచేత యెన్నియాటలాడినను అలయిక యనుమాట లేకుండెను. అనేకగుహలను, అనేక కొండలోయలను, అనేక సెలయేరులనుజూచి నేత్రపర్వమొనర్చికొంటిమి. మేమొకనాడు "కార్లీ"అను గొప్ప కొండగుహలను జూచుటకుబోతిమి. ఆకొండ గుహల కావల "ఆంధ్రలోయ" గలదు. ఆలోయయందు నీటినిజేర్చి విద్యుచ్ఛక్తిని గలిగించి బొంబాయి పట్నమునకు బంపుచున్నారు.

సభలయందు చర్చించిన విషయములలో భటులు ధరింపవలసిన దుస్తుల విషయమై జరిగినచర్చ మిక్కిలి ముఖ్యమైనది. కొందరు ఇప్పుడున్నరీతినే దుస్తులుండవలెననిరి, అనగా మిలిటరీవర్దు, మట్టలాగు, ఆకుపచ్చని తలగుడ్డ యుండవలెననిరి. మరికొందరు మిలిటరీవర్దునకు బదులుగా "జుబ్బా" ఉండవలెననిరి. వేరొకరు ఒక్క రంగు తలగుడ్డకు బదులుగా సగమొక రంగును, మిగిలిన సగమును వేరొక రంగునుగలిగిన తలగుడ్డ ఉండినబాగనిరి. కొందరు తలపాగాలకు బదులుగా దొరలుపెట్టుకొను "హ్యాట్టులను" ఉపయోగింపవలెననిరి. ఇట్లు పలువురు తమ తమ యభిప్రాయములను ప్రకటించిరి. కాని ఒక్కరును మట్టలాగును మార్పవలెననువారు లేరైరి. అప్పుడు నేనులేచి పట్నములందలి భటులకు ఇప్పుడున్నటులనే దుస్తులనుంచవచ్చును గాని ఆదుస్తులు పల్లెలవారికెంతమాత్రము ఆకర్షకములు గావనియు వారు తమ కట్టుపంచెయొక్క కుచ్చెళ్ళను వెనుకకు విరచిగట్టి జుబ్బానుతొడిగి ఆకుపచ్చ తలగుడ్డను బెట్టుకొనినయెడల దేశీయముగను ఆకర్షకముగను ఉపయోగముగను ఉండుననియు జెప్పితిని. అంతట సభ్యులయందొకవిధమైన కలవర ముదయించెను. నేను జెప్పినమాటలు విస్మయ జనకములయ్యెను. మట్టలాగు (నిక్కరు) లేనియెడ చులకనగా పరుగెత్తుటకే వీలులేదనియు అన్నివిధములను ఒప్పియున్నదానిని ఇప్పుడు పల్లెటూరివార్లకై భయపడి విడుచుట యుక్తముగాదనియు, పల్లెలవారు క్రమముగా దీనియొక్క ఉపయోగమును తెలిసికొని ధరించుట కలవాటు పడుదురనియు అందుచేత మనము త్వరపడి దీనిని మార్చగూడదనియు వారియొక్క యభిప్రాయముగ జెప్పిరి. అంతట నేనిట్లంటిని, "ఇతర భాగములనుగూర్చి నాకనుభవము లేదుగాని మాయాంధ్రదేశమునందు మాత్రము పల్లెలవారు మిక్కిలి వివేకవంతులు; మట్టలాగు దేశీయముగాదని వారు దానిని ప్రేమింపరేగాని, దానియొక్క ఉపయోగములనుగూర్చి తెలిసికొనలేకగాదు; మట్టలాగుయొక్క ఉపయోగములన్నియు ధోవతిని వెనుకవైపుకు విరిచికట్టిన లభింపగలవని వారు గ్రహించిరి. ఇంతేగాక, మావైపులనున్న క్షత్రియులు నేటికిని అట్లు వెనుకకు విరిచిగట్టియే ధోవతులను ధరింతురు. గొప్పరాజ్యముల నేలి యుద్ధములందు తమ అద్వితీయ శౌర్య ధైర్య పరాక్రమములను ప్రదర్శించినవారి సంతతివారే ఈ క్షత్రియులు. వీరేగాక రాజపుత్రులుగూడ ఎప్పుడును మట్టలాగులను దొడుగుకొనినటుల వినలేదు. అయినప్పటికిని వారికి ధోవతి

ఆటంకముగ నిలిచినటులను గానము." ఈ యభిప్రాయముతో ఆంధ్రులుతప్ప మరెవ్వరును ఏకీభవింపలేదు. కాని ప్రధాన కమీషనరుగారు ఒక్క సంగతిని జెప్పిరి. ఏరాష్ట్రమందైన ప్రస్తుతము బాలభటుల కేర్పరచిన దుస్తులు అంగీకారము కానియెడల, వారికి అనువగు పద్ధతులను గురించి తమకు వ్రాసినయెడల అట్టి దుస్తులనే ధరించుటకు ఉత్తరువు నిచ్చెదమని చెప్పిరి.

దుస్తులకు సంబంధించిన విషయమునకు పిమ్మట మనకు సంబంధించిన ముఖ్యవిషయము ఉద్యమవ్యాప్తి నిగురించి. ఈ యుద్యమమును ఆంధ్రదేశమునందు వ్యాప్తముజేయుటకు ఆంధ్రదేశమును మూడు భాగములుగ విభజించిన ఉద్యమవ్యాపన సులభమగునని కొందరనిరి. కాని దానికి మేమంగీకరింపక, ఆంధ్రదేశమంతయు ఒక్క నిర్మాణముగనే ఉండవలయునని ఘంటాపథముగ జెప్పితిమి. ఇదివరకీ యుద్యమము ఆంగ్లేయ భాషయందే ముఖ్యముగ నడుపబడుచున్నది. పల్లెలయందిది వ్యాప్తము గావలెనన్న దీనిని సంపూర్ణముగా ఆంధ్రమునందే నడుపుట కర్తవ్యము; అట్లు ఈ యుద్యమమును ఆంధ్రమునందు నడుపుదమన్న ఆంధ్రదేశమును ఒక్క సంస్థగనే ఏర్పరచుట అత్యంతావశ్యకమని జెప్పితిమి. దానికి ప్రధాన కమీషనరుగా రంగీకరించిరి. ఇందువలన మనమీద ఎక్కువ బాధ్యత ఏర్పడినది. ఆ బాధ్యతకు తగినటుల దేశసేవకులందరును నడుములుగట్టి పనిచేయుట అత్యంతావశ్యకమై యున్నది.

ఇటులే అనేక విషయములను గూర్చిన చర్చలు జరగినవి. మనకు సంబంధించిన ముఖ్యవిషయములను మాత్రము ఇట వివరించితిని. బొంబాయినుండి యీసంఘమునకు జెందని కొందరు బాలభటులువచ్చి మేము విడిసిన పట్టణమునకు ఐదుమైళ్ళ దూరమునందున్న వేరొక పట్టణమున మకాముచేసిరి. ఒకదినమున వారిని మాకతిథులుగ నాహ్వానించి, ఆదినమంతయు వారితో ఆటలతోడను పాటలతోడను గడపితిమి. మరుసటిదినము ఉదయమున తిరిగి వారుమాకు ఆతిథ్యమొసగిరి ఈప్రకారము యీ దినములు మిక్కిలి యానందముతోను అనుభవములతోను గడచినవి.

## ముందుసభ మనదేశమందే.

రాబోవు సంవత్సరమునందు అఖిలభారత బాలభటోద్యోగుల మహాసభను ఆంధ్రదేశమున కాహ్వానించితిమి. ఆంధ్రదేశమునకీ సభను ఆహ్వానించిన మాత్రమున సంతసింపవలసినది లేదు. ముందు సంవత్సరమందీ సభ కూడునప్పటకి ఆంధ్రదేశమందీ యుద్యమము చక్కగా నాటుకొనునటుల జేయవలయును; అట్లుచేసినగాని మన మీసభను పిలిచినందువలని ప్రయోజనము గలుగదు.

## ముఖ్యములగు తీర్మానములు.

ఆంధ్రరాష్ట్రీయ సంఘముయొక్క సామాన్యసభ ౧౯౧౯ సం. ఆగస్టు నెల ౧౦ వ తేదీ ఉదయమున బెజవాడ పట్టణమున శ్రీ రామమోహన ధర్మపుస్తకభాండాగార భవనమున జరగినది. వివిధశాఖా సంఘములనుండి ప్రతినిధులేతెంచిరి. అప్పుడీతీర్మానములు చేయబడినవి:—

౧ ఈ సంఘముయొక్క సభలకు ముగ్గురు సభ్యులు "కోరం"గా ఉండవలెనని తీర్మానించడమైనది.

౨ ఈక్రింది సంఘములను ఈసంఘమునకు శాఖలుగ చేర్చుకోవడమైనది:—౧ బందరు ౨ బెజవాడ 3 రాజమహేంద్రవరము ౪ కాకినాడ ౫ వల్లూరుపాలెం ౬ గుంటూరు.

3 ఆంధ్రరాష్ట్రమునకు సంచార కార్యదర్శిగా వె.ఱుతురిమిల్లి శ్రీ రామారావుగారిని ఏర్పరచడమైనది.

౪ భారతబాలభట సంఘముయొక్క "సెంట్రలు కవున్సిలు"నకు ఈసంఘపక్షమున ౧ కావలి శంకరరావుగారిని ౨ వాగ్నాసి సుబ్బారావు గారిని సభ్యులుగ ఎన్నుకొనడమైనది.

౫ బెజవాడ తాలూకాకు బండి బుచ్చయ్యచౌదరీగారిని ప్రధాన బాలభటోపాధ్యాయునిగ ఏర్పరచడమైనది.

౬ ఆంధ్రరాష్ట్రమునందు ఏ పటాలమువారైన బాలభటులకు నియమితమైన దుస్తులుగాక, కట్టుకొనుటకు పంచెను తొడుగుకొనుటకు జుబ్బాను వేసుకొనునెడల, ఆప్రకారము అంగీకరించుటకు తీర్మానించడమైనది. అయితే అట్టి పటాలమువారందరును ఒకేరీతి దుస్తులను ధరింపవలసియుందురు. వారు ధరించుదుస్తులును జుబ్బాయును రంగువై యుండవలెను. తలపాగాలు మాత్రము ఆకుపచ్చరంగువై యుండవలెను.

౭ ఈ సంఘమునందు సభ్యులుగానుండు వారందరును సంవత్సరమునకు (శాఖా సంఘములనుండి వచ్చు ప్రతినిధులుకూడ)రు ౫ లకు తక్కువకాని చందానియ్యవలయునని తీర్మానించుచున్నారు.

అంతటితో ఉదయము సభముగింపబడి తిరిగిమధ్యాహ్నముగూడినది. అప్పుడీతీర్మానములు జేయబడినవి:—

౮ బాలభటోపాధ్యాయుల తరిబీతునిమిత్తమై ఈక్రిందిశిక్షాస్థానముల నేర్పాటుజేయుటకు తీర్మానించడమయినది:—

కోడూరు ౧౯౧౯ సం॥ ఆగష్టు ౨౭ తేది
తిరుత్తని „ సెప్టెంబరు ౨౨ „
గుంటూరు „ సెప్టెంబరు ౨౭ „

ఈ శిక్షాస్థానములకుబోవు శిక్షకులకు రైలుఖర్చుల నొసంగుటకై అంగీకరించడమయినది.

౯ గోదావరి పుష్కరములకు సంబంధించినపనులన్నిటిని నిర్వహించుటకు సహాయకమీషనరుగారగు శ్రీవారణాసి వేంకటసుబ్బారావుపంతులుగారిని కోరడమైనది.

౧౦ సేవావ్రతదీక్షనుతీసికొని, గోదావరిపుష్కర సమయములందు సేవావ్రతమును ఆచరణయందుబెట్టుటకు బూనుకొని, పుష్కరసమయములకు తగినంతమంది భటులను తయారుచేయుచున్న ఈసంఘమునకు- వెనుక కృష్ణావరదల సందర్భమున వసూలుజేసి ఖర్చుచేయగా మిగిలిన ద్రవ్యము నంతను ఇవ్వవలసినదని మద్రాసునందేర్పడిన వరదల సంఘమునకు, కార్యదర్శిగారగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారిని ప్రార్థించడమయినది.

౧౧ ఆంధ్రరాష్ట్రమునందు భటోద్యమవ్యాపకమునకు ఆంధ్రభాషయును ఆంధ్రులయొక్క సాంప్రదాయములును చక్కగాగుర్తెరింగి యుండుట అత్యంతావసరమైయున్నది; కావున ఈసంఘమునకు సహాయకమీషనరులలో నొకరుగ శ్రీఆర్యరత్నాగారి నేర్పరచుట మిక్కిలి అనుచితమని ఈసభవారభిప్రాయపడుచు, వారిని అఖిల భారత వర్షముసకు "అగ్గనైజింగు కమీషనరు"లలో నొకరుగ నియమింప వలసినదని కోరుచున్నారు.

౧౨ "బాలభటులమై యుండుటెందుకు?" అను పుస్తకమును తిరిగి ముద్రించుటకు తీర్మానించడమైనది.

౧౩ పతకములయందు అక్షరములు సంస్కృతమునందుండవలెననియు, అది సింహళదేశముతోగూడిన భారతవర్ష పటముయొక్క ఆకారమున ఉండవలెననియు ఈ సంఘమువారు సెంట్రలు కవున్సిలువారికి నివేదించుచున్నారు.

౧౪ రాష్ట్రములయొక్క పరిపాలన యంతయు దేశభాషలయందే యుండును గనుక, ఉద్యోగస్థులయొక్క "యోగ్యతాపత్రము"లన్నియు రాష్ట్రీయ కమీషనరుయొక్క సంతకముతోడనే పంపుట అత్యంతావశ్యకమైయున్నదని ఈ సంఘమువారు "సెంట్రలు కవున్సిలు" వారికి నివేదించుచున్నారు.

౧౫ ఆంధ్రరాష్ట్రమునందు ఉపాధ్యాయుల తరిబీతు అంతయు ఆంధ్రభాషయందు జరుపవలెననియు, కవాతు, హిందీయందుండవలెననియు ఈ సంఘమువారు తీర్మానించుచున్నారు.

౧౬ (క) ఈ సంఘమువారు కడచిన మార్చినెలనుండియు అమలులోపెట్టిన "హిందీ" కవాతు పదములనుదేశభాషా తంతిగుర్తులను భారతవర్ష బాలభటుల ఉపయోగార్థమై, "యిండియన్ స్కవుట్" అను పత్రికయందు అచ్చు వేయించుదురని, ఆ పత్రికాధిపతిగారిని ఈ సభవారు కోరుచున్నారు.

(చ) పదరు "కవాతు" పదములను భారతవర్షము నందంతటను భటులు ఉపయోగించుట అత్యంతావశ్యకమని ఈ సభవారు "సెంట్రలు కవున్సిలు" వారికి నివేదించుచున్నారు.

౧౭ ఈ సంఘపతాకము మధ్యను భారతవర్ష పటముగూడ వేయుటను తీర్మానించెదరని సెంట్రలు కవున్సిలువారి నీసభవారు కోరుచున్నారు.

## ప్రధాన సైన్యాధికారి జవాబు.

ఈ తీర్మానములనుజూచి భారతవర్షమునంతటను ప్రధాన సైన్యాధిపతులగు శ్రీ యఫ్. జి. పియర్సుగారిటుల వ్రాసియున్నారు:—

"మీరుపంపిన తీర్మానములందినవి. అన్నింటిని అందు ముఖ్యముగా "సెంట్రలు కవున్సిలు" నకు సంబంధించిన వానిని గుర్తించితిని. "సెంట్రలు కవున్సిలు" ఇంతవర కేర్పడియుండక పోవుటవలనను, మీరు ఏర్పరచినట్లుగా మరికొందరు ఇతర రాష్ట్రముల వారుగూడ తమ ప్రతినిధుల నేర్పరచినగాని ఏర్పడుటకు వీలులేకుండుటచేతను, నాజవాబు ఆ సంఘపక్షమున ఇచ్చినట్లుగ భావింపజనదు; రాబోవు భటోత్సవము ఈ సంఘముయొక్క ఏర్పాటును గలుగజేయగలదనియు, ఈసంవత్సరాంతమునకు ఈ సంఘము క్రమప్రకారము నిర్మాణము కాగలదనియు నాకు గట్టినమ్మకము గలదు.

అయినప్పటికిని, ఈలోగా తాత్కాలికమైన జవాబును మీరు వాంఛించెదరని నే తలంతును. కాని అవి నాస్వంత అభిప్రాయములని మాత్రము జ్ఞప్తియందుంచుకొనుడు. సరిగ ఆసంఘమేర్పడు వరకును నాయందు

మీరు నమ్మకముంచి నిర్వహించుటకు అంగీకరించినంత వరకు మాత్రమే వానిని అనుసరింప వలసియుండును.

ఆంధ్రరాష్ట్ర సంఘమువారును తదితర రాష్ట్రసంఘములును చేయునట్టి సూచనల కన్నింటికిని నేను స్వకీయముగ అంగీకరింపకపోయినను, మీమీ రాష్ట్రములకు సంబంధించిన ఆవశ్యకములనుగూర్చి మీలోమీరు అంగీకరించినయెడల, అట్టివిషయములను సంపూర్ణముగ మీకేవదలివేయుటయందే నాకభిలాష గలదను సంగతిని విస్పష్టము గావింపదలచితిని. ఈసంగతిని "లోనవ్ లా"యందుగూడ జెప్పితిని సంపూర్ణరాష్ట్రస్వాతంత్ర్యము నొసంగుటకే "లోనవ్ లా"యందు మనము నిశ్చయించితిమి. రాష్ట్రములు వారివారిమార్గముల ననుసరించి బాలభటోద్యమమును వ్యాప్తము గావించుటకు సంపూర్ణావకాశములనిచ్చుటయందే నాకిష్టముగలదు. భారతవర్షమునకు యుక్తమయిన దానినిగ యీయుద్యమమును యేర్పరుచుటయందు ప్రతిరాష్ట్రమువారును చేయగలిగినదేదియో ఇతరులకు జూపనిమ్ము. అందరునుగలిసి భారత బాలభటసంఘముగ నేర్పడి పనిజేయుటయొక్క యావశ్యకతను గుర్తెరుంగునంత దూరదృష్టి మనభటోద్యోగుల కందరకును కలదని నాకు సంపూర్ణవిశ్వాసముకలదు; అందుచేత యేరాష్ట్రములైన స్వతంత్రసంఘముల నేర్పరచెదరను భయము నాకెంతమాత్రము లేదు. వారివారి మార్గముల ననుసరించి విస్తరించుటకై ఆయా రాష్ట్రములకు సంపూర్ణస్వాతంత్ర్యముండవలెనని బలపరుచుచున్నాను అయినప్పటికిని ఇతరులకు బంధనముగనుండునటులగాని, మొత్తము ఉద్యమము నంతటియొక్క ఐక్యమును చెదరగొట్టుటకుగాని ఈ స్వాతంత్ర్యమును ఆయారాష్ట్రములవారు వినియోగింపరని నాకు నమ్మకముగలదు.

మాతృభాషయందు భటశిక్షణము నొసంగుటయందును, ఆశిక్షణమును పల్లెటూళ్లవారి ప్రత్యేకావసరములకు దగినట్లుగా అవలంబించుటయందును, ఈయుద్యమమునకు గ్రంథాలయోద్యమముతో సహచర్యమును గలుగజేయుటయందును, దుస్తులను మీస్థితిగతులకు అనుకూలమగునటుల మార్చుటయందును, మీరుమిక్కిలి జయప్రదముగా ప్రారంభించిన వికాసమును- పైనవివరించిన ఆదర్శములను మనస్సునందుంచుకొని మిక్కిలి అభిలాషతోడను ఆనందముతోడను జూచుచున్నాడను.-ఆంధ్రదేశ అవసరములకును ఆదర్శములకును పరిపూర్ణముగ సరిపడునట్టి ప్రణాళికను వికసింపజేయుటయందు మీరు తుదకు జయప్రదులగుదురని నేనుకోరుచున్నాను. మీరు పనిచేయుచున్న మార్పులనుగూర్చి ఇతరరాష్ట్రములవారు గూడ తెలిసికొనుట చాలామంచిది; అందుచేత హిందీ కవాతు పదములను శెప్టెంబరుమాసము సంచికయందు ప్రకటించు చున్నాను. ("లోనవ్ లా"సభజరిగినపిమ్మట ఎక్కువ విషయములు ప్రకటింపవలసి యుండుటచేత, దీనిని ఇంతకంటె త్వరితముగ ప్రకటించుటకు వీలులేకపోయినది). మీరు అప్పుడప్పుడు ఇదేరీతిని జేయుచుండు మంచి సంగతులనుగూర్చి క్లుప్తముగ వ్రాసి పంపుచుండిన ప్రచురింపగలను. ప్రస్తుతము అవసరమునుబట్టి వార్తలుగాక విద్యా సంబంధమైన వ్యాసములు ఎక్కువగ ప్రకటింపవలసి యుండుటచేతను, స్థలము విలువ అయినదగుటచేతను, అట్టివి క్లుప్తముగా నుండవలయును.

హిందీ కవాతు పదములను సంతోషపూర్వకముగ ప్రకటించుచున్నాను; వాని యుపయోగమునకు నేనెంతమాత్రమును వ్యతిరేకుడను గాను; అయినప్పటికిని, అనేకమంది భటోద్యోగులు- ముఖ్యముగా దక్షిణ హిందూదేశమునందు- వాని యుపయోగమునకు వ్యతిరేకులైయున్నారు. అందుచేత "సెంట్రలు కవున్సిలు" వారు అందరిని ఏకరీతినుండమని జెప్పుట అనుచితముగ నుండు విషయములలో నిదియొకటని నేను తలంతును. ఒకేవిధపుగు దుస్తులను ధరించు విషయముగూడ ఇదేరీతిగ నుండును. ప్రస్తుతదశయందు ఇట్టి విషయములందరును యేకరీతిగా నుండవలసినదని కోరునెడల, విశేషముగ అసంతృప్తి గలుగగలదు; అట్టి అసంతృప్తి గలుగుట మన యుద్యమమునకెంత మాత్రమును మంచిదిగాదు. నేను పలుమారు జేసిన తనిఖీయాత్రలకు ఫలితముగ నాకీ విషయము చక్కగ బోధపడినది. మంచివారును, దేశభక్తులునునగు భారతీయులగు కొందరు భటోద్యోగీయులు ఈయుద్యమమునందింకను నాకంటె నెక్కువ పాశ్చాత్యమార్గముల నభిలషించుచున్నారని వినిన మీకు ఆశ్చర్యకరముగానుండవచ్చును. ఇట్టిస్థితిగతులయందు, అట్టివారితో మనమెంతఏకీభవింపకపోయినను బలవంతపెట్టుటకు ప్రయత్నించుటవలన లాభమేమియు లేదు. ఇతరులను వారు మంచివనితలచు మార్గముల అభివృద్ధిజేసికొననిచ్చుచు ప్రతివారును వివరములయందు స్వాతంత్ర్యమును గలిగియుండుచు, ఆదర్శములందు మాత్రము యేకీభావమును గలిగియుండుట మంచిది.

ఆర్యతత్వాగారి ఉద్యోగమునుగూర్చి మీసంఘము వారుచేసిన సలహా నామోదించుచున్నాను. వారిని మీరు సూచించినరీతిగా యేర్పాటుజేసెదను. తగిన

మనిషి దొరకినప్పుడు వారిస్థానే యేర్పాటుజేయుటకు యింకొకరిని మీరుసూచింపవచ్చును.

పతకమునందు మార్పుదలజేసినయెడల దేశమునందు ఇదివరకు ప్రచారమునందున్న వందలకొలది పతకములను తీసివేయవలసివచ్చును. ఇంతేగాక ఇదివరకు తయారుచేసిన అచ్చుదిమ్మలు, నమూనాలు అన్నిటిని మార్చవలసియుండును. దీనికంతకును విశేషద్రవ్యము గూడ వ్యయమగును. అందుచేత ఈవిషయము "సెంట్రల్ కవున్సిలు" సంపూర్ణముగ యేర్పడువరకును ఆపుదలచేయవలయును. అదిగాక మీరు సూచించినమార్పుదల నాకు సరిగా తెలియలేదు. కమలమును, భానుని దీసివేయవలెనని మీతలంపా లేక వానిని హిందూదేశ పటమునం దుంచవలెననియా? సంస్కృతమునందు దీక్షావాక్యము యేమియుండవలెను? మీసూచనను పటమున వ్రాసిపంపిన ముందుకు ఉపయోగకరముగ నుండును.

జండానుగూర్చిగూడ "సెంట్రలు కవున్సిలు"వారు సంపూర్ణముగ యేర్పడిన పిమ్మటనే నిర్ణయింపవలెను. అప్పటికి కాంగ్రెసు మహాసభవారుగాని మరియొకరుగాని హిందూదేశమునకు జాతీయ పతాకమును నిర్ణయింపవచ్చునని నాకోరిక; అది జరుగువరకును మనము ఇదమిద్ధమని నిర్ణయించుటకు వీలులేదు. భారత బాలభట సంఘమునకు ఇప్పుడున్న జెండాను వాడుటయే మనము చేయదగిన పని. ఈ విషయము "లోనవ్"లాయందు చర్చింపబడినదని మీకు దెలియును; కాని తీర్మానము నకు వచ్చియుండలేదు- ప్రస్తుత పతాకమును ఉంచుటకే చాలమంది అభిప్రాయ పడుచున్నారు. (యూనియన్ జాకు జెండామధ్యను భానుని కమలమును వేసినది ప్రస్తుతపతాకము). భానుడు కమలమునకు తోడు హిందూదేశమును సూచించుటకై ఇంకేమైనవేసిన బాగుండునని కొందరు అభిలషించుచున్నారు. తాత్కాలికముగా ఈక్రింది విధమైన జండాలలో దేనినైన ఉపయోగించుకొనవచ్చునని నేను అంగీకారము నిచ్చుచున్నాను:—

౧ ఇప్పుడున్న జెండా.

౨ నాలుగు భాగములుగ విభజింపబడిన గుడ్డమీద ఈ ప్రకారము వేయవచ్చును. ఒకమూల యూనిజన్ జాక్. రెండవ భాగమున భారతవర్ష పటము. మూడవ భాగమున మనసంఘ చిహ్నముగు భానుడు కమలము దీక్షావాక్యము. నాలుగవ భాగమున రాజధానియొక్కగాని లేక పటాలము యొక్కగానిచిహ్నాలు.

ఈరెండవవిధము అన్నిఅభిప్రాయములకును చోటిచ్చుచున్నది; కావున అదిబాగున్నదని తలంతు.

ఆంధ్రదేశమునందు ఇంతత్వరితగతిని అభివృద్ధినిజూపుచుండుట నాకు మిక్కిలియానందముగ నున్నది. దేశమునందు కొన్నిభాగములు పరిపాలనను తమచేతిలోనికి దీసికొనుటయందు మందముగనున్నను, ఈయుద్యమమున రాష్ట్రస్వాతంత్ర్యము చక్కగా పనిచేయగలదని నేను నిశ్చయముగా జెప్పగలను.

---

# గ్రంథాలయోద్యమము.

## ఈయేడు సభలు.




ఆంధ్రదేశగ్రంథాలయ ప్రతినిధుల మహాసభయును, అఖిల భారత గ్రంథాలయ ప్రతినిధుల మహాసభయును, ఆంధ్రసారస్వత మహాసభయును, అఖిలభారత పత్రికాప్రదర్శనమును, అఖిల భారత గ్రంథాలయప్రదర్శనమును ౧౯౧౯ సం॥ నవంబరునెల ౧౪, ౧౫, ౧౬ తేదులయందు మద్రాసునగరమున జరుగనున్నవి. బెజవాడ రామమోహన ధర్మగ్రంథాలయమునకు, అది పుట్టిననాటినుండియు అధ్యక్షులుగను-ఆంధ్రదేశగ్రంథాలయసంఘమునకు అది పుట్టిన నాటినుండియు ఉపాధ్యక్షులుగను ఉండి- ఈ యుద్యమాభివృద్ధినిమిత్తమై నిరంతరకృషిసలిపినట్టి దేశాభిమానదక్షులగు శ్రీ సూరి వేంకట నరసింహశాస్త్రిగారు, ఆంధ్రదేశగ్రంథాలయ

ప్రతినిధుల మహాసభకు అధ్యక్షులుగ నెన్నుకొనబడిరి; వైశ్యశిఖామణులును ఆంధ్రదేశాభిమానులునునగు శ్రీసల్లాగురుస్వామిశ్రేష్ఠిగారు ఆహ్వానసంఘాధ్యక్షులుగా నేర్పడిరి. బరోడా గ్రంథాలయోద్యమాధికారియు, పరదేశములను దర్శించి గ్రంథాలయోద్యమమును గుఱించిన అపూర్వవిషయముల నెన్నింటినో దెలిసికొనివచ్చినట్టియు జే. యస్. కుడ్‌హాల్కరుగారు అఖిలభారతవర్షగ్రంథాలయసభకు అధ్యక్షులుగ నెన్నుకొనబడిరి; "హిందూ" పత్రికాధిపతులగు శ్రీ కస్తూరి రంగాఅయ్యంగారు ఆహ్వానసంఘాధ్యక్షులుగ నేర్పడిరి. "విజ్ఞానచంద్రిక" "విజ్ఞానసర్వస్వము" లకు అధిపతులును ఆంధ్ర భాషోద్ధారకులును నగు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు ఆంధ్రసారస్వతమహాసభకు అధ్యక్షులుగ నెన్నుకొనబడిరి; ఆంధ్రభాషావేత్తలగు శ్రీ వేదం వేంకట్రాయశాస్త్రులుగారు ఆహ్వానసంఘాధ్యక్షులుగ నేర్పడిరి.

ఈ వత్సరము జరుగునట్టిసభలు అనేకవిధముల ప్రాముఖ్యతను జెంది యున్నవి. ఆంధ్రగ్రంథాలయసభయొక్క ఆహ్వానసంఘమువారే అఖిలభారత గ్రంథాలయసభను సమకూర్చుట యొకటి. అఖిల భారత గ్రంథాలయప్రదర్శనము జరుగుట యొకటి. శ్రీ కుడ్‌హాల్కరుగారు తాము అమెరికా, ఇంగ్లాండు మొదలగు దేశము లన్నింటిని జూచి తీసికొనివచ్చిన అనేక పటములను, అనేక గ్రంథములను, ఇంకను ఇతర విధములగు అనేక సామగ్రులను వారు ప్రదర్శించెదరు. భారతవర్షమునందున్న వివిధభాగములయందు గ్రంథాలయోద్యమవిషయమై కొద్దిగనో గొప్పగనో తమ శక్తికొలది పాటుబడుచున్న సోదరుల నెంతమందినో మన మిచట జూడగలము. బరోడారాజ్యము, మైసూరురాజ్యము, తిరువాన్కూరురాజ్యము-ఇవిగాక భారతవర్షముయొక్క అన్ని భాగములనుండియు ప్రతినిధు లేతెంచి, తమతమ భాగములయందు గ్రంథాలయోద్యమ మెటుల పనిజేయుచున్నదో మన కిచట వివరించెదరు. పత్రికాప్రదర్శనమునకు భారతవర్షమునందున్న వివిధభాషలయందలి పత్రికలు వచ్చుచున్నవి. ఇవిగాక ప్రపంచమునందున్న నాగరికతజెందిన దేశము లన్నింటి నుండియు గూడ పత్రికలు ప్రదర్శనమునకు వచ్చుచున్నవి. అన్నిటికంటె గొప్పవిషయ మింకొకటి, మన రాజధానికి ప్రభువర్యుఁడగు శ్రీ వెల్లింగుటను ప్రభువు సభాప్రారంభసమయమున వచ్చి, ఉపన్యసించుటకు దయతో నంగీకరించి యున్నారు. ఇన్ని విధములచేత ఈ యేడుసభలు మిక్కిలి ప్రాముఖ్యతజెంది యున్నవి. కావున ఎక్కువమంది విచ్చేసి, ఈ యేడుసభలు జయప్రదమగునటుల పాటుబడెదరు గాక.

## భటోద్యమము.

గ్రంథాలయోద్యమమునకును భటోద్యమమునకును గల సంబంధమేమి యని పలువురు ప్రశ్నించుచున్నారు. "గ్రంథాలయసర్వస్వ"మందు భటోద్యమమును గూర్చి ప్రకటింపబడుచున్న వ్యాసములను శ్రద్ధతో దిలకించితిరేని ఆ సంశయము వీడగలదు. గ్రంథాలయోద్యమమునందు భటోద్యమ మొకభాగము. గ్రంథాలయములు మునుపటివలె "పుస్తకముల దుకాణములు" గావనియు, గ్రామమునంతకును ఉపకరింపదగినట్టి సాంఘికస్థానములనియు ఇదివరకు మీరు పలుమా

రు జదివియున్నారుగదా! అట్టి సాంఘికస్థానములగుటకు మనము జేయవలసిన విధులలో నొకటి సంఘసేవనము. అట్టి సంఘసేవనమును మన మిదివరకే నిర్వర్తించుచున్నను అది ఇంకను ఎక్కువ సమర్థతతోను, ఎక్కువ పట్టుదలతోడను జేయించుటకు మన కీ భటోద్యమము సంప్రాప్తమైనది. కావున గ్రంథాలయోద్యమమునుండి భటోద్యమము భిన్నమని ఎంత మాత్రమును తలంపవలసినదిలేదు. కావున గ్రంథాలయోద్యమాభిలాషులారా ! మీసేవావ్రతదీక్ష పరిపూర్ణమై, మీరు "దేవునకు, దేశమునకు, రాజునకు మీవిధ్యుక్తధర్మ మొనర్చుటకు" తగిన సమయమే తెంచినది. కావున "సిద్ధపడియుండుడు".

—అయ్యంకి వేంకట రమణయ్య.

# భ ట - ధ ర్మ ము

తొల్లి శ్రీకృష్ణభగవానులు అర్జునునకు ఉపదేశించిన ఈ క్రిందివాక్యములు భటధర్మమును చక్కగా బోధించుచున్నవి:—

"కార్య కర్మముల
నలుపుము ఫలముల సంగంబులేక
ఫలసంగరహితుడై భవ్యకర్మమును
సలిపిన జనుడు మోక్షము నొందగలడు
వలదిక సందేహపడ దీనియందు
జనకాదులైన రాజర్షులు మున్ను
ఘనముగ నిష్కామ కర్మంబుచేత
స్థిరచిత్త పరిశుద్ధిజెందిరి గాదె
కరము నీవు నిక లోకప్రయోజనము
కనుచున్నవాడవై కర్తవ్యకర్మ
మొనరింపదగుదు వత్యుత్సాహగరిమ. (3అ)

"ఎవడు బ్రహ్మమునందు నెల్లకర్మముల
సలిపి ఫలాసక్తిని బరిత్యజించి
నలుపునో యాతండు సలిలంబుచేత
వనజపత్రమువలె, పాపంబుచేత
తనుకంగ బడడు.

"గురుసమాహిత మనస్కుడు కర్మఫలము
పరిహరించి పరాత్మ పర నిష్ఠయందు
పొసగిన శాంతిని బొందుచున్నాడు. (౫అ)

ఈ వాక్యములను మనస్సునందు గురిగా నుంచుకొని తన ధర్మమును ఎవ్వరైతే నిర్వహించుచున్నారో అట్టివారు ఎట్టి కష్టసమయమందైనను ఎట్టి నిష్ఠురసమయమందైననుగాని, ఆవంతయైన ధైర్యస్థైర్యములను గోలుపోవంగజాలరు; అట్టి వారి మనస్సు ఎల్లప్పుడును నిర్మలమై, నిష్కామమై, పరిశుద్ధమై యొప్పుచుండును; సదా శాంతముతో తమ కార్యములను నిర్వర్తింప గలిగి యుందురు.

ఏ మనుజుడైనను తన మనస్సునందువిచారమునకు ఎంత మాత్రమును జోటియ్యగూడదు. విచారము మనస్సునందు బ్రవేశించినదా, ఇకదానిని స్వాధీనముజేసికొనుట కష్టము. మన విచారము మనతో నుండదు. ఇతరులకుగూడ ఆపాదించును. కావున విచారమును దరికిరాకుండ జాగ్రత్తగా కాచియుండుము. వచ్చుసూచనలు గనబడినవా ఏదో యొక కర్మను జేయుచుండుము. సత్కర్మనే నిష్కామముగ జేయుచుండుము. ఫలితమేమి సంభవించినను, నీకువిధి కృతమైన కర్మమును

జేయుచు నేయుందుము. నేడు సంభవించిన ఫలితములు నీమనస్సు నాటనియ్యకుము. విధికృతమేమియో వెదకుచు దానినే జేయుచుండుము. ఫలితములు దైవాధీనములు. దైవసమర్పితములు.

అయ్యంకి వేంకట రమణయ్య,
౫-౧౦-౧౯.

~~~~~~

# నా ప్రథమజన్మ

సిద్ధార్థినామసంవత్సర ఆశ్వయుజ శుద్ధ చవితీ శనివారమున (౨౭-౯-౧౯) ఇరువది యారు వత్సరములు వయస్సుగల నాభార్య శేషమ్మ మృతినొందినది. ఇప్పటికి నా వయస్సు ఇరువదితొమ్మిది సంవత్సరములు. ఈ నాటితో నేను తిరిగి పునర్జన్మము నొందితిని. కావున వెనుకటి జన్మమున నా భార్యతో సంబంధించినంతవరకు ముఖ్యమగు కొన్ని సంగతుల నిట వివరింతును. ౧౯౦౩ సం॥ మే నెలాఖ్రాంతమందు నాకు వివాహమైనది. ౧౯౦౭ సం॥ న కాపురమునకు వచ్చినది. నే నా సంవత్సరమందే పాఠశాలకు సంబంధించినంతవఱకు నా విద్యను సంపూర్ణము జేసితిని. రెండుసంవత్సరముల కాలము ఈ జీవయాత్ర నెట్లు గడపవలయునో నిర్ణయము చేసికొనజాలక అస్థిరమతుఁడనై యుంటిని. తుదకు ౧౯౧౯ సం. న నా యర్ధాంగలక్ష్మి సహాయమువలన, ద్రవ్యము నార్జింపదగిన ప్రవృత్తియందుగాని ప్రవేశింపకుండవలయునని యు, దేశమునకు సంబంధించినకార్యములందు చేతనైనంతవఱకు పని జేయవలయుననియు నిశ్చయించుకొన గలిగితిని అప్పటి నుండియు దేశోపయోగకరమైన కార్యముల నేనైన చేయగలిగియుండినయెడల, నాభార్యయొక్క ఉత్సాహప్రోత్సాహములును సంపూర్ణసహాయమును మాత్రమే ఆకార్యములకు కర్తలు. ఎట్టి కష్టసమయమందైన, ఎట్టి నిరుత్సాహసమయమందైన నాభార్యయొక్క చిరునగవుతోఁగూడిన ముఖకమలమే నాకు ముందుమార్గమును జూపుచుండెను.

౧౯౧౩ సం॥ న నా తండ్రిగారు మరణించిరి. నాటినుండి నేటిదనుక, ఇంటి పరిపాలనను మా తల్లిగారికి అనువర్తనముగ జరుపుచు, నేను నా కాలమునం దెక్కువభాగమును దేశమునకు సంబంధించిన పనులయందు వినియోగించుట కవకాశమును గల్పించినది. ఇంటిలో పిల్లలకు జబ్బుగానుండు సమయములందు గూడ నేను బయలుదేరి ఇతర గ్రామములకేగి వారముల తరబడి పక్షములతరబడి ఉండవలసివచ్చినను, ఎంతమాత్రమును నిరుత్సాహపరుపక ప్రోత్సాహపరచుచునే వచ్చినది. మాకు ౧౯౧౪ సం॥ నం దొక మగశిశువును, ౧౯౧౫ సం. నం దొక మగశిశువును నాభార్య మరణదినమగు ౨౭-౯-౧౯ తేది ఉదయము ౫-౩౦ గంటలకు మఱియొక మగశిశువునుగలిగిరి. ముగ్గురును చిరంజీవులై యున్నారు. మా సంసారయాత్ర యం దింతవఱకు సంసారమువలన గలుగవలసిన కష్టము లన్నిఁటిని నాభార్యయు, సుఖము లన్నిఁటిని నేనును పంచుకొంటిమి.

ఇక ముందునుండియు కష్టములను మాత్రము న న్ననుభవింపుమని, సుఖములను
~~~~~~

RSVM01 A 114



తనతో గూడ దీసికొని పోయినది. నా భావి జీవయాత్రయందు నా భార్యయొక్క ముఖకమలమే నన్ను సత్పథమున దీసికొనిపోవుగాకయని భగవంతుని నిరంతరము ప్రార్థించుచున్నాను.

నా భార్యకు జబ్బుగ నున్నదని వినగనే కొంతమంది శ్రీకాళహస్తి శ్రీతిరుపతిమున్నగు మహాస్థలములయందామె ఆరోగ్యమునకై పూజలు సల్పి ప్రసాదములనంపి ఆమె కిమ్మని కోరిరి. నన్ను పరామర్శించుచు అనేకమంది ఉత్తరములు వ్రాసిరి. అనేక గ్రంథాలయములు బాలభటపటాలములు సభలు జేసి తమ సానుభూతిని దెలిపిరి; అట్టివా రందఱకిని వందనములు. వారు సూచించిన సంగతులను జ్ఞప్తియందుంచుకొని, వారి సలహాలను నాదృక్పథమందు బెట్టుకొనెదను.

"మీధైర్యంబు బరీక్షసేయుటకునై మీకీభవంబందు నీ
బాధన్ గల్గఁగఁజేసె దైవమని నేభావింతు; గ్రంథాలయ
ప్రాధాన్యంబు మఱింతగా నరసి తద్రక్షన్ బ్రవర్తింపు; డ
య్యా! ధీరుల్ భువిలో మహాపదలఁగాద్దా వన్నియల్ గాంచుటల్."

అని ఒకస్నేహితుడు సూచించియున్నాడు, ఈసూచనను ఎల్లప్పుడును జ్ఞప్తియందుంచుకొని ఆ ప్రకారము వర్తించునటుల జేయుమని నా పరాత్పరుని సదా వేడుచున్నాను.

అయ్యంకి వేంకట రమణయ్య,
౫–౧౦–౧౯౧౯.

---

# దేశభక్తుఁడు.

సీ. సాగరోదకమంత • సాంతమానట్లుగా, నింకిన నొకవేళ • నింకవచ్చు
కులపర్వతాలన్ని • కూకఁటివ్రేళ్ళతో, కూలిన నొకవేళ • కూలవచ్చు
సూర్యచంద్రాదులు • సుడిబడి యొకవేళ, తమగతుల్ దప్పిన • దప్పవచ్చు
మింటితారలవన్ని • వెంటనే మంటిపై, డుల్లిన నొకవేళ • డుల్లవచ్చు

తే. గీ. అగ్నిశైత్యంబు నొకవేళ • అమృతమూష్ణ భావమందిన నందగా • బడునుగాని
ఎట్టి దుస్థితిదొడరిన • నెప్పుడైన దేశభక్తిని విడుతురే • ధీరమతులు.

—సత్తెనపల్లి హనుమంతరావు.

---

**బాలభటులకు సూచన:**— ౧౯౧౯ సం॥ నవంబరు ౧౭, ౧౮ తేదీలయందు మద్రాసుపట్టణము, జార్జిటవును గోవిందప్పనాయక వీధియందున్న "సౌందర్యమహాలు" నందు ఆంధ్రదేశ బాలభటోద్యోగులమహాసభజరుగును. కావున బాలభటోద్యోగులందరును విచ్చేయుదురని ప్రార్థన. సభ ౧౭ వ తేదీ మధ్యాహ్నము ౨ గంటలకు ప్రారంభమగును.

బెజవాడ,
౨౨—౧౦—౧౯.

అయ్యంకి వేంకట రమణయ్య,
ఆంధ్రరాష్ట్రీయకమీషనరు.

# బాలభటగ్రంధములు

భారత బాలభట సంఘముయొక్క ఆంధ్ర శాఖవారిచే ప్రకటింపఁబడినవి.

౧ "బాలభటులమైయుండుటెందుకు?" బాలభటోద్యమమునుగూర్చి తెలిసికొనగోరువారందఱును ఈగ్రంథమునుతప్పక జదువవలెను. ఈయుద్యమమునుగూర్చిన విషయములన్నియు యింనువిపులముగాదెలియఁజెప్పఁబడియున్నవి. ఆంధ్రరాష్ట్రీయ సైన్యాధిపతియగు అయ్యంకి వేంకటరమణయ్యగారిచే వ్రాయఁబడినది. వెల ౦-౧-౦ మాత్రమే.

౨ "బాలభటపటాలములను గూర్చుటెట్లు?" ఒకగ్రామమందు క్రొత్తగా బాలభటపటాలములను కూర్చదలచు వారందఱును దీనిని తప్పక పఠింపవలెను. అందులకు గావలసిన అనుభవపూర్వకమగు విషయములెన్నియో యింను దెలుపఁబడినవి. ఆంధ్రరాష్ట్రీయ సైన్యాధిపతియగు అయ్యంకి వేంకటరమణయ్యగారిచే వ్రాయఁబడినది. వెల ౦-౧-౦ మాత్రమే.

3 "బాలభటుని తరిబీతు-ప్రాథమికపరీక్ష." ప్రాధమిక పరీక్షయం దు గావలసినంత వఱకు బాలభటుఁడు నేర్వవలసిన విషయములన్నియు యిందువిపులముగా [illegible] ఁబడియున్నవి. ఆంధ్రరాష్ట్రీయ ప్రధానసైన్యాధిపతియగు అయ్యంకి వేంకటరమణయ్యగారిచే వ్రాయఁబడినది. వెల ౦-౨-౦ మాత్రమే.

౪ "జాతీయ కీర్తనలు" బాలభటులు అత్యావసరముగా నేర్వవలసినవన్నియు యిందుగలవు. ముద్దులమూటగట్టు రెండుపటములతో నొప్పారుచున్నది. వెల ౦-౧-౦ మాత్రమే.

౫ "బాలభటుని కవాతు-అక్షరావధానము" యీగ్రంథమును బాలభటులందఱును దగ్గ నుంచుకొనిన ఈ రెండు విషయములందును అప్పుడప్పుడు గలుగు సందేహములను దీర్చుకొనుటకు మిక్కిలి సహాకారిగనుండును. వెల ౦-౧-౦ మాత్రమే.

అచ్చులగుచున్న గ్రంథములు:—౧ బాలభటుని యాటలు. ఆంధ్రరాష్ట్రీయ సహాయసైన్యాధ్యక్షులగు కావలి శంకరరావుగారిచే వ్రాయఁబడినది.

౨ బాలభటుని తరిబీతు-మధ్యమ తరగతిశిక్ష. 3 బాలభటుని తరిబీతు-ఉత్తమతరగతిశిక్ష. ౪ బాలభటోద్యమము—ఇంతవరకు జరిగిన [illegible].

చిరునామా:— భారతబాలభటసంఘము, బెజవాడ.

---

# ప్రకృతి.

ఆరోగ్యవిషయిక మాసపత్రిక.

సం॥చందా రు 1-[illegible] మాత్రమే. చందాదారులకు "ఋషి.జీవనప్రకాశ" మనుపుస్తకము ఉచితము. ఇందుసకలవ్యాధులకు సులభములును నిరపాయకరములునగు ప్రాకృతచికిత్సా పద్ధతులును, యోగవిషయములును, బ్రహ్మచర్యవిషయము[illegible]గూర్చిన వ్యాసములును, ఆరోగ్యవృత్తాంతములును, వైద్యవిషయిక ప్రశ్నోత్తరములు, నవలలు, ప్రహసనములు, సంభాషణలు, మున్నగునవి ప్రకటింపబడుచుండును. ఆరోగ్యముగోరువారలకు, ముఖ్యముగా నిరౌషధ(జల)చికిత్సాభిమానులకత్యంత [illegible] ప యుక్తము. [illegible] ప్రతులుమాత్రమే ముద్రింపబడుచున్నవి. త్వరపడుడు. చికిత్స, పథ్యము మున్నగువిషయము[illegible] శంకలకు పత్రికాముఖమున సమాధానములు ప్రకటింపబడుచుండును.

[illegible] హరి శెట్టి హనుమయ్య, ప్రకృతి ఆఫీసు, బెజవాడ, అని వ్రాయవలయును.

# మంచిగ్రంథములెవ్వి ?

౧ అందముగ నున్నదా ?
౨ మంచిభాషయందు వ్రాయఁబడెనా ?
౩ మనజీవితవిధానమును తెలుపునా ?
౪ మనజ్ఞానమును అభివృద్ధిచేయునా ?
౫ మనవ్యవహారమునకు ఉపకరించునా ?
౬ హితమునుబోధించునా ?
[illegible] మార్గజీవితమునకు సాయపడునా ?
[illegible] జీవితములను సారవంతము చేయునా ?
[illegible] లె ప్రేమింపతగియున్నదా ?

ఈ [illegible] లన్నిటిని సంతృప్తి పరచగల మంచిగ్రంథములనే పఠింపవలసినదని, ప్రథమ నెల్లూరు [illegible]డలగ్రంథాలయ ప్రతినిధుల మహాసభకు అగ్రాసనాధిపత్యము వహించిన

## వావిలకొలను సుబ్బారావుపంతులు గారు,

తమ అధ్యక్షోపన్యాసమునందు శెలవిచ్చియున్నారు.

## అట్టిగ్రంథములు ఏవి?

## నవ్యభారత ఋషిపుంగవులగు

౧ లోకమాన్యతిలకు మహారాజు జీవితచరిత్ర ఉపన్యాసములు.
౨ మహాత్మా గాంధిమహాశయుని జీవితచరిత్ర ఉపన్యాసములు.
౩ లోకమాత ఆనీబీసెంటమ్మ జీవితచరిత్ర ఉపన్యాసములు.
౪ మహమ్మదాలీ జీవితచరిత్ర ఉపన్యాసములు.

## ఆంధ్ర కవిపుంగవులగు

నాచన సోమనాథుఁడు
పింగళి సూరన్న.

## ఆంగ్లేయ వీరపుంగవుఁడగు

కిచనరుప్రభువు జీవితచరిత్ర.

ఈగ్రంథములను వ్రాయుచున్న కవిపుంగవుల నామములు, వెలలు, [illegible]రకుస్థలము— మున్నగు వివరములకై రాఁబోవు గ్రంథాలయ సర్వస్వముయొక్క ఈపు[illegible]లనే [illegible]డు.

| | మనసు ఫౌండేషన్<br>పుస్తకాల పరిశీలనాపట్టిక |
|---|---|

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 114 |
| పుస్తకం పేరు | గ్రంథాలయ సర్వస్వము |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 53 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | 5 |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | pragathi |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | good |